మార్చి
2026

సంపుటి : 21 సంచిక : 10

239

వెల రూ. 15/-

# మార్క్సిస్టు

MARXISTU

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

స్రామ్రాజ్యవాద దశలో పెట్టుబడి
సామ్రాజ్యవాద వ్యూహంలో భాగమే వెనిజులాపై అమెరికా దాడి
ఉత్తర భారతం: సామ్రాజ్యాల మధ్య పోరు
భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం:
పరిగణనలోకి తీసుకోవలసిన 5 ముఖ్యాంశాలు
మతం సాంస్కృతిక ఆయుధంగా ఎలా మారింది?
డబ్ల్యుఇఎఫ్ వేదికగా సామ్రాజ్యవాదుల కీచులాట
సార్వభౌమత్వానికి తిలోదకాలిస్తున్న బిజెపి ప్రభుత్వం
అసత్య ప్రచారాల పుట్ట ఆర్ఎస్ఎస్

**ఆర్ఎస్ఎస్ తప్పుడు సిద్ధాంతాలు - 3**

# అసత్య ప్రచారాల పుట్ట ఆర్ఎస్ఎస్



రచయిత హైదరాబాద్ ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

పిబి చారి

ప్రపంచంలోనే అనేకమంది చరిత్ర కారులు, అలాగే మనదేశంలోని ఆధునిక చరిత్రకారుల పరిశోధనా ఫలితంగా వచ్చిన నిర్ధారణ ఏమంటే... ఆర్యులు మధ్య ఆసియా మీదుగా ఆఫ్ఘనిస్తాన్ ద్వారా, హిందూ కుష్ పర్వతాల గుండా, మన దేశ వాయువ్య సరిహద్దుల నుండి భోలన్, కైబర్ కనుమల ద్వారా భారత దేశంలోకి క్రీస్తుపూర్వం 2000 సంవత్సరాల నుండి వలసలుగా వచ్చారు. జన్యు శాస్త్ర ఆధారాలు తిరుగులేనివిధంగా పై విషయాన్ని నిరూపించాయి. కానీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తలు మాత్రం ఆర్యులు బయటనుంచి రాలేదనీ, వాళ్లు ఇక్కడే పుట్టారనీ వాదిస్తారు. అలాగే ఆర్యులు భారత దేశంలోకి వచ్చినప్పుడు వారు కేవలం సంచార జీవులు, పశుపాలకులు మాత్రమే. కానీ వారు గొప్ప నాగరికలని ఆర్ఎస్ఎస్ వారు చెబుతారు. ఆర్యులు మన దేశం నుండి ఇతర దేశాలకు విస్తరించి, అక్కడ సామ్రాజ్యాలను స్థాపించారనీ, అలాంటి సామ్రాజ్యాలను మనం తరువాత కోల్పోయామనీ, ఇప్పుడు వాటన్నింటినీ ఒకే చత్రం కిందికి తీసుకురావాలని చెబుతుంటారు. అఖండ భారత్‌ను పునరుద్ధరించాలి, కాస్పియన్ సముద్రం అంటే మన "కశ్యప రుషి" పేరు మీద వచ్చిన సముద్రమే, ఆస్ట్రేలియా అంటే అది ఒకనాటి మన "అస్త్రాలయ"అంటే ఆయుధాలు దాచి వుంచే ప్రదేశం... ఇలా ఇతర దేశాల పేర్లనూ, సముద్రాల పేర్లనూ సంస్కృతీకరించి, వ్యుత్పత్తి అర్థాలు లాగి మనల్ని నమ్మమంటారు.

ఇలా చెప్పే వాటన్నింటికీ మూలం గోల్వాల్కర్ రాసిన పాంచ జన్యం గ్రంథం (ఇంగ్లీషులో బంచ్ ఆఫ్ థాట్స్) లో మనకు కనపడుతుంది. ఆర్యులు ధ్రువ ప్రాంతంలో నివసించారని బాలగంగాధర తిలక్ లాంటి వాళ్ళు చెప్పారు కదా, ఆ ఉత్తర ధ్రువం ఈనాటి ఆర్యవర్తనంలోనే ఉన్నదనీ, మన దేశంలోని బీహార్ ఉత్తరప్రదేశ్ ప్రాంతమే ఉత్తర ధ్రువం అని ఆయన తన పాంచ జన్యంలో పేర్కొన్నారు. జాగ్రఫీ ప్రకారంగానీ, చరిత్ర ప్రకారంగానీ ఏమాత్రం అంగీకరించ వీలులేని విషయాలు గోల్వాల్కర్ రచనల్లో మనకు అనేకం దర్శనమిస్తూ ఉంటాయి. ఈయన ముస్లింలకు, క్రిస్టియన్లకు ఇతర హైందవేతరులకు వ్యతిరేకంగా విషం చిమ్ముతాడు. ఈనాడు మన దేశంలో ఉన్న ముస్లిం జనాభా, ఆనాడు వారు దేశవ్యాప్తంగా కొనసాగించిన మారణహోమా ఫలితాల్లో ఒకటంటాడు. అంతేకాదు భగ్న భవనాలు, భగ్న సమాజం కూడా వారి కిరాత కాలకు సాక్ష్యమేననీ, ఇలా ముస్లింల వలన దెబ్బతిన్న ఈ సమాజాన్ని ఇప్పుడు మనం పునరుద్ధరించాలనీ చెబుతాడు. 'వాళ్లు పరాయి వాళ్ళు, దురాక్రమణదారులు. హిందుస్థాన్‌లో నివసించే ఈ ముస్లింలే కాకుండా ఇతర పరాయి జాతులు కూడా హిందూ సంస్కృతిని, భాషను అనుసరించాలి. హిందూజాతి వైభవాన్ని గుర్తెరిగి నడుచుకోవాలి. హిందూ దేశంలో నివసిస్తున్న ఏ జాతి వారైనా సరే తమ అస్తిత్వాన్ని వదిలి హిందూ జీవన స్రవంతిలో కలిసిపోవాలి. హిందూ జాతికి సంపూర్ణ విధేయులుగా బ్రతకడం తప్ప ప్రత్యేకమైన జీవన విధానాన్ని గుర్తింపును కోరకూడదు, ఆఖరుకు పౌరహక్కులతో సహా' అంటూ గోల్వాల్కర్ అల్టిమేటం జారీ చేశాడు. ఈనాడు మనం చూస్తున్న "ఘర్ వాపసి" అనే ప్రచారం గోల్వాల్కర్ నుండి ప్రారంభమైంది.

ఆర్ఎస్ఎస్ అధినేత అయిన గోల్వాల్కర్ దృష్టిలో జాతి అంటే మతమే. హిందూ సమాజమే మన భగవంతుడు అంటాడాయన. "హిందూ సమాజమే సర్వశక్తివంతమనీ, పరమేశ్వరుని యొక్క అభివ్యక్తమైన విరాట్ స్వరూపమనీ వారన్నారు. బ్రాహ్మణుడు అతని శిరస్సు, క్షత్రియుడు అతని చేతులు, వైశ్యులు అతని తొడలు, శూద్రులు అతని పాదములు. ఈ విధమైన చతుర్ వర్ణ వ్యవస్థ కలిగి ఉన్న ప్రజానీకం, అంటే ఈ హిందూ సమాజమే మన భగవంతుడని దీని అర్థం" అని ఆయన రాశాడు. అంటే ఈ ఆధునిక ప్రజాస్వామిక సమాజాన్ని నాలుగు వర్ణాల వ్యవస్థవైపు, శూద్రులు, అతిశూద్రులకు ఎలాంటి హక్కులు లేని అసమాన తిరోగమన సమాజం వైపుకు నడపాలనేది ఆయన భావం.

"టెరిటోరియల్ నేషనాలిటీ"గురించి ఆర్ఎస్ఎస్ భావాలు ఎలా ఉన్నాయంటే దేశంలో కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీలు "టెరిటోరియల్ నేషనాలిటీ" అంటే భారతదేశ భూభాగం గురించి మాట్లాడుతున్నాయి. కానీ ఆర్ఎస్ఎస్ భారతదేశ భూభాగం, లేదా భౌగోళిక భూభాగం అనేదాన్ని అంగీకరించదు. భౌగోళిక జాతీయతను గుర్తించదు. ప్రపంచంలో ఎక్కడైనా అనేక దేశాల్లో నేషన్ స్టేట్స్‌గా ఏర్పడ్డాయి అంటే భౌగోళిక సరిహద్దులను కలిగి ఉన్నది అని అర్థం. యూరప్‌లో అనేక దేశాలు అలానే ఏర్పడ్డాయి. కానీ హిందూ జాతికి, హిందూ దేశానికి స్థలము కాలములు లేవు. స్థల కాలాలకు అతీతమైనది మన హిందూ జాతి అంటుంది ఆర్ఎస్ఎస్. మా నేషనలిజం, మా జాతీయ వాదం, సంస్కృతికి సంబంధించింది. సంస్కృతి అంటే మళ్ళీ హిందూ మతాన్ని అవలంబించే వాళ్లదే.

మొదటి నుండి మన దేశం అనేక జాతులుగా, ప్రాంతాలుగా, అనేక భాషలతో, అనేక కులాల కలయికగా ఉన్నది. మనది బహుళత్వ సమాజం. సంకీర్ణ సంస్కృతి ఉన్నది. బహుళత్వంలో ఏకత్వం ఉన్నది. అలా మనది బహుళత్వ సంకీర్ణ సంస్కృతి. అదే భావనను జవహర్ లాల్ నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో కూడా వ్యక్తపరిచారు. ఆర్ఎస్ఎస్ నెహ్రూ భావనను తిరస్కరిస్తూ, ఆయనను విమర్శిస్తూ, ఈ దేశం బహుళత్వం కాదు, ఏకత్వజాతి అంటుంది. ఆనాడు రాజ్యాంగ పరిషత్తులో కూడా ఇదే భావన ఉన్న ఆర్ఎస్ఎస్ ఆలోచనపరులు.. ఈ దేశం ఫెడరల్ స్టేట్ కావటానికి వీల్లేదు, యూనిటరీ స్టేట్ కావాలని వాదించారు. ఆర్ఎస్ఎస్ వాళ్ల పత్రిక ఆయన ఆర్గనైజర్ ఆనాడు రాజ్యాంగ సభ జరుగుతున్న రోజుల్లో 1949 నవంబర్ 26 తర్వాత, అలానే 1950 జనవరి 26 తర్వాత ఈ దేశం వేరు వేరు జాతుల మతాల కులాలతో కూడిన బహుళత్వ దేశం, సంకీర్ణ సంస్కృతి అనే పేరుతో, కాంగ్రెస్ పార్టీ దేశాన్ని చీల కొట్టడానికి ప్రయత్నిస్తుంది అని రాసింది. ఆర్ఎస్ఎస్ దృష్టిలో 1947 ఆగస్టు 15 కు ఎలాంటి ప్రాధాన్యత లేదు

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. అసత్య ప్రచారాల పుట్ట ఆర్ఎస్ఎస్

పిబి చారి........2

2. సామ్రాజ్యవాద దశలో పెట్టుబడి

ప్రభాత్ పట్నాయక్ .....4

3. సామ్రాజ్యవాద వ్యూహంలో భాగమే వెనిజులాపై అమెరికా దాడి

ఆంద్రీ డెమన్......14

4. ఉత్తర భారతం: సామ్రాజ్యాల మధ్య పోరు

ఎంవిఎస్ శర్మ.....17

5. భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం: పరిగణనలోకి తీసుకోవలసిన 5 ముఖ్యాంశాలు

'ది వైర్' విశ్లేషణ ....21

6. మతం సాంస్కృతిక ఆయుధంగా ఎలా మారింది?

పురుషోత్తమ్ .......23

7. డబ్ల్యుఇఎఫ్ వేదికగా సామ్రాజ్యవాదుల కీచులాట

రోజర్ జోర్డాన్, కీత్ జోన్స్......29

8. సార్వభౌమత్వానికి తిలోదకాలిస్తున్న బిజెపి ప్రభుత్వం

ఎ కోటిరెడ్డి .....31



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# మోడీ గారి "మేక్ అమెరికా గ్రేట్"

'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనే నినాదంతో డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆ దేశాన్ని మళ్లీ గొప్ప దేశంగా మార్చడానికి యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలు చేస్తున్నాడు. బెదిరింపులు, బుజ్జగింపులకు పాల్పడుతున్నాడు. అమెరికాను గొప్ప దేశంగా మార్చడానికి ఆయనకు నరేంద్ర మోడీ రూపంలో ఒక గొప్ప స్నేహితుడు దొరికాడు. విషాదం ఏమిటంటే అమెరికాను గొప్ప దేశంగా మార్చడం కోసం మోడీ గారు 140 కోట్ల మంది భారతీయులను, ముఖ్యంగా కోట్లాది మంది భారతీయ రైతులను బలి తీసుకుంటున్నారు. మోడీ ప్రభుత్వం ఒక్క అమెరికా సామ్రాజ్యవాదులకే కాదు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా బ్రిటిష్, యూరోపియన్ సామ్రాజ్యవాదులందరికీ సేవచేయడానికి కంకణం కట్టుకున్నది. ఆ క్రమంలో భారత ప్రజల జీవితాలను నిండా ముంచేయడానికి సిద్ధపడిపోయింది.

ఇటీవల అమెరికాతో భారత దేశం వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకున్న సందర్భంగా విడుదలైన సంయుక్త ప్రకటనలోని మొదటి పేరాలో ఇలా ఉంది: "అమెరికాకు చెందిన అన్ని రకాల పారిశ్రామిక వస్తువులపైనా, వ్యవసాయ ఉత్పత్తులపైనా సుంకాలను భారత దేశం ఎత్తివేస్తుంది. వ్యవసాయోత్పత్తుల్లో పశువుల మేతకు ఉపయోగించే జొన్నలు, ఇథనాల్ ఉత్పత్తి తరువాత మిగిలిన పొట్టు, పళ్లు, సోయాబీన్ నూనె, మద్యం, స్పిరిట్స్ ఇతర ఉత్పత్తులు ఉంటాయి." వ్యవసాయంలో ఇతర ఉత్పత్తుల జాబితాలోకి ఏమైనా రావచ్చు. భారత దేశంలో ఆహార ధాన్యాలకు విదేశీ సుంకాలనుండి రక్షణ కల్పిస్తాం అని ఎక్కడా లేదు. అంటే అర్థం ఏమిటి? భారత వ్యవసాయ రంగాన్ని అమెరికా వ్యవసాయ బహుళజాతి కంపెనీలకు బలి చేయడానికి సిద్ధమైపోయారన్నమాట. దీనికితోడు అమెరికా నుండి భారత దేశం 500 బిలియన్ డాలర్ల అంటే సమారు 47 లక్షల కోట్ల రూపాయల ఇంధనం, సాంకేతిక, వ్యవసాయ, బొగ్గు ఇతర ఉత్పత్తులను తప్పకుండా దిగుమతి చేసుకోవాలన్న షరతు పెట్టారు.

అమెరికా ప్రభుత్వం ఆ దేశంలోని రైతులకు సబ్సిడీలు విపరీతంగా ఇస్తుంది. ఉదాహరణకు 2026లో అమెరికన్ రైతులకు సగటున ఒక్కో రైతుకు రూ. 21.56 లక్షలు సబ్సిడీ ఇవ్వడానికి కేటాయింపులు చేశారు. మన దేశంలో ఒక్కో రైతుకు సగటున రూ. 34,000 అందజేస్తున్నారు. మన రైతుల్లో 86 శాతం రైతులకు 5 ఎకరాల లోపు భూమి మాత్రమే ఉన్నది. అందువల్ల ప్రభుత్వం నుండి భారీగా సబ్సిడీ పొందుతున్న అమెరికా వ్యవసాయోత్పత్తును పేదరైతుల వ్యసాయంపై ఆధారపడ్డ భారత దేశంతో పోటీ పెడితే ఎవరు నాశనమైపోతారో, ఎవరు మిగులుతారో చెప్పడానికి పెద్దగా పాండిత్యం అక్కరలేదు. వాణిజ్య ఒప్పందం కుదరక ముందే అమెరికా నుండి భారత దేశం పత్తి దిగుమతులు పెంచడం వల్ల మన దేశంలో పత్తి ధరలు పడిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అమెరికా కన్నా ముందు మోడీ ప్రభుత్వం బ్రిటన్ ఐరోపా యూనియన్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. సామ్రాజ్య వాదులకు లాభం చేకూర్చే ఈ ఒప్పందాల వల్ల మన ప్రజల ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. 1970వ దశకంలో వచ్చిన హరిత విప్లవంవల్ల మన దేశం ఆహార స్వయం సమృద్ధి సాధించగలిగింది. మళ్లీ మనం ఆహారభద్రను కోల్పోతే మన దేశ స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. అందువల్ల సామ్రాజ్యవాదులకు లొంగిపోకుండా మన దేశ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే స్వతంత్ర విధానాలు అమలు పరచాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మన స్వావలంబనను ముఖ్యంగా ఆహార స్వావలంబనను విడనాడకూడదు.

భారత్‌కు మరింత తలవంపులు తెచ్చే విషయం ఏమంటే అమెరికా-భారత వాణిజ్య ఒప్పందంలోని అంశాలను అమెరికా అధ్యక్షుడు తన సోషల్ మీడియా వేదిక ద్వారా లోకానికి వెల్లడించాడు. దీని ప్రకారం భారత్ మీద అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తుంది. అమెరికా మీద మాత్రం మోడీ ప్రభుత్వం ఒక్క శాతం కూడా సుంకాలు లేకుండా దిగుమతులు చేసుకుంటానని ఒప్పుకుంది. అంతేకాదు రష్యా నుండి చౌకగా లభిస్తున్న చమురు దిగుమతులను ఆపేస్తానని మోడీ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. ఇప్పటికే రష్యా నుండి చమురు దిగుమతులను మోడీ ప్రభుత్వం బాగా తగ్గించేసింది. ఈ పరిణామాలను చూస్తే అమెరికా-భారత్ మధ్య వాణిజ్య 'ఒప్పందం' ఏమీ లేదనీ, మన ప్రధాని మెడలు వంచి అంగీకరింపజేసిందని అర్థమవుతుంది. అమెరికాను గొప్ప దేశంగా మార్చడానికి నరేంద్ర మోడీ భారత ప్రజల ప్రయోజనాలను, ముఖ్యంగా మన రైతాంగ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని అర్థమవుతోంది. సామ్రాజ్యవాదుల ముందు ఈ వినాశనకరమైన లొంగుబాటుకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, భారత ట్రేడ్ యూనియన్లు, వ్యవసాయకార్మికులు, గ్రామీణ శ్రామికులకు చెందిన ఐక్య వేదిక మార్చి 24న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. రానున్న సుదీర్ఘ పోరాటానికి ఈ కార్యక్రమం గొప్ప నాంది కావాలి!

ఈ మాసం ముఖ్యాంశం

# సామ్రాజ్యవాద దశలో పెట్టుబడి

ప్రభాత్ పట్నాయక్



రచయిత ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రవేత్త

**(లెనిన్ రాసిన 'సామ్రాజ్యవాదం: పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' గ్రంథానికి ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ రాసిన ముందుమాటను సంక్షిప్తీకరించి మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం...సంపాదకుడు)**

మార్క్సిజాన్ని 20వ శతాబ్దపు విప్లవ కార్యాచరణకు అనుగుణంగా పెంపొందించడమేకాక, ఆ సిద్ధాంత పునాదులను సైతం బలోపేతం చేసినవాడు లెనిన్. అందుకే ఆ సిద్ధాంతాన్ని మార్క్సిజం- లెనినిజం అని అంటాం. ఆ కృషిలో భాగంగానే లెనిన్ "సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అన్న రచనను 1916 వేసవిలో పూర్తి చేశారు. అప్పటికి మార్క్స్ "పెట్టుబడి" గ్రంథం మొదటి సంపుటం విడుదలై దాదాపు 50 సంవత్సరాలు పూర్తయింది. ఆ తర్వాత కాలంలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం నడక ఏ తీరున సాగిందో లెనిన్ ఈ గ్రంథంలో వివరంగా పరిశీలించారు. ఆ అధ్యయనం ఆధారంగానే సామ్రాజ్యవాదం అనేది పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో ఒక ప్రత్యేకమైన దశ అనీ, ఈ దశతో పెట్టుబడిదారీ విధానం తన అత్యున్నత స్థాయికి చేరిందని గ్రహించారు. పెట్టుబడిదారీ సమాజంలో ఉండే అన్ని వైరుధ్యాలూ ఈ సామ్రాజ్యవాద దశలో అత్యంత తీవ్రతను సంతరించుకుంటాయని గమనించారు.

ఇంగ్లండ్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, పోర్చుగల్, హాలండ్, బెల్జియం, జర్మనీ, రష్యా తదితర యూరపియన్ దేశాలలో పెట్టుబడిదారీ విధానం తలెత్తి, బలపడింది. ఆ క్రమంలోనే ఈ దేశాలనుండి వలసలు పోయినవారు అమెరికా ఖండాన్ని దుర్మార్గంగా ఆక్రమించుకున్నారు. ఆ విధంగా అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, కెనడా వంటి దేశాలకు పెట్టుబడిదారీ విధానం విస్తరించింది. నిరంతరం విస్తరించే మార్కెట్లు పెట్టుబడిదారుల లాభాలు పెరగడానికి అవసరం. ఆ మార్కెట్లకు అవసరమయే సరుకులను ఉత్పత్తి చేయడానికి ముడిసరుకులు, ఉత్పత్తి చేసే శ్రామికులు కూడా అవసరం. ఈ అవసరాలను నెరవేర్చడానికి ఈ పెట్టుబడిదారీ దేశాలు తక్కిన ప్రపంచ దేశాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకుని పెత్తనం సాగించాయి. అదే వలసవిధానం. ప్రపంచ మార్కెట్లను ఆక్రమించుకునే ఈ వేటలో వెనుకబడిన జర్మనీ తదితర దేశాలకు విస్తరించడానికి మార్కెట్లు మిగలని పరిస్థితి వచ్చింది. అప్పుడు ఆ పెట్టుబడిదారీ దేశాల మధ్య ప్రపంచ మార్కెట్ల పునర్విభజన కోసం ఘర్షణ మొదలైంది. అది మొదటి ప్రపంచయుద్ధానికి దారి తీసింది.

యూరప్ దేశాలన్నీ ఈ యుద్ధంలోకి ఈడ్చబడ్డాయి. ఆ దేశాలలోని కార్మికవర్గం కూడా యుద్ధంలోకి లాగబడింది. రెండవ ఇంటర్నేషనల్‌లో ప్రధానంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలు యూరప్ దేశాలవే. ఇప్పుడు వచ్చిపడిన ఈ యుద్ధంలో ఆ పార్టీలు ఏ వైఖరి తీసుకోవాలి? తమ తమ దేశాల తరఫున యుద్ధంలో పాల్గొంటూ ఆయా దేశాల కార్మికులు పరస్పరం తలపడాలా? వద్దా? తమ దేశం పట్ల భక్తి ఉన్న కార్మికులు అప్పుడు ఏం చేయాలి? దేశభక్తితో పరస్పరం ఇరుగుపొరుగు దేశాల కార్మికులు యుద్ధంలో తలపడితే అప్పుడు కార్మికవర్గ అంతర్జాతీయ ఐక్యత విచ్ఛిన్నం కాదా? ఏ వైఖరి తీసుకుంటే తమ తమ దేశాల్లో ముందుకు సాగుతున్న విప్లవోద్యమాలు మరింత ముందుకు పురోగమిస్తాయి?

ఇటువంటి క్లిష్టమైన పరిస్థితుల్లో సరైన నిర్ణయం తీసుకోవాలంటే ముందు సామ్రాజ్యవాదం స్వభావాన్ని సక్రమంగా అర్థం చేసుకోవలసివుంటుందని లెనిన్ గ్రహించాడు. ఆ అవగాహన ప్రాతిపదికన శ్రామిక వర్గం తన విప్లవ కార్యాచరణను రూపొందించుకోవలసివుంటుందని భావించాడు. ఆ నాటి చారిత్రిక పరిస్థితుల్లో విప్లవ కార్యాచరణ ముందుకు సాగడానికి కావలసిన సైద్ధాంతిక, రాజకీయ అవగాహన కల్పించడానికి "సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అన్న గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథం ప్రాధాన్యతను పూర్తిగా గ్రహించాలంటే ఆనాటి చారిత్రిక సందర్భాన్నీ, ఆ కాలంలో ఏర్పడిన సైద్ధాంతిక గందరగోళాన్నీ , దాని వలన విప్లవ కార్యాచరణకు కలిగిన ఆటంకాలనూ మనం వివరంగా తెలుసుకోవాలి.

యూరపియన్ కార్మిక వర్గం మీద, ప్రత్యేకించి జర్మన్ కార్మిక వర్గం మీద మార్క్సిజం సైద్ధాంతికంగా పట్టు సాధించే తరుణంలోనే అది ఒక పూర్తి కొత్త తరహాకు చెందిన సవాలును ఎదుర్కొంది. ఈ సవాలు వచ్చినది మార్క్సిస్టు వ్యతిరేకులనుంచి కాదు. అది మార్క్సిస్టు శ్రేణులనుంచే వచ్చింది. 1888 నుంచీ ఎంగెల్స్‌కు సన్నిహిత మిత్రుడిగా ఉంటూ జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీలో ప్రముఖ సభ్యుడిగా ఉన్న ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ 1901లో మార్క్సిజాన్ని సమూలంగా సవరించాలని (ఇంగ్లీషులో సవరణను రివిజన్ అంటారు. అందుకే బెర్న్‌స్టీన్ వాదనను రివిజనిజం అంటారు) వాదన ముందుకు

తెచ్చాడు. ఆ వాదన ఇలా ఉంది: పెట్టుబడిదారీ విధానం పతనం కావడం అనేది చారిత్రికంగా అనివార్యం అని మార్క్సిజం భావిస్తుంది. అందుకే దానిని విప్లవ కార్యాచరణ ద్వారా కూలదోయాలని ప్రతిపాదిస్తుంది. అయితే, ఇంతవరకూ పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనేది జరగలేదు, కనుచూపుమేరలో పతనం అయే సూచనలు కూడా కనిపించడం లేదు. అందుచేత ఈ వ్యవస్థను కూలదోయడం కోసం కాకుండా, దాని పరిధిలోనే కార్మిక వర్గానికి మరింత మెరుగ్గా ఆర్థిక ప్రయోజనాలను సాధించడం కోసం పోరాడాలన్నది ఎజండాగా ఉండాలి. శ్రామికవర్గం సోషలిజం సాధన అనే తన విప్లవ లక్ష్యాన్ని విడిచిపెట్టాలి. దానికి బదులు శాంతియుతంగా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలోనే కొనసాగుతూ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు పరిమితం కావాలి. అంతే కాదు, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ. ఇందులో ఈ బూర్జువా వ్యవస్థ సార్వత్రిక వోటుహక్కును కల్పించింది. అందుచేత మెజారిటీ ప్రజల మాటే చెల్లుబాటు అవుతుంది. కనుక రాజ్యం అనేది ఇంకెంత మాత్రమూ ఒక వర్గం పెత్తనం చేయడానికి తోడ్పడే సాధనంగా ఉండజాలదు. ఇలా వాదించిన బెర్న్‌స్టీన్ తన వాదనంతటినీ ఒక వాక్యంలో ఇలా ప్రకటించాడు: "ఉద్యమమే సర్వస్వం. అంతిమ లక్ష్యం అంటూ ఏమీ లేదు". రోజువారీ సమస్యలమీద ట్రేడ్ యూనియన్‌గా చేసే కార్యక్రమాలలో కూరుకుపోవడం, తక్షణ ప్రయోజనాలు పొందేందుకు సంకుచిత రాజకీయ ఎత్తుగడలకు పరిమితం కావడం, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ మౌలిక దోపిడీ స్వభావాన్ని, అది పరిణామం చెందుతూన్న క్రమాన్ని, సోషలిజం సాధన అనే ప్రాథమిక లక్ష్యాన్ని మరిచిపోవడం– ఇదే బెర్న్‌స్టీన్ కార్మికవర్గానికి ఇచ్చిన సలహా.

బెర్న్‌స్టీన్ ప్రతిపాదించిన 'రివిజనిస్టు' కార్యక్రమం ఆర్థిక, రాజకీయ రంగాలకు మాత్రమే పరిమితం కాలేదు. తాత్విక రంగాన్ని, రాజకీయ అర్థశాస్త్రాన్ని కూడా చర్చించింది. వివిధ రంగాల్లో మార్క్సిస్టు అవగాహనకు భిన్నమైన వైఖరులను వ్యక్తం చేసే ధోరణు లన్నింటినీ ఒక విధంగా బెర్న్‌స్టీన్ ఒక దగ్గరకు తీసుకువచ్చాడనీ, అది కూడా ఒక విధంగా మంచిదేననీ లెనిన్ భావించాడు.

**❝ బెర్న్‌స్టీన్ ప్రతిపాదించిన 'రివిజనిస్టు' కార్యక్రమం ఆర్థిక, రాజకీయ రంగాలకు మాత్రమే పరిమితం కాలేదు. తాత్విక రంగాన్ని, రాజకీయ అర్థశాస్త్రాన్ని కూడా చర్చించింది. వివిధ రంగాల్లో మార్క్సిస్టు అవగాహనకు భిన్నమైన వైఖరులను వ్యక్తం చేసే ధోరణు లన్నింటినీ ఒక విధంగా బెర్న్‌స్టీన్ ఒక దగ్గరకు తీసుకువచ్చాడనీ, అది కూడా ఒక విధంగా మంచిదేననీ లెనిన్ భావించాడు. ❞**

కమ్యూనిస్టు పార్టీలలో ఈ రివిజనిస్టు ధోరణి పట్ల విమర్శ గట్టిగానే ఎదురైంది. కానీ రివిజనిస్టు ధోరణి కార్మికోద్యమంలోకి లోతుగా చొరబడింది. మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో ఈ రివిజనిజం 'సామాజిక దేశభక్తి' (సోషల్ పేట్రియాటిజం)గా, 'సామాజిక దురహంకారం' (సోషల్ షావనిజం) లేదా జాతీయ దురహంకారంగా రూపం తీసుకుంది. రష్యాలోని కమ్యూనిస్టులు మినహా, తక్కిన దేశాలలోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలన్నీ (అప్పట్లో కమ్యూనిస్టులను సోషల్ డెమాక్రాట్లు అనేవారు) తమ తమ దేశాల ప్రభుత్వాలు సాగిస్తున్న యుద్ధ ప్రయత్నాలకు మద్దత్తుగా నిలిచాయి. ఆయా పార్లమెంటుల్లో సభ్యులుగా ఉన్న సోషల్ డెమాక్రాట్లు ప్రభుత్వ యుద్ధ అవసరాలకు నిధులు సమకూర్చడానికి అనుకూలంగా ఓటు చేశారు. అప్పట్లో రెండవ ఇంటర్నేషనల్‌కు అధ్యక్షుడిగా బెల్జియంకు చెందిన వాండర్ వెల్డె ఉండేవాడు. యుద్ధం విషయంలో అన్ని దేశాలలోని సోషల్ డెమాక్రాట్లూ ఒకే విధమైన వైఖరిని తీసుకోడానికి వీలుగా రెండవ ఇంటర్నేషనల్ కార్యవర్గాన్ని వెంటనే సమావేశపరచాలని ఆయనని కోరితే ఆయన స్పందిచిన తీరు జాతీయ దురహంకారాన్ని స్పష్టంగా వ్యక్తం చేసింది. "బెల్జియం కార్మికుల ఇళ్ళమీద జర్మన్ సైనికులు దాడులు సాగిస్తున్నంతకాలం కార్యవర్గాన్ని సమావేశపరిచే ప్రసక్తే లేదు" అని ఆయన ప్రకటించాడు.

ఈ రివిజనిస్టు తుప్పు ఎంతగా వ్యాపించిందో జర్మనీ ఉదాహరణ చూస్తే తెలుస్తుంది. జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీ కార్మిక వర్గంలోకి లోతుగా విస్తరించింది. యూరప్ లోకెల్లా అతి పెద్ద ఏకైక సోషలిస్టు శక్తిగా ఎదిగింది. కార్ల్ కాట్స్కీ వంటి ఉన్నత స్థాయి నాయకులెందరో ఆ పార్టీలో ఉన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతం మీద మంచి పట్టు ఉన్న కాట్స్కీ ఎంగెల్స్‌కు సన్నిహిత మిత్రుడు కూడా. బెర్న్‌స్టీన్ రివిజనిజం మీద పోరాడినవాడు ఆయన. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం అయేనాటికి జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీ ఆ దేశంలో ఏకంగా 86 దినపత్రికలను ప్రచురించేది ! దీనిని బట్టే ఆ పార్టీ ఎంత బలంగా, విస్తృతంగా వ్యాపించివుండేదో గ్రహించవచ్చు.

అయినప్పటికీ, యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ స్పష్టమైన వైఖరిని తీసుకునేబదులు, ఆ పార్టీ మెజారిటీ నాయకత్వం ఒక అవకాశవాద వైఖరిని అవలంబించింది. 1914లో జర్మన్ పార్లమెంటులో యుద్ధ ఖర్చుల నిమిత్తం ప్రత్యేక నిధుల కేటాయింపు కోసం వోటింగ్ జరిగినప్పుడు జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీకి చెందిన 110 మంది పార్లమెంటు సభ్యులలో ఇద్దరు మినహా, తక్కినవారందరూ నిధుల కేటాయింపుకు అనుకూలంగా వోటు చేశారు. కార్ల్ లీబ్‌నెక్ట్, ఆట్టో రూహ్‌లే అనే ఇద్దరు సోషల్ డెమాక్రాట్లు మాత్రమే వ్యతిరేకంగా వోటు చేశారు. ఈ కార్ల్ లీబ్‌నెక్ట్ 1907 నాటికే 'దేశద్రోహ నేరం' కింద శిక్షకు గురయ్యాడు. "సైనిక తత్వం–సైనిక తత్వ వ్యతిరేకత" అన్న పుస్తకాన్ని రాసినందుకు అతడికి ఈ శిక్ష పడింది. "ప్రధాన శత్రువు మన దేశంలోపలే ఉన్నాడు" అన్న మరొక ముఖ్యమైన కరపత్రాన్ని కూడా అతడు రచించాడు. జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీలో కార్ల్ లీబ్‌నెక్ట్, ఫ్రాంజ్ మెహ్‌రింగ్, క్లారా జెట్కిన్, లియో జాగిషెస్, రోజా లక్సెంబర్గ్ – ఈ అయిదుగురూ ఒక మైనారిటీ గ్రూపు గా ఉన్నారు. యుద్ధానికి, జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా వీరంతా స్పష్టమైన వైఖరిని తీసుకున్నారు.

యూరపియన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో యుద్ధం విషయంలో మూడు విభిన్నమైన ధోరణులు వ్యక్తం అయ్యాయి. అత్యధిక పార్టీలలో సూటిగానే జాతీయ దురహంకార ధోరణితో కూడిన వైఖరిని మెజారిటీ నాయకత్వాలు చేపట్టారు. ఇక రెండవ, 'మధ్యేవాద' ధోరణికి ప్రతినిధులుగా కార్ల్ కాట్స్కీ, లాంగ్వెట్, ట్యురాటీ, రామ్సే మెక్‌డొనాల్డ్, మార్టోవ్ తదితరులు వ్యవహరించారు. వీరంతా జాతీయ దురహంకార ధోరణిని వ్యతిరేకిస్తూనే, వారితో విడగొట్టుకోడానికి మాత్రం సిద్ధపడలేదు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూనే, శాంతి సాధన కోసం ప్రయత్నించాలన్నారే తప్ప అంతర్యుద్ధం సాగించి విప్లవం సాధించడం కోసం సిద్ధపడలేదు.

> **"యూరపియన్ కార్మికవర్గం తమ విప్లవ కార్యాచరణలో ఎదుర్కొంటున్న సవాళ్ళకు సైద్ధాంతిక పరిష్కారాన్ని అంది స్తూనే, వలస దేశాలకు కూడా ఆ విప్లవ కార్యాచరణ పరిధిని విస్తరించడం లెనిన్ రాసిన 'సామ్రాజ్యవాదం' గ్రంథం ప్రత్యేకత. 20వ శతాబ్దంలోని రెండు ప్రధాన విప్లవ స్రవంతులనూ అనుసంధా నించడానికి తోడ్పడే విధంగా ఇందులో సిద్ధాంతం రూపొందింది. ఈ రచన మూడవ ఇంటర్నేషనల్ ఏర్పాటుకు దోహదం చేసింది."**

"ఈ మధ్యేవాదులు' అందరూ తాము మార్క్సిస్టు సిద్ధాంతానికి కట్టుబడ్డవాళ్ళ మేనని, అంతర్జాతీయవాదులమనీ గట్టిగా ప్రకటిస్తారు. తామంతా శాంతిని కోరుతున్నా మనీ, తమ దేశపు ప్రభుత్వం 'శాంతిని కోరుతున్న ప్రజల అభిప్రాయానికి కట్టుబడి' వ్యవహరించేలా ఆ ప్రభుత్వం మీద అన్ని రకాల వత్తిడులనూ తీసుకువస్తామనీ, శాంతి ప్రచారం వివిధ రూపాలలో చేపడతామనీ, దురాక్రమణలకు తావు లేని విధంగా శాంతిని సాధించేందుకు కట్టుబడివున్నామనీ, జాతీయ దురహంకార వైఖరిని తీసుకున్నవారితో శాంతిపూర్వకంగా వ్యవహరిస్తామనీ ప్రకటిస్తారు. ఈ మధ్యేవాదులు తాము ఐక్యతకు కట్టుబడి వున్నట్టు, చీలికకు వ్యతిరేకం అన్నట్టు వ్యవహరిస్తారు" అని లెనిన్ రాశారు.

ఇక మూడవ ధోరణికి ప్రతినిధులుగా లెనిన్, లీబ్‌నెక్ట్, లక్జెంబర్గ్, రాడెక్ తదితరులు ఉన్నారు. వీరి వైఖరికి అద్దం పట్టేలా ఉంది లీబ్‌నెక్ట్ రాసిన కరపత్రం. "ప్రధాన శత్రువు మన దేశంలోనే ఉన్నాడు" అన్నది ఆ కరపత్రం శీర్షిక. యుద్ధం అనే సమస్యను పరిష్కరించడానికి ఉన్నది ఒక్కటే , విప్లవకరమైన మార్గం అని ఆ కరపత్రం ప్రకటించింది. జరుగుతున్న యుద్ధం సామ్రాజ్యవాదుల మధ్య వాటాల పంపకం కోసం తప్ప వేరే దేనికోసమూ కాదనీ, కార్మికవర్గం ఎక్కడికక్కడ తమ తమ స్వంత దేశాల్లోని సామ్రాజ్యవాద బూర్జువా వర్గం మీద ఎక్కుపెట్టినప్పుడే యుద్ధానికి ముగింపు దొరుకుతుందనీ, అలా కాకుండా కేవలం యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాం అంటూ మాట్లాడడం వలన ఏ ఉపయోగమూ ఉండదనీ ఆ కరపత్రం పేర్కొంది. అందుచేత సామ్రాజ్యవాదుల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని శ్రామిక వర్గం తమ తమ దేశాల్లో అంతర్యుద్ధంగా మార్చి సామ్రాజ్యవాద బూర్జువా పాలనను కూలదోయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఈ మూడవ ధోరణి జాతీయ దురహంకారానికీ, దానితో విడగొట్టుకోడానికి సుముఖంగా లేని మధ్యేవాదులకీ పూర్తి భిన్నమైన వైఖరిని తీసుకుంది. విప్లవకర మార్క్సిస్టులతో కూడిన మూడవ ఇంటర్నేషనల్ ఏర్పాటుకు ఇది దారి తీసింది.

యూరపియన్ కార్మికవర్గం తమ విప్లవ కార్యాచరణలో ఎదుర్కొంటున్న సవాళ్ళకు సైద్ధాంతిక పరిష్కారాన్ని అందిస్తూనే, వలస దేశాలకు కూడా ఆ విప్లవ కార్యాచరణ పరిధిని విస్తరించడం లెనిన్ రాసిన 'సామ్రాజ్యవాదం' గ్రంథం ప్రత్యేకత. 20వ శతాబ్దంలోని రెండు ప్రధాన విప్లవ స్రవంతులనూ అనుసంధానించడానికి తోడ్పడే విధంగా ఇందులో సిద్ధాంతం రూపొందింది. ఈ రచన మూడవ ఇంటర్నేషనల్ ఏర్పాటుకు దోహదం చేసింది. అంతకు ముందటి సంస్థలమాదిరిగా కాకుండా ఈ మూడవ ఇంటర్నేషనల్ ఆ పదానికి పూర్తి న్యాయం చేసేలా, నిజమైన అంతర్జాతీయ స్ఫూర్తితో, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో ఏర్పడింది. ప్రతినిధులు భారత్, చైనా, వియత్నాం తదితర దేశాలనుండి వచ్చారు. వారు జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాల ప్రతినిధులతో అభిప్రాయాలు కలబోసు కున్నారు.?

సామ్రాజ్యవాద దేశాలలో విప్లవసాధన అనే ఎజండాతో పాటు తూర్పు దేశాల్లో విప్లవం అనే ఎజండాను లెనిన్ దాని సరసన నిలబెట్టాడు. సామ్రాజ్యవాద దేశాలలో విప్లవ సాధన అనేది ఇంటర్నేషనల్‌కు ఎంత ముఖ్యమో, తూర్పు దేశాలలో విప్లవసాధన కూడా అంతే ముఖ్యంగా ఉండాలి అని స్పష్టం చేశాడు. ఈ విషయంలో లెనిన్ ఒక కొత్త పుంతను తొక్కాడు. తూర్పు దేశాలలో విప్లవాలను పట్టించుకోకుండా కేవలం యూరప్‌లోని విప్లవాలగురించే మాట్లాడడం సాధ్యం కాదనీ, అదే మాదిరిగా యూరప్ లోని విప్లవాలతో సంబంధం లేకుండా తూర్పు దేశాల విప్లవాలు ముందుకు సాగజాలవనీ స్పష్టం చేస్తూ, ఆ రెండింటికీ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని సైద్ధాంతికంగా "సామ్రాజ్యవాదం–పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" గ్రంథంలో నెలకొల్పాడు. '1905 (రష్యాలో తిరుగుబాటు) తర్వాత టర్కీ పర్షియా, చైనాల్లో తిరుగుబాట్లు వచ్చాయి. ఆ తర్వాత ఒక విప్లవోద్యమం భారత్‌లో కూడా పెంపొందింది. ఇక్కడ భారత్‌లో తిలక్ అరెస్టు జరిగినప్పుడు నిరసనగా బొంబాయి కార్మికులు సార్వత్రిక సమ్మె చేపట్టడం గురించి లెనిన్ వ్యాఖ్యానించాడు. దానితోబాటు, సామ్రాజ్యవాద యుద్ధంలో వలసదేశాల ప్రజలను సైనికులుగా వాడుకున్న అనంతరం ఆయుధాల వినియోగంలో వారి సామర్థ్యం పెరిగిందనీ, దానితోబాటు ఆ వలసదేశాల ప్రజల చైతన్యం ఒక గొప్ప ముందడుగు వేసిందనీ లెనిన్ గమనించాడు. యుద్ధానికి ముందు, ఆ తర్వాత రోజుల్లో వలసదేశాల్లో విప్లవ క్రమం మరింత ఉధృతిని సంతరించు కోవడాన్ని లెనిన్ గుర్తించాడు.

ఆ తర్వాత అనతికాలంలోనే సామ్రాజ్య వాదం... గ్రంథంలో వివరించినదానికన్నా ఎక్కువ ప్రాధాన్యతను లెనిన్ వలసదేశాల ప్రజల పోరాటాలకు ఇచ్చాడు. యూరప్‌లో విప్లవ అవకాశాలు సన్నగిల్లాక, మరీ ముఖ్యంగా జర్మనీలో విప్లవోద్యమం బలహీనపడ్డాక లెనిన్ తన ఆశలన్నీ తూర్పు దేశాలలోని పోరాటాలపైనే పెట్టుకున్నాడు. ప్రపంచంలో ఎక్కడైనా విప్లవం బద్దలుకావచ్చునన్న ఆశాభావం ఆ గ్రంథంలో వ్యక్తం అయింది. దీనికి ప్రధాన అటంకం జాతీయ దురహంకార నాయకులు, వెన్నెముక లేని సామరస్యవాదులు అవినీతిపరులై వ్యవహరించడమేననీ, వారి ప్రభావం నుంచి శ్రామికవర్గాన్ని బైటకు తీసుకువస్తే అప్పుడు విముక్తి సాధ్యమనీ అందులో పేర్కొన్నాడు.

**మౌలిక ప్రశ్నలకు సమాధానాలు**

ఇలా మార్క్సిజాన్ని మౌలికంగానే పునర్నిర్మించే పనిని కొనసాగిస్తూ, ఆ క్రమంలో లెనిన్ ఎన్నో వేధించే ప్రశ్నలకు సమాధానాలను కూడా ఇచ్చాడు. కనీసం అయిదు మౌలిక సమస్యల మీద లెనిన్ పెంపొందించిన సమైక్య భావనలు శ్రేణుల అవగాహనకు స్పష్టత కల్పించేలా సామ్రాజ్యవాదం... గ్రంథంలో వివరించడం జరిగింది.

మొదటిది: మార్క్స్ "ఏదైనా సామాజిక వ్యవస్థలోపల ఉత్పత్తి శక్తుల అభివృద్ధి జరిగే అవకాశం ఇంకా ఉన్నంతకాలమూ అ వ్యవస్థ

నాశనం కాదు.” అని పేర్కొన్నాడు. ఒకానొక సామాజిక వ్యవస్థ తన చారిత్రిక అంతిమ దశకు చేరుకుంది అని నిర్ధారించడానికి ఏవైనా వస్తుగత ప్రాతిపదికలు ఉన్నాయా? అన్నది ఆ కీలకమైన ప్రశ్న. ఒకానొక ఉత్పత్తి దశ చారిత్రికంగా అభివృద్ధికర దశలో కొనసాగడంతో మొదలుపెట్టి చారిత్రికంగా తిరోగమన స్వభావాన్ని సంతరించుకుని చావుకి దగ్గర పడింది అని చెప్పడానికి వేరే ప్రాతిపదికలు లేవు.

పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రికంగా తన మనుగడ కొనసాగించే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పాలంటే ఆ వ్యవస్థ ఆర్థికంగా ముందడుగు వేయలేని స్థితి ఏర్పడడమే అందుకు ప్రాతిపదిక అని ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ వ్యాఖ్యానించాడు. బెర్న్‌స్టీన్ రివిజనిజం మీద పోరాడుతూ విప్లవ పతాకాన్ని జర్మన్ సోషల్ డెమాక్రసీలో సమున్నతంగా నిలిపిన రోసా లక్సెంబర్గ్ కూడా బెర్న్‌స్టీన్ లాగే వ్యాఖ్యానించడం ఇక్కడ విచిత్రం. అయితే ఆమె అక్కడితో ఆగకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ తన పతన దశకు చేరుకుందని నిరూపించడానికి పూనుకున్నారు. అంటే అటు రివిజనిస్టులు, ఇటు విప్లవకారులు కూడా వ్యవస్థ ఆర్థిక పతనాన్ని ఎదుర్కోవడం అనేది ఆ వ్యవస్థ అంతానికి సూచనగా పరిగణించారు. (1908 వరకూ లెనిన్ కూడా ఇదే అవగాహనతో ఉన్నాడు) ఎటొచ్చీ రివిజనిస్టులు ఆ పతన దశ ఉత్పన్నం కాలేదని వాదిస్తే విప్లవకారులు ఇక విప్లవం అనివార్యమైన దశ వచ్చిందని వాదించారు.

లెనిన్ సామ్రాజ్యవాదం... గ్రంథం ఈ రెండు దృక్పథాలకూ పూర్తి భిన్నంగా ఒక కొత్త దృశ్యాన్ని ఆవిష్కరించింది. అది ఒక దేశపు కార్మికులు కంచెకు అవతల ఉన్న వేరే దేశపు కార్మికుల్ని అంతం చేసేలా వత్తిడి చేస్తుంది. ఈ పరిస్థితి నుండి కార్మికులు తప్పించుకోడానికి ఒకే మార్గం ఉంది. ఆ కార్మికులు తమ తుపాకులను తిప్పి తమ యజమానులమీదకు ఎక్కుపెట్టడమే పరిష్కారం. మరోలా చెప్పాలంటే సామ్రాజ్యవాదం కార్మికులకు ఎంచుకోడానికి ఒకే అవకాశం ఇస్తుంది. దానిని ఉపయోగించుకుని కార్మికులు ఒకరినొకరు చంపుకుంటారా లేక అందరూ కలిసి పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేస్తారా అన్నదే ఇక్కడ తేల్చుకోవలసినది. (అందుకే బోల్షివిక్‌లు సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి అన్న నినాదం ఇచ్చారు) విప్లవమా లేక సామాజిక విధ్వంసమా అన్న చివరి అవకాశాన్ని అది మనముందు ఉంచింది కనుక

“ లెనిన్ సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధం అనివార్యంగా కలిసేవున్నాయని గమనించాడు. ఆ యుద్ధం కార్మికులకు విప్లవాన్నో, పరస్పరం ఒకరినొకరు చంపుకుని నాశనమయే పరిస్థితినో ఎంచుకునే అవకాశాన్నో ఇచ్చిందని లెనిన్ వాదించాడు. అంతేకాక, ఆ యుద్ధం వలసదేశాల ప్రజల ను కూడా ప్రపంచ చరిత్ర ముంగిట్లోకి తీసుకువచ్చి ఆ దేశాలలో సైతం విప్లవాలు సాధ్యపడే పరిస్థితులను తెచ్చిందని ఆయన అన్నాడు. ”

సామ్రాజ్యవాద దశ అన్నది పెట్టుబడిదారీ వ్యవస్థ చివరి దశ.. పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్త పెట్టుబడిదారీ దశకు చేరుకున్నాక (గుత్తపెట్టుబడిదారీ దశ, సామ్రాజ్యవాదం ఒక్కటేనని లెనిన్ భావించాడు) అది కొనసాగే అవకాశాలన్నింటినీ కోల్పోయింది. అది ఇప్పటికే చివరి ఘడియలలో ఉంది. మార్క్స్ చెప్పిన సిద్ధాంతం ప్రకారం(పెట్టుబడి కేంద్రీకరణ వలన గుత్త సంస్థలు పుట్టుకొస్తాయని మార్క్స్ చెప్పాడు) దాని చారిత్రిక క్రమాన్ని ముగించడానికి ఈ ఆచరణాత్మక పరిష్కారాన్ని లెనిన్ సూచించాడు.

రెండవది: ఈ శతాబ్దపు రెండు అత్యంత శక్తివంతమైన విప్లవ స్రవంతుల మధ్య అంటే, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని శ్రామికవర్గ విప్లవ పోరాటాలకూ, వలసదేశాల్లో జాతీయ విముక్తి కోసం జరుగుతున్న పోరాటాలకూ మధ్య ఉన్న సంబంధాన్ని లెనిన్ స్పష్టం చేశాడు. వలసదేశాల విముక్తి పోరాటాలలో కూడా శ్రామికవర్గం జోక్యం కల్పించుకోవలసిన అవసరం ఉందని, అందుచేత ఇంటర్నేషనల్ ఈ విషయంలో శ్రద్ధ వహించవలసివుంటుందని స్పష్టం చేశాడు. అంతేకాదు. ఆ పోరాటంలో అనుసరించవలసిన వ్యూహానికి ఒక ఖరారైన రూపాన్ని కూడా ఇచ్చాడు. ప్రతీ దేశంలోనూ నెలకొన్న పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషణ చేసి అక్కడి నిర్దిష్ట పరిస్థితులను బట్టి తగిన ఎత్తుగడలను అనుసరించాల్సివుంటుందని కూడా స్పష్టం చేశాడు. ఈ అంశం మీద కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ మహాసభలో ఒక సమగ్ర దృక్పథాన్ని లెనిన్ సమర్పించాడు.

ఆ దృక్పథంలో రెండు ముఖ్యమైన అంతర్భాగాలున్నాయి. మొదటిది: కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్, కమ్యూనిస్టు పార్టీలు వలస దేశాల్లోని బూర్జువా-ప్రజాతంత్ర విముక్తి పోరాటాలను బలపరచాలి. అయితే అక్కడ శ్రామికవర్గ ఉద్యమాలు- అవి ఎంత బీజరూపంలో ఉన్నప్పటికీ కూడా- స్వతంత్రంగా వ్యవహరించగలిగే పరిస్థితి అన్ని సందర్భాల్లోనూ ఉండేలా ఈ మద్దత్తు ఉండాలి. రెండవది: భూస్వాములకు, ఇంకా కొనసాగుతున్న భూస్వామ్యవ్యవస్థ యొక్క వివిధ రూపాలకు వ్యతిరేకంగా రైతాంగం జరిపే పోరాటాలకు ప్రత్యేకంగా మద్దత్తునివ్వాలి.

**విప్లవాల దశ**

లెనిన్ సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధం అనివార్యంగా కలిసేవున్నాయని గమనించాడు. ఆ యుద్ధం కార్మికులకు విప్లవాన్నో, పరస్పరం ఒకరినొకరు చంపుకుని నాశనమయే పరిస్థితినో ఎంచుకునే అవకాశాన్నో ఇచ్చిందని లెనిన్ వాదించాడు. అంతేకాక, ఆ యుద్ధం వలసదేశాల ప్రజలను కూడా ప్రపంచ చరిత్ర ముంగిట్లోకి తీసుకువచ్చి ఆ దేశాలలో సైతం విప్లవాలు సాధ్యపడే పరిస్థితులను తెచ్చిందని ఆయన అన్నాడు.

అందుచేత సామ్రాజ్యవాదం అనేది సోషలిస్టు విప్లవాలు ఉదయించే ముందరి దశ. ఈ విప్లవం అనేది భూగోళం మీద ఏదో ఒక ప్రాంతానికే పరిమితం అయినది కాదు. అది ప్రపంచ విప్లవంగా పరిణమిస్తుంది. ఈ అవగాహనకు అనుగుణంగానే కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో “పెట్టుబడిదారీ వ్యవస్థ సాధారణ సంక్షోభం” అన్న భావనను ఉపయోగించారు. ప్రపంచ విప్లవానికి సంబంధించిన అవగాహన సైద్ధాంతిక రూపంలో ఆ విధంగా వ్యక్తం అయింది.

మూడవది: ఈ సైద్ధాంతిక అవగాహనకు ఉన్న మినహాయింపులను కూడా అదే వివరించవలసివచ్చింది. ప్రపంచ విప్లవం అనేది ఎజండాగా ముందుకు వచ్చినప్పుడు సోషల్ డెమాక్రటిక్ ఉద్యమంలోని అత్యంత ప్రముఖులు, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికులలో గణనీయమైన భాగం ఎందుకు రివిజనిస్టు వైఖరిని, జాతీయ దురహంకార వైఖరిని చేపట్టారు? అన్న ప్రశ్న

> **"లెనిన్ భావాల సమగ్రత మార్క్స్ సిద్ధాంతం మీద ఆధారపడినప్పటికీ, అది మార్క్స్ చెప్పినదానికన్నా మరింత ముందుకు అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి మార్క్స్ రచనలలో కొన్ని ఎంపిక చేసినవాటిని తన పునాదిగా తీసుకుంది. అంటే మార్క్స్ సిద్ధాంతంలో ఏదైతే దాని 'హృదయం'గా ఉందో దానిని స్వీకరించి దాని చుట్టూ ఈ అభివృద్ధి చేశాడు లెనిన్."**

వచ్చింది. దానికి కూడా లెనిన్ గ్రంథం వినూత్న రీతిలో సమాధానం ఇచ్చింది.

అత్యధిక లాభాలార్జించే గుత్త పెట్టుబడి దారులు సామ్రాజ్యవాద దేశాలలో తమ లాభాలలో ఒక భాగాన్ని శ్రామికవర్గంలోని ఒక చిన్నపాటి అగ్రశ్రేణికి చెందినవారిని లంచాలతో లోబరుచుకోడానికి ఉపయోగించారని తెలిపాడు. అలా లోబడిన వారిని శ్రామికవర్గపు 'ఉన్నత తరగతి'గా పేర్కొన్నాడు. కార్మికవర్గంలో రివిజనిస్టు ధోరణులు ప్రబల దానికి ఈ ఉన్నత తరగతి, వారి ఆలోచనా విధానం కారణమని వివరించాడు.

నాలుగవది: సామ్రాజ్యవాదం గురించి లెనిన్ రూపొందించిన సిద్ధాంతం లెనిన్ స్వంత భావాలతో పూర్తిగా అమరిపోయింది. ఆ భావాలనే లెనినిజం అంటాం. 1902లో రాసిన 'ఏం చెయ్యాలి?', 1916లో రాసిన 'సామ్రాజ్యవాదం–పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ', 1917లో రాసిన 'రాజ్యం–విప్లవం' – ఈ మూడింటినీ లెనినిజానికి కీలక గ్రంథాలుగా పరిగణిస్తాం. ఈ మూడింటికీ తోడుగా 1905లో రాసిన 'ప్రజాతంత్ర విప్లవంలో రెండు ఎత్తుగడలు' అన్న రచనను కూడా జత చేయాలి. వ్యవసాయిక సమస్య మీద, కార్మిక–కర్షక ఐక్యత ఆవశ్యకత మీద లెనిన్ రచనలు కూడా ముఖ్యం. ఈ నాలుగు గ్రంథాలనూ కలిపితే, అవి ఆనాటి యుగ స్వభావాన్ని, ఆ యుగంలో బూర్జువా రాజ్యపు స్వభావాన్ని, దానిని బట్టి విప్లవం అర్థాన్ని, రష్యా వంటి దేశంలో ఆ విప్లవానికి కావలసిన వర్గ సంఘటనను, ఆ విప్లవాన్ని నడిపించడానికి పార్టీకి ఉండవలసిన నిర్మాణ స్వభావాన్ని వివరిస్తాయి. ఈ నాలుగూ కలిసి దాదాపుగా విప్లవ క్రమం మొత్తానికి సంబంధించిన విశ్లేషణను అందిస్తాయి. ఆ విశ్లేషణ కొన్ని సందర్భాల్లో (రెండు ఎత్తుగడలు) ప్రత్యేకంగా రష్యన్ పరిస్థితులకు అనుగుణంగా రూపొందినా అది అన్ని దేశాలకూ వర్తించేదిగానే ఉంది.

లెనిన్ భావాల సమగ్రత మార్క్స్ సిద్ధాంతం మీద ఆధారపడినప్పటికీ, అది మార్క్స్ చెప్పినదానికన్నా మరింత ముందుకు అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి మార్క్స్ రచనలలో కొన్ని ఎంపిక చేసినవాటిని తన పునాదిగా తీసుకుంది. అంటే మార్క్స్ సిద్ధాంతంలో ఏదైతే దాని 'హృదయం'గా ఉందో దానిని స్వీకరించి దాని చుట్టూ ఈ అభివృద్ధి చేశాడు లెనిన్. ఈ విధంగా మొత్తం మార్క్స్ రచనలను రెండుగా విభజించడం బట్టి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పెంపొందించడం అంటేనే దానిని పునర్నిర్మించడం అని భావించాలి. ఈ విషయం సామ్రాజ్యవాదం... గ్రంథంలో స్పష్టంగా కనిపిస్తుంది.

సామ్రాజ్యవాదం... గ్రంథంలో రానున్న కాలంలో ఎటువంటి పరిణామాలు జరగనున్నాయని లెనిన్ ఊహించాడో 1914–45 మధ్య కాలంలో సరిగ్గా ఆ విధంగానే జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం పెట్టుబడి దారీ వ్యవస్థ స్వభావం మారిపోయిందన్న అభిప్రాయం తలెత్తిన నేపథ్యంలో ఆ తర్వాత జరిగిన పరిణామాలను లెనినిస్టు దృక్పథంతో పరిశీలించడం అవసరం.

రెండవ ప్రపంచ యుద్ధంలో పెట్టుబడి దారీ విధానం బాగా ఎదురుదెబ్బలు తిన్నది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో వర్గ శక్తుల బలాబలాలు కార్మికవర్గానికి అనుకూలంగా గణనీయంగా మార్పు చెందాయి. ఆ యుద్ధంలో కార్మికవర్గం ఎనలేని త్యాగాలు చేయడం అందుకు ఒక కారణం. ఇక వలసదేశాల్లో ఒక ఉప్పెన లాగా జాతీయ విమోచన ఉద్యమాలు వెల్లువెత్తాయి. ఈ పరిస్థితుల్లో వెంటనే నిలదొక్కుకుని తన మనుగడ కొనసాగించడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ ద్విముఖ వ్యూహాన్ని అనుసరించింది. మొదటిది: విప్లవ శక్తులను, ముఖ్యంగా కమ్యూనిస్టులను ఒంటరిపాటు చేసి అణచివేయడం, రెండవది: వలసదేశాల ఉద్యమాలతోనూ, అక్కడి కార్మికవర్గంతోనూ రాజీపడేందుకు రాయితీలు ఇవ్వడం. ప్రచ్ఛన్న యుద్ధం, మెకార్థీయిజం విజృంభణ, గ్రీస్‌లో, మలయాలో విప్లవ పోరాటాలను అణచివేయడం, వియత్నాంలో, కొరియాలో పోరాటాలను అణచివేయడానికి ప్రయత్నించడం (కొరియాలో పోరాటాన్ని అణచివేయడం ద్వారా చైనా మీద దాడికి దిగాలన్నది సామ్రాజ్యవాదుల వ్యూహం. వారి మద్దత్తు ఉన్నప్పటికీ, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్టులను ఓడించలేకపోయింది.) ఫ్రాన్స్‌లో, ఇటలీలో యుద్ధానంతరం ఏర్పడ్డ సంకీర్ణ ప్రభుత్వాలనుండి కమ్యూనిస్టులను తొలగించడం (ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించడంలో ఆ దేశాల కమ్యూనిస్టులు వీరోచితంగా వ్యవహరించడంతో వారికి ప్రజల్లో బాగా పలుకుబడి పెరిగింది) ప్రపంచవ్యాప్తంగా పలు ప్రదేశాల్లో సైనిక స్థావరాలను నెలకొల్పడం వంటి చర్యలు మొదటి తరహా వ్యూహానికి చెందినవి. యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయం సాధించినప్పటికీ చాలా ఎక్కువగా నష్టపోయింది కూడా ఆ దేశమే. ఇక ఆ యుద్ధంలో దాదాపు చెక్కు చెదరకుండా బైటపడినది అమెరికా. అందువలన ఈ మొదటితరహా వ్యూహాన్ని అమలు చేయడంలో అమెరికా విజయం సాధించింది.

ఇక రెండవ వ్యూహం గురించే మనం ఎక్కువగా ఆలోచించాలి. వలస దేశాల్లో ఎక్కడైతే స్థానిక బూర్జువావర్గం బలంగా ముందుకొస్తోందో అక్కడ ఆ వర్గానికి అధికారాన్ని అప్పజెప్పడం, కీన్స్ చెప్పిన డిమాండ్ మేనేజిమెంట్ విధానాలను అమలు చేసి సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో దాదాపు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించడం, పలు రకాల సంక్షేమ పథకాలను అమలు చేయడం. (వాటికయ్యే ఖర్చులో అధికభాగాన్ని కార్మికవర్గమే భరించింది) ఈ రాయితీలు ఎక్కువ వేగంగా ఆర్థిక వృద్ధి సాధించడానికి అనువైన పరిస్థితులను కల్పించాయి. 1950, 1960 దశకాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రలో కెల్లా అత్యంత ఘనంగా వృద్ధి సాధించింది.

ఈ వృద్ధి వెనుక మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది: కీన్సియన్ డిమాండ్ మేనేజిమెంట్ ద్వారా, మరీ ముఖ్యంగా అమెరికా భారీగా లోటు బడ్జెట్‌లను అమలు చేయడం ద్వారా డిమాండ్‌ను పెద్ద స్థాయిలో కొనసాగించగలిగారు. ఈ లోటు బడ్జెట్‌లలో అధిక భాగం భారీ సైనిక వ్యయానికి కేటాయించారు. ఆ విధంగా పెట్టుబడులూ పెరిగేట్టు, వృద్ధి రేటు కూడా పెరిగేట్టు చూసుకున్నారు. రెండవది: రెండు ప్రపంచయుద్ధాల మధ్య

కాలంలో చాలా కొత్త శాస్త్ర పరిశోధనలు కొత్త ఆవిష్కరణలను సాధించాయి. కానీ ఆ కాలం అంతా నెలకొన్న తీవ్ర మాంద్యం వలన అవేవీ ఉత్పత్తి రంగంలో ప్రవేశించలేదు. యుద్ధ కాలంలో కూడా కొత్త సాంకేతిక పరిజ్ఞానం రంగ ప్రవేశం చేసింది. ఈ సాంకేతిక పురోగతి సంతటినీ వినియోగించగలిగిన పరిస్థితి యుద్ధానంతర కాలంలో ఏర్పడింది. ఈ రెండు కారణాల వలన ఉత్పాదకత వృద్ధి రేటు పెరిగింది. దాని వలన కార్మికులు మెరుగైన వేతనాలను సాధించుకోగలిగారు. అప్పటికి భారీగా ఉపాధి అవకాశాలు పెరగడం కూడా అందుకు దోహదపడింది. మూడవది: నూతనంగా స్వతంత్రం పొందిన దేశాలు వేగంగా పారిశ్రామికీకరణ చేపట్టడానికి తహతహలాడాయి. అందుకోసం పారిశ్రామిక యంత్ర సామగ్రి దిగుమతులను పెంచుకోడానికి పూనుకున్నాయి. దానికి అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకోడానికి అవి తమ వద్ద ఉత్పత్తి అయే ముడిసరుకులను పరస్పరం పోటీ పడి తక్కువ రేట్లకే అమ్ముకున్నాయి. అందువలన వలస విధానం అనేది అంతమైనప్పటికీ, ముడిసరుకుల ధరలు పారిశ్రామిక ఉత్పత్తుల ధరలతో పోల్చితే బాగా తగ్గాయి. ఇది పారిశ్రామిక దేశాలకు బాగా ఉపకరించింది. ఆ దేశాలు భారీ లోటు బడ్జెట్‌లను అమలు చేసినప్పటికీ, అక్కడ ద్రవ్యోల్బణం భారీగా పెరగకుండా అదుపు చేయడానికి ఈ పరిస్థితి తోడ్పడింది. ఈ కారణాలన్నీ కలిసి పెట్టుబడిదారీ వ్యవస్థలో వృద్ధి ఎక్కువకాలం పాటు కొనసాగడం సాధ్యపడింది.

ఈ వృద్ధి కొనసాగిన కాలంలో సంపన్న దేశాలలోని కార్మికవర్గం తమ జీవన ప్రమాణాలను బాగా గణనీయంగా మెరుగుపరుచుకోగలిగింది. మూడవ ప్రపంచ దేశాలు కూడా చరిత్రలో అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా వేగంగా అభివృద్ధి చెందాయి. ఆ మూడవ ప్రపంచ దేశాలలో కమ్యూనిజం నుండి బలంగా సవాలును ఎదుర్కొంటున్న కొన్నింటికి సామ్రాజ్యవాదులు ప్రత్యేక ప్రతిపత్తి ఇచ్చి అక్కడ పాలకవర్గాలు నిలదొక్కుకోడానికి తోడ్పడ్డారు. అందువలన ఆ దేశాలు ప్రత్యేకించి వేగంగా అభివృద్ధి చెందాయి. ఈ పరిణామాలు చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానం స్వభావం మారిపోయిందన్న అభిప్రాయం కలిగింది. ప్రత్యేకించి సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో 'ఇకముందు సంక్షేమ పెట్టుబడిదారీ రాజ్య పాలన చూడనున్నాం' అనీ, ఆ పాలనలో కార్మికవర్గం బాగా వర్ధిల్లనుంది అనీ వాదించసాగారు. ఇక మూడవ ప్రపంచ దేశాల్లో కొన్ని తూర్పు ఆసియా దేశాలు, ఆగ్నేయ ఆసియా దేశాలు సామ్రాజ్యవాద దేశాలతో లింకు పెట్టుకోవడం అనేది వాటి ఆర్థికాభివృద్ధికి ఎంతమాత్రమూ ఆటంకంగా ఉండబోదని చాలామంది భావించసాగారు. కొమింటర్న్ ఆరవ మహాసభలో వచ్చిన అవగాహన ఇందుకు భిన్నమైనది. మూడవ ప్రపంచదేశాలకు సామ్రాజ్యవాదులతో లింకు ఉండడం వాటి అభివృద్ధికి నష్టదాయకం అని కొమింటర్న్ భావించింది. ఆ అవగాహనతో అప్పుడు చాలా మంది కమ్యూనిస్టేతరులు, జాతీయవాదులు కూడా ఏకీభవించారు.

> **❝ యుద్ధానంతర కాలంలో జరిగిన వృద్ధి, 'సంక్షేమ విధానం', మూడవ ప్రపంచ దేశాలకు పెట్టుబడిదారీ విధాన విస్తరణ విజయవంతంగా సాగడం -ఇవన్నీ మార్క్సిస్టుల అంచనాలు తప్పు అని రుజువు చేసినట్టు అనిపిస్తుంది. కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే, ఆ కాలం ఒక మినహాయింపుగా పరిగణించాల్సి వుంటుంది. ఆ కాలంలో జరిగినది పెట్టుబడిదారీ సూత్రాలకు మినహాయింపు. ❞**

యుద్ధానంతర కాలంలో జరిగిన వృద్ధి, 'సంక్షేమవిధానం', మూడవ ప్రపంచ దేశాలకు పెట్టుబడిదారీ విధాన విస్తరణ విజయవంతంగా సాగడం -ఇవన్నీ మార్క్సిస్టుల అంచనాలు తప్పు అని రుజువు చేసినట్టు అనిపిస్తుంది. కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే, ఆ కాలం ఒక మినహాయింపుగా పరిగణించాల్సి వుంటుంది. ఆ కాలంలో జరిగినది పెట్టుబడిదారీ సూత్రాలకు మినహాయింపు. యుద్ధానంతర పరిస్థితి కల్పించిన అనివార్య పరిస్థితులలో పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి పక్కకు వైదొలగి అమలు చేసిన అసాధారణ విధానాలుగా వాటిని చూడాలి. పెట్టుబడిదారీ విధానానికి గల ధోరణుల్లో ముఖ్యంగా పెట్టుబడి అంతకంతకూ కేంద్రీకరించబడడం అనేది ముఖ్యమైనది. ఈ వృద్ధి కొనసాగిన కాలమంతటా ఆ కేంద్రీకరణ కొనసాగింది. దాని ఫలితంగా ఈ వృద్ధికాలం తర్వాత ఆ విధానాలకు స్వస్తి పలకడమే గాక, ఆ కాలంలో కార్మికులు సాధించిన విజయాలను కూడా ఇప్పుడు వమ్ము చేస్తున్నారు. 1970 దశకం తర్వాత పెట్టుబడిదారీ విధానం మళ్ళీ తన పాత ముఖాన్ని బైటకు ప్రదర్శించడం మొదలుపెట్టింది. దాని కొల్లగొట్టే స్వభావం, అమానవీయత, ఆధిపత్యం చెలాయించాలనే దాని ధోరణి వంటివి మళ్ళీ బైటకు వ్యక్తం అవడం మొదలైంది. అయితే దీనర్థం మనం మళ్ళీ యుద్ధానికి పూర్వం ఉండిన పరిస్థితులకే మళ్ళిపోతున్నాం అని మాత్రం కాదు. ఇప్పుడు కొత్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాటి గురించి కూడా కొంత ఇక్కడ ప్రస్తావించడం అవసరం.

### పెట్టుబడి ప్రపంచీకరణ

లెనిన్ పెట్టుబడి కేంద్రీకరణ గురించి రాసినప్పటికంటే ఇప్పుడు మరింత ఎక్కువగా కేంద్రీకరణ పెరిగింది. అంతే కాదు, లెనిన్ పేర్కొన్న పెట్టుబడిదారీ ప్రపంచపు పరిధులను దాటి మరింత ఎక్కువగా ముందుకు పోయింది. జర్మనీలో పెట్టుబడి ఆ దేశంలోనే మరింత తక్కువ మంది దగ్గర కేంద్రీకరించబడడమో, లేక బ్రిటిష్ పెట్టుబడి ఆ దేశంలోనే మరింత కేంద్రీకరించబడడమో, లేక లెనిన్ చెప్పినట్టు ఒక దేశపు పెట్టుబడి మరొక దేశపు పెట్టుబడితో వైరంలోకి దిగడమో కాదు ఇప్పుడు జరుగుతున్నది. ఆయా దేశాలలో కేంద్రీకరణ కొనసాగడంతోబాటు మొత్తంగానే ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి కేంద్రీకరించబడుతోంది. ఇదే పెట్టుబడి ప్రపంచీకరణ. అంటే ఈ కేంద్రీకరణ పరస్పర వైరాన్ని అధిగమించి కొనసాగుతోంది. అంటే లెనిన్ కాలంతో పోల్చి చూసుకున్నప్పుడు జరిగిన కేంద్రీకరణ కన్నా పరిమాణాత్మకంగా మాత్రమే కాక, గుణాత్మకంగానే కేంద్రీకరణ క్రమం మారింది. ఇది ప్రపంచాన్నే గుణాత్మకంగా మార్చింది.

పెట్టుబడి ప్రపంచీకరణ అనేది ఇప్పుడే జరుగుతున్న ఒక కొత్త ధోరణి కాదు. లెనిన్ కాలంలో కూడా పెట్టుబడి ప్రపంచీకరణ జరిగింది. సామ్రాజ్యవాదం అంటేనే దానితోబాటు పెట్టుబడి ప్రపంచీకరణ మొదలౌతుంది. అయితే ఆ క్రమంలో కొన్ని లక్షణాలు 20వ శతాబ్దపు ప్రారంభంలో కన్నా ఆ శతాబ్దపు చివరికొచ్చేసరికి మరింత ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. మొదటి ప్రపంచయుద్ధానికి

**❝ అదే సమయంలో, ఈ ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ మున్నెన్నడూ లేనంత బ్రహ్మాండమైన స్థాయిలో జరిగిన పెట్టుబడి కేంద్రీకరణ మీద ఆధారపడి, అలా కేంద్రీకరించబడ్డ పెట్టుబడికి ప్రతినిధిగా ఉంది. పెట్టుబడి కేంద్రీకరణ గురించి లెనిన్ చెప్పిన క్రమం ముందుకు కొనసాగుతోందన్నది దీనిని బట్టి ధృవపడుతోంది. ❞**

పూర్వం పెట్టుబడుల ఎగుమతులు బాగా జరుగుతున్న కాలంలో తక్కిన దేశాలన్నింటికన్నా ఎక్కువగా పెట్టుబడులను ఎగుమతి చేసిన దేశం బ్రిటన్. దాని స్థూల జాతీయోత్పత్తిలో 5 నుంచి 10 శాతం దాకా పెట్టుబడుల ఖాతాలో మిగులును కలిగివుండేది. ఈ పరిస్థితిని అది నాలుగు దశాబ్దాలపాటు కొనసాగించగలిగింది. యుద్ధానికి ముందు రెండు దశాబ్దాలలోనే ఈ మిగులు 8 శాతం సగటున ఉండేది. దానికి భిన్నంగా ప్రస్తుత కాలంలో పెట్టుబడుల ఎగుమతుల్లో అన్ని దేశాల కన్నా ముందున్న జపాన్ తన జిడిపిలో కేవలం 2.8 శాతం మిగులును మాత్రమే కలిగివుంది. (ఇది 1984-1993 మధ్య పరిస్థితి) దానర్థం ప్రస్తుత కాలంలో పెట్టుబడుల ఎగమతి-దిగుమతుల ప్రాధాన్యత తగ్గిపోయినట్టు కాదు. మొత్తం విదేశీ చెల్లింపుల ఖాతాతో ఇప్పుడు పెట్టుబడుల ఎగుమతులకు సంబంధం లేదు. కేవలం పెట్టుబడుల ఎగుమతుల, దిగుమతుల ఖాతా తోటే సంబంధం ఉంది. ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు కానీ, దీర్ఘకాల పెట్టుబడుల ప్రవాహాలు కానీ వాటి వెంటే సరుకుల ప్రవాహాన్ని కూడా తీసుకువస్తాయి. ఆ సరుకుల ప్రవాహం విదేశీ చెల్లింపుల ఖాతాలో ప్రతిబింబిస్తుంది. అదే స్వల్పకాలిక పెట్టుబడుల విషయంలోనైతే వాటితోబాటు వచ్చే సరుకుల ప్రవాహం అంటూ ఏదీ ఉండదు. (అవి సంక్షోభానికి దారి తీసినప్పుడు తప్ప) ప్రస్తుత కాలంలో పెట్టుబడుల ప్రవాహాలకు అనుగుణంగా సరుకుల ఖాతాలో మిగులు ఉండడం లేదు. సాపేక్షంగా తక్కువగా సరుకుల ఖాతాలో మిగులు ఉంటోంది. ఇది సూచించేది ఏమంటే, ఈ స్వల్పకాలిక పెట్టుబడుల ప్రవాహంలో ఎక్కువ భాగం స్పెక్యులేషన్ నిమిత్తం వచ్చేవే అని సూచిస్తుంది. దేశాల సరిహద్దులు దాటి ప్రవహిస్తున్న పెట్టుబడులలో కేవలం 2 శాతం మాత్రమే వాణిజ్య సంబంధిత లావాదేవీల నిమిత్తం వచ్చినవి అని తేలింది. దీనిని బట్టి ఈ పెట్టుబడులలో అత్యధిక భాగం స్పెక్యులేషన్ కోసం వచ్చినవే అని నిర్ధారించవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే నేటి ప్రపంచీకరణ వలన దీర్ఘకాలిక స్వభావం కలిగిన పెట్టుబడులలో ఎటువంటి చెప్పుకోదగ్గ పెరుగుదలా లేదు. 'నిలకడ లేని' పెట్టుబడుల ప్రవాహమే ఎక్కువగా ఉంది. ఉత్పత్తి కోసం వచ్చే పెట్టుబడులలో పెరుగుదల సాపేక్షంగా పెరగలేదు కానీ ప్రపంచవ్యాప్తంగా ద్రవ్య పెట్టుబడి సంచారం మాత్రం పెరుగుతోంది. ఇప్పుడు మనం ద్రవ్య పెట్టుబడి అని అంటున్నదానికీ, లెనిన్ కాలంలో చెప్పిన ద్రవ్య పెట్టుబడికీ పోలిక లేదు.

ఈ రెండింటికీ కనీసం మూడు తేడాలను గుర్తించవచ్చు. మొదటిది: జాతీయ ప్రాతిపదికన, జాతీయ ప్రభుత్వమద్దత్తు కలిగిన ద్రవ్య పెట్టుబడి గురించి లెనిన్ చెప్పాడు. ప్రస్తుతం మనం మాట్లాడుకుంటున్న ద్రవ్య పెట్టుబడి ఏదో ఒక దేశానికి చెందినదే అయినప్పటికీ, అది ఏ దేశ ప్రభుత్వపు అదుపులోనూ ఉండదు, అది ఏ దేశ ప్రయోజనాలకోసమూ పని చేయదు. రెండవది: అదే విధంగా ఫైనాన్సుకి, పరిశ్రమకి నడుమ ఉండే సమ్మేళనం (ఈ రెండూ ఆయా దేశాలలో, ఆయా దేశాల ప్రభుత్వాల సహాయంతో వ్యవహరించేవి) ఇప్పుడు లేదు. లెనిన్ కాలంలో అటువంటి సమ్మేళనం ఉండేది. ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి తన లక్ష్యాల కోసమే పని చేస్తుంది. దాని ప్రధాన లక్ష్యం స్పెక్యులేటివ్ లాభాలను పెంచుకోవడమే. అందుకే అది ఎక్కడా స్థిరంగా నిలవకుండా సంచరిస్తూ వుంటుంది. మూడవది: ప్రస్తుత కాలంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య కొట్టవచ్చినట్టు కనిపించే వైరం ఏదీ లేదు. దానికి భిన్నంగా వాటి నడుమ ఐక్యత బాగా కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. దానర్థం వాటి నడుమ వైరం ఏమీ లేదని కాదు. ఆ వైరం ఎప్పుడైనా బద్దలయ్యే అవకాశమూ లేకపోలేదు. కానీ ప్రస్తుతం, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలతో వ్యవహరించే విషయంలో మాత్రం సామ్రాజ్యవాద దేశాల మధ్య గణనీయమైన ఐక్యత ఉంది.

లెనిన్ కాలానికీ, ఇప్పటికీ ద్రవ్య పెట్టుబడి స్వభావంలో వచ్చిన తేడాలు గుర్తించాల్సినది కేవలం నమోదు చేసుకోవడం కోసం కాదు. ఈ తేడాలన్నీ పరస్పరం సంబంధం కలిగివున్నాయి. అవన్నీ కలిసి మొత్తంగా ఒక కొత్త పరిస్థితిని సూచిస్తున్నాయి. ఉదాహరణకు: పెట్టుబడి ప్రపంచీకరణ అయిన తర్వాత దానిని ఏదో ఒక సామ్రాజ్యవాద దేశంలో స్థాపితమైన పరిశ్రమతో సన్నిహితంగా పెనవేసుకుని ఉండలేదు. అది ప్రపంచీకరణకు లోనైంది అంటేనే దానర్థం పరిశ్రమకుండే సంకుచిత పరిమితులను దాటుకుని బైటపడి, వెనువెంటనే లాభాలు వచ్చే రకరకాల కార్యకలాపాలలో చొరబడాలి. అంటే దాని ప్రధాన స్వభావమే స్పెక్యులేటివ్‌గా మారిపోయింది. అది అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది కనుకనే సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరాలు పెరగకుండా అదుపు చేయడం దానికి అవసరం. ఆ వైరాలు గనుక తీవ్రమైతే, ఈ ప్రపంచం వేరు వేరు సామ్రాజ్యవాద కూటముల ప్రభావాల కింద చీలిపోతే అప్పుడు ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా ప్రపంచంలో ఎక్కడికైనా సంచరించగల అవకాశాలు తగ్గిపోతాయి. అందుచేత మనం గుర్తించిన ఈ లక్షణాలు పరస్పరం సంబంధం కలిగివుండడమే కాదు, అవి ఒక కొత్త పరిస్థితిని సూచిస్తున్నాయి.

అదే సమయంలో, ఈ ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ మున్నెన్నడూ లేనంత బ్రహ్మాండమైన స్థాయిలోజరిగిన పెట్టుబడి కేంద్రీకరణ మీద ఆధారపడి, అలా కేంద్రీకరించబడ్డ పెట్టుబడికి ప్రతినిధిగా ఉంది. పెట్టుబడి కేంద్రీకరణ గురించి లెనిన్ చెప్పిన క్రమం ముందుకు కొనసాగుతోందన్నది దీనిని బట్టి ధృవపడుతోంది. నిజానికి ఇప్పుడు కొన్ని ఆర్థిక సంస్థల దగ్గర ఈ ద్రవ్య పెట్టుబడి కేంద్రీకరణ జరిగి అక్కడ చాలా పెద్ద ఎత్తున నిధులు పోగుబడివుండడమే కాక, ఆ సంస్థలు ఆ నిధులను అదుపు చేయడం, తరలించడం చేస్తున్నాయి. దానితోబాటు వివిధ దేశాల్లో ఈ సంస్థలు తమకు అనుగుణంగా వ్యవహరించేలా వాటిని 'గొర్రెల మందల' మాదిరి నడుచుకునేలా చేయగలుగుతున్నాయి. తమ ప్రత్యక్ష ఆధీనంలో లేకపోయినా ఆ దేశాలు, సంస్థలు తాము చెప్పినట్టు నడుచుకునేలా

> **"ఇలా ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ గురించి నొక్కిచెప్పడం అంటే ఉత్పత్తి రంగంలో పెట్టుబడి కేంద్రీకరణ ప్రాధాన్యత ద్వితీయ స్థానానికి పడిపోయిందని కాదు. బహుళ జాతి కార్పొరేట్లు, వాటి కార్యకలాపాలు తక్కువ ప్రాధాన్యత కలిగి వున్నాయని అనుకోరాదు. అయితే ఈ బహుళజాతి కార్పొరేట్లతో పోల్చితే ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ అనేది ఈమధ్య బలంగా వచ్చిన ధోరణి. దాని పర్యవసానాలు చాలా పెద్దవి. అందుచేత దానిని ప్రత్యేకదృష్టితో చూడాలి."**

చేయగలుగుతున్నాయి. ఈ భారీస్థాయి కూటమి కార్యకలాపాలకు యావత్ ప్రపంచమే ఒక వేదికగా మారిపోయింది. ఆయా దేశాల నుండి వచ్చినప్పటికీ, ద్రవ్య పెట్టుబడి ఏదో ఒక 'జాతీయ ప్రయోజనాలకు' కట్టుబడి వ్యవహరించేపరిస్థితి లేదు. ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ ఏ దశకు చేరిందంటే, ఏ క్రెడిట్ రేటింగ్ ఏజన్సీ అయినా, లేక జార్జ్ సోరోస్ వంటి ఏ ఒక్క స్పెక్యులేటర్ అయినా కావాలనుకుంటే ఒకానొక దేశం నుండి పెట్టుబడులు అమాంతం కొద్ది గంటల్లోనే బైటకు ఎగిరిపోయేట్టు చేసి ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో విధ్వంసం సృష్టించగలరు.

ఇలా ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ గురించి నొక్కి చెప్పడం అంటే ఉత్పత్తి రంగంలో పెట్టుబడి కేంద్రీకరణ ప్రాధాన్యత ద్వితీయ స్థానానికి పడిపోయిందని మాత్రం కాదు. బహుళ జాతి కార్పొరేట్లు, వాటి కార్యకలాపాలు తక్కువ ప్రాధాన్యత కలిగివున్నాయని అనుకోరాదు. అయితే ఈ బహుళజాతి కార్పొరేట్లు మనతో చాలా కాలంనుండీ ఉన్నాయి. వాటి గురించి చాలా రచనలు వచ్చాయి. వాటితో పోల్చితే ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ అనేది ఈమధ్య బలంగా వచ్చిన ధోరణి. దాని పర్యవసానాలు చాలా పెద్దవి. అందుచేత దానిని ప్రత్యేకదృష్టితో చూడాలి.

ఈ విధంగా ద్రవ్య పెట్టుబడి కేంద్రీకరణ –ప్రపంచీకరణ జరిగే క్రమపు పర్యవసానాలు చాలా తీవ్రంగా, విస్తృతంగా ఉంటాయి. మొదటిది: సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో వృద్ధి రేటు తగ్గిపోయి నిరుద్యోగం చాలా ఎక్కువ స్థాయిలో దీర్ఘకాలంగా కొనసాగుతూవుండడం (దీనికి అదనంగా చక్రమణంలా సంక్షోభాలు వచ్చి మీద పడుతూవుండడం) ఒక పర్యవసానం. ఇలా ఆర్థిక మాంద్యం ఏర్పడడం అనేదాని ప్రభావం ఆ సంపన్న దేశాలన్నింటి మీదా ఒకే మోతాదులో లేదు. తక్కిన దేశాలకన్నా బ్రిటన్, అమెరికా ఈ విషయంలో మెరుగ్గా ఉన్నాయి. ఈ మాంద్యం నెలకొనడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, ద్రవ్య పెట్టుబడి కేంద్రీకరణ – ప్రపంచీకరణ జరిగిన ప్రభావాన్ని తక్కువగా అంచనా వెయ్యకూడదు.

ఈ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం వలన ఆయా దేశాలు కీన్షియన్ విధానం ప్రకారం డిమాండ్ మేనేజిమెంట్ చేపట్టగల అవకాశాలు నేరుగానే దెబ్బ తింటాయి. కీన్స్, కాలెక్కీ ఇద్దరూ చేసిన వాదనల ప్రకారం ఏ దేశంలోనైనా, డిమాండ్ మేనేజిమెంట్ విధానాలను అక్కడి ప్రభుత్వం చేపట్టదలచితే ఆ దేశంలోని ద్రవ్య పెట్టుబడి దానిని వ్యతిరేకిస్తుంది. ఇక ఆ ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ జరిగాక దాని వ్యతిరేకత ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ ప్రభావం చూపుతూనేవుంటుంది. రాజ్యం ఆర్థిక కార్యకలాపాలను విస్తరించే ప్రయత్నం చేపట్టగానే ద్రవ్య పెట్టుబడి అక్కడ ద్రవ్యోల్బణం పెరిగిపోతుందనీ, కరెన్సీ మారకపు రేటు పడిపోతుందనీ, రాజకీయంగా తీవ్రవాదం బలపడిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఇక ఆ దేశం నుంచి వెంటనే బైటకు తరలిపోతుంది. ఇలా తరలిపోవడం వలన నిజానికి అక్కడ కరెన్సీ విలువ పడిపోవడం, ద్రవ్యోల్బణం వంటివి సంభవిస్తాయి. దాంతో ఆ రాజ్యం తన ఆర్థిక కార్యకలాపాల విస్తరణ కార్యక్రమాన్ని అక్కడ ద్రవ్య పెట్టుబడి సంతృప్తి చెందే స్థాయి వరకూ తగ్గించివేసుకుని పరిమితం చేస్తుంది. ఒక విధంగా రాజ్యం మాట చెల్లుబాటు అయ్యే పరిధి తగ్గిపోతూవుంటుంది. ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ రాజ్యం ఆధిపత్యాన్ని దెబ్బ తీస్తుంది.

సంపన్న దేశాలలో చాలా చోట్ల తాము ఉపాధి అవకాశాలను పెంచుతామన్న హామీతో ఎన్నికైన వామపక్షవాద ప్రభుత్వాలు ఆ హామీని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవడం బట్టి రాజ్యం ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోడానికి వస్తుగతంగానే ఆటంకాలు ఉన్నాయని స్పష్టం అవుతోంది. ఈ పరిమితుల కారణంగా సామాజిక మార్పును కోరుకునే సోషల్ డెమాక్రసీ, కీన్షియన్ వాదం, మూడవ ప్రపంచ దేశాల్లోని జాతీయవాదం వంటి వివిధ రకాల సిద్ధాంతాలు బలహీనపడ్డాయి. ఈ అన్ని సిద్ధాంతాలూ సామాజిక మార్పును తీసుకురావడానికి సాధనంగా జాతిరాజ్యం (ప్రభుత్వం) ఉపయోగపడుతుందన్న అభిప్రాయంతో ఉంటాయి. కానీ ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ ఫలితంగా ఆ జాతిరాజ్యం జోక్యం చేసుకోగల శక్తి దెబ్బ తినిపోయింది. నిజానికి సోవియట్ యూనియన్ పతనం కూడా ఈ ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణతో ముడిపడినదే. అక్కడ సోవియట్ వ్యవస్థ సైతం ఈ పెట్టుబడి పలాయ నాన్ని అరికట్టలేకపోయింది.

సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక కార్యకలాపాల స్థాయి, ఉపాధికల్పన పెరగడానికి ఆయా దేశాల ప్రభుత్వాలు జోక్యం కల్పించుకోనవసరం లేదు. అమెరికన్ ప్రభుత్వం వాటి స్థూల డిమాండ్‌కు ఊపు కల్పించే చర్యలు తీసుకుంటే చాలు. డాలర్ ఇప్పుడు అత్యంత బలమైన కరెన్సీగా కొనసాగుతూన్నందువలన పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకుడి స్థానంలో ఉన్న అమెరికా తన ద్రవ్య లోటును వాణిజ్యలోటును విస్తరిస్తే సరిపోతుంది. కానీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని సంతృప్తి పరిచే విధంగా అమెరికన్ ప్రభుత్వం సైతం నడుచుకోవలసిన పరిస్థితి దాపురించింది. అందుచేత అమెరికా సైతం తన వాణిజ్య లోటును, ద్రవ్య లోటును కుదించుకోక తప్పడంలేదు. అమెరికా తన ద్రవ్య లోటును ఎప్పుడైతే కుదించుకుందో అప్పుడు ఆ దేశంలోకి ద్రవ్య పెట్టుబడులు ప్రవహించాయి. ఇక సాంప్రదాయంగా ద్రవ్య పెట్టుబడికి కేంద్రంగా బ్రిటన్ ఎప్పటినుంచో కొనసాగుతూనేవుంది కనుక ఆ దేశంలోకి కూడా ద్రవ్య పెట్టుబడి ప్రవహిస్తున్నది. అందువలన ఆ రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలూ కొంత విస్తరించాయి. ఈ విస్తరణ ప్రధానంగా ద్రవ్య పెట్టుబడితో ముడిపడి జరిగింది తప్ప పారిశ్రామికంగా కాదు. తక్కిన పెట్టుబడిదారీ ప్రపంచం మాత్రం మాంద్యంలో కొట్టుమిట్టాడుతోంది. కొంత కాలం తర్వాత దీనికి ప్రతిచర్యగా ఆ ప్రపంచం స్పందించ వచ్చు. దాని ప్రభావం అమెరికా, బ్రిటన్‌లపై పడుతుంది. ప్రస్తుతం పెట్టుబడిదారీ ప్రపంచంలో పాక్షికంగా కొనసాగుతున్న మాంద్యం ఆ తర్వాత మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆవరించే పరిస్థితి ఉత్పన్నం అవుతుంది. (దీనిని రచయిత 2000 సంవత్సరంలో రాశారు. ఆ తర్వాత కాలంలో

> **"అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రంగం మీదకు రావడం అనేది ఒక కొత్త దశతో ముడిపడివుంది. లెనిన్ సామ్రాజ్య వాదం... గ్రంథం రచించిననాటి దశ కన్నా ఇప్పటి దశ చాలా విభిన్నమైనది. అంతే కాదు, యుద్ధానంతర కాలంలో చేపట్టిన సంక్షేమరాజ్య విధానాలకన్నా పూర్తిగా భిన్నమైనటు వంటిది ఇది. మొదటి తేడాను ఎక్కువమందే గుర్తిస్తారు కానీ రెండవ తేడాను ఎక్కువమంది ఇంకా గమనించడం లేదు."**

జరిగిన పరిణామాలు, ముఖ్యంగా 2008 నాటి సంక్షోభం, మళ్ళీ ఇప్పుడు పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆవరిస్తున్న సంక్షోభం ఆనాటి విశ్లేషణ రుజుత్వాన్ని ధృవపరుస్తున్నాయి --అను)

రెండవది: ఈ నూతన నేపథ్యం మూడవ ప్రపంచ దేశాలమీద సామ్రాజ్యవాదం ఒక కొత్త దాడికి దిగడానికి దారి తీసింది. సరళీకరణ విధానాలను ఆ దేశాలమీదకు రుద్దే రూపంలో ఈ దాడి జరుగుతోంది. సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో నెలకొన్న ఆర్థిక మాంద్యం నుండి బైట పడడానికి వీలుగా ఆ దేశాలనుండి సరుకులు, సేవలు యథేచ్ఛగా మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లలోకి చొరబడడానికి ఈ సరళీకరణ విధానాలు అవకాశం ఇస్తాయి. ఈ విధానాలవలన రెండు ప్రయోజనాలు వాటికి కలుగుతాయి. మొదటిది: ప్రభుత్వాలు డిమాండ్ మేనేజిమెంట్ ద్వారా జోక్యం కల్పించు కునే అవకాశం పరిమితం అయిపోతుంది. దానితోబాటు రాజకీయ తీవ్ర వాదం (పెట్టుబడిదారులపై భారాలు పెంచి ప్రజలకు మేలు చేయాలనే ఏ వాదననైనా ద్రవ్య పెట్టుబడి 'రాజకీయ తీవ్రవాదం' గానే పరిగణి స్తుంది-అను) ప్రమాదం నివారించబడుతుంది. ఇక రెండవది: మూడవ ప్రపంచదేశాలలో పారిశ్రామికీకరణ క్రమాన్ని తిరోగమన దిశకు మళ్ళించడం ద్వారా, ఆ దేశాలు ఎక్కువగా ముడిసరుకుల ఉత్పత్తులపై ఆధారపడేట్టు చేయడం ద్వారా సంపన్న దేశాలు వాటిని చౌకగా పొంది తమ తమ దేశాల్లో ద్రవ్యోల్బణ తీవ్రతను తగ్గించుకోగలుగుతాయి.

అంతకన్నా ముఖ్యమైనది మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రవేశానికి తెరవడం. దీని వలన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి స్పెక్యులేటివ్ కార్యకలాపాల పరిధి విస్తరించడమే కాక, మూడవ ప్రపంచ దేశాలలోని ఖనిజ సంపద మీద, ఆ దేశాలలోని ప్రభుత్వ రంగ సంస్థల మీద పెత్తనం కూడా దక్కించుకోగలుగుతుంది.( సరళీకరణ విధానాలు మూడవ ప్రపంచ దేశాల్లోని ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణకు దారితీస్తాయి. కారుచౌకగా వాటిని అమ్మడం జరుగుతుంది) సరళీకరణ విధానాలు అంటే పెట్టుబడి ప్రపంచస్థాయిలో మరింత ఎక్కువగా కేంద్రీకరించబడేందుకు తోడ్పడే ఒక సాధనం. సంపన్న పెట్టుబడిదారీ దేశాల పారిశ్రామిక పెట్టుబడి మూడవ ప్రపంచ దేశాలలోని పారిశ్రామిక పెట్టుబడిని గెంటివే స్తుంది. ఇక సంపన్న దేశాల ద్రవ్య పెట్టుబడి ప్రపంచ వనరులన్నింటిమీదా ఆధిపత్యం చేజిక్కించుకుంటుంది. వీటిలో అధికభాగం అంతకు ముందు ప్రజాధనంతో నిర్మించబడ్డవే. వాటిని కారుచవుకగా కాజేస్తుంది.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రంగం మీదకు రావడం అనేది ఒక కొత్త దశతో ముడిపడివుంది. లెనిన్ సామ్రాజ్యవాదం... గ్రంథం రచించిననాటి దశ కన్నా ఇప్పటి దశ చాలా విభిన్నమైనది. అంతే కాదు, యుద్ధానంతర కాలంలో చేపట్టిన సంక్షేమరాజ్య విధానాలకన్నా పూర్తిగా భిన్నమైనటువంటిది ఇది. మొదటి తేడాను ఎక్కువమందే గుర్తిస్తారు కానీ రెండవ తేడాను ఎక్కువమంది ఇంకా గమనించడం లేదు. (సరళీకరణ విధానాల వలన కలుగనున్న హానిని 2000 నాటికి ఎక్కువ మంది గమనించలేదు-అను)

### ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ

ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ సామ్రాజ్య వాద దేశాల నడుమ ఒకమేరకు-కనీసం మూడవ ప్రపంచదేశాలతో వ్యవహరించే సందర్భాల వరకు- ఐక్యతను తీసుకువచ్చిం దన్నది వాస్తవం. అయితే దీనిని బట్టి ప్రపంచం సామ్రాజ్యవాదుల నడుమ అంతర్వైరుధ్యాలతో కొనసాగే దశ నుండి కాట్స్కీ ప్రతిపాదించిన అల్ట్రా సామ్రాజ్యవాద దశ (అసాధారణస్థాయికి చేరిన సామ్రాజ్యవాద దశ) కు చేరిందన్న అభిప్రాయం కలిగే అవకాశం ఉంది. లెనిన్ ఊహించినట్టుగా పెట్టుబడిదారీ ప్రపంచం సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరాలలో మునిగిపోలేదు గనుక కాట్స్కీ అంచనాయే సరైనదని పరిణామాలు రుజువు చేస్తున్నాయని అనిపించవచ్చు. అయితే అటువంటి నిర్ధారణ లకు రావడం అంటే లెనిన్‌కు, కాట్స్కీకి మధ్య ఉన్న తేడాను పొరపాటుగా అర్థం చేసుకోవడమే ఔతుంది. అంతేకాక, వర్తమాన ప్రపంచపు వాస్తవికతను కూడా పొరపాటుగా అర్థం చేసుకున్నట్టు అవుతుంది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం కొంతకాలం వరకూ అమెరికా తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తూ వచ్చింది. అందుకు బ్రెట్టన్ వుడ్ వ్యవస్థ (ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, వగైరా) ఏర్పాటు దోహదం చేసింది. డాలర్ ప్రమాణం అనేది బంగారం ప్రమాణం తో సమానం అని అవి ప్రకటించాయి. 1970 దశకం నాటికి మళ్ళీ సామ్రాజ్యవాదుల నడుమ అంతర్వైరుధ్యాలు పుంజుకుంటాయేమోనని అనిపించింది. అయితే సామ్రాజ్యవాద దేశాలు మొత్తం మీద అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా తమ మధ్య వైరాన్ని అదుపులోనే ఉంచుకోగలిగాయి. అందుకే అవి అన్నీ కలిసి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థలను ఉపయోగించి మూడవ ప్రపంచ దేశాలమీద ఉదారవాద విధానాలను రుద్దగలిగాయి. పెట్టుబడి ప్రపంచీకరణ క్రమం కాట్స్కీ చెప్పిన "అంతర్జాతీయ స్థాయిలో ఏకమైన ద్రవ్య పెట్టుబడి" దశకు చేరిందని దీనిని బట్టి అనిపించవచ్చు. అయితే, పెట్టుబడికి రాజ్యం అండ ఎప్పుడూ అవసరం. ఈనాడు పెట్టుబడి ప్రపంచం మొత్తం మీద యథేచ్ఛగా సంచరించ గలుగుతున్నది అంటే అందుకు దానికి కొన్ని రాజ్యాల అండ లభిస్తూండడమే కారణం. దానికి అండగా నిలిచిన రాజ్యాల పెత్తనం ప్రపంచం మొత్తం మీద కొనసాగుతూ న్నందు వలన ఇది సాధ్యమైంది. ఒక ప్రపంచరాజ్యం అనేది ఏదీ లేనప్పుడుపెట్టుబడి ప్రపంచం అంతటా ఇలా స్వేచ్ఛగా సంచరించ గలగాలంటే అందుకు కొన్ని బలమైన దేశాల కూటమి అండ ఉండడం తప్పనిసరి. అటువంటి కూటమికి ఒక నాయకుడు ఉండితీరాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి నాయకత్వం అందిచగలిగేది అమెరికా అని వేరే చెప్పనవ సరం లేదు.

సామ్రాజ్యవాద దశ వచ్చాక దాని అనివార్యమైన పర్యవసానంగా యుద్ధం వస్తుంది. ఈ పరిస్థితి సోషలిస్టు విప్లవాల యుగపు ప్రారంభాన్ని సూచిస్తుంది.

‘పెట్టుబడిదారీ వ్యవస్థలో అసమాన అభివృద్ధి ఉంటుంది. అంటే, ప్రపంచాన్ని ఉమ్మడిగా కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాద దేశాల నడుమ ఏదైనా అంగీకారం కుదిరితే, అది అప్పటికి ఆ దేశాలకున్న సాపేక్ష బలాబలాలను బట్టి కుదురుతుంది. కాలం గడుస్తున్నకొద్దీ ఆ అంగీకారాన్ని బలప్రయోగంతో తిరగరాయడం జరుగుతుంది. మధ్య మధ్యలో సంధి కుదిరి శాంతి ఏర్పడినప్పటికీ, ఘర్షణలు, యుద్ధాలు అనేవి సామ్రాజ్యవాదుల నడుమ నిరంతరం కొనసాగుతూనేవుంటాయి. శాంతియుత పరిస్థితులు తాత్కాలికమే. నిరంతర యుద్ధ పరిస్థితుల మధ్య విరామం వంటివి అవి. పెట్టుబడిదారీ వ్యవస్థలో శాశ్వత శాంతి అనేది అసాధ్యం’ అని లెనిన్ చెబుతాడు.

> **“ ప్రస్తుతం సామ్రాజ్యవాద దేశాలనడుమ కనిపిస్తున్న ఐక్యత కూడా తాత్కాలికమే కావచ్చు. ఒకవేళ సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యాలు చప్పబడిన దశలోనే కొనసాగుతూ, ఈ ఐక్యత దీర్ఘకాలం కొనసాగినప్పటికీ, యుద్ధాలను నివారించడం సాధ్యమేనని చెప్ప లేం. ప్రపంచాన్ని ఉమ్మడిగా కొల్లగొట్టడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నాయకత్వం లో కొనసాగుతున్న ప్రక్రియను చెదరగొట్టడానికి వేరు వేరు రకాల యుద్ధాలు తలెత్తవచ్చు. ”**

ప్రస్తుతం సామ్రాజ్యవాద దేశాలనడుమ కనిపిస్తున్న ఐక్యత కూడా తాత్కాలికమే కావచ్చు. ఒకవేళ సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యాలు చప్పబడిన దశలోనే కొనసాగుతూ, ఈ ఐక్యత దీర్ఘకాలం కొనసాగినప్పటికీ, యుద్ధాలను నివారించడం సాధ్యమేనని చెప్ప లేం. ప్రపంచాన్ని ఉమ్మడిగా కొల్లగొట్టడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నాయకత్వంలో కొనసాగుతున్న ప్రక్రియను చెదరగొట్టడానికి వేరు వేరు రకాల యుద్ధాలు తలెత్తవచ్చు. ఐక్యంగా వ్యవహరిస్తున్న సామ్రాజ్యవాద దేశాలకు, వాటికి తలొగ్గి వ్యవహరించడానికి నిరాకరించే దేశాలకు నడుమ యుద్ధాలు తలెత్తవచ్చు. సామ్రాజ్యవాద దేశాల నడుమ జరిగేవే కాకుండా యుద్ధాల్లో ఇంకా పలు రకాలు ఉంటాయని లెనిన్ సామ్రాజ్యవాదం... గ్రంథ రచన అనంతర కాలంలో చేసిన రచనల్లో పేర్కొన్నాడు. పలు రకాలుగా సామ్రాజ్యవాద దశలో యుద్ధాలు అనివార్యంగా జరుగుతూ నేవుంటాయని చెప్పాడు.

ప్రస్తుత కాలంలో చూస్తే ఈ దశాబ్దంలో (1990-2000) సామ్రాజ్యవాద దేశాల నడుమ ఐక్యత కొనసాగుతోంది. సోవియట్ యూనియన్ పతనమైంది. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా మూడవ ప్రపంచ దేశాల పోరాటాలు ఇంకా మొగ్గ తొడిగే దశలోనే ఉన్నాయి. అయినప్పటికీ, సామ్రాజ్యవాదం ఇరాక్ మీద, యుగోస్లావియా మీద యుద్ధాలకు దిగింది.

### వినాశనకర పర్యవసానాలు

ప్రస్తుతం కొనసాగుతున్న ప్రపంచీకరణ క్రమం వలన మూడవ ప్రపంచదేశాలలో వినాశకర పర్యవసానాలు కలుగుతాయి. అవి ఘర్షణలకు, యుద్ధాలకు దారి తీస్తాయి. ఇక్కడ కనీసం ఐదు ముఖ్యమైన పర్యవసానాలను గమనించాలి. మొదటిది: ప్రపంచీకరణ మూడవ ప్రపంచ దేశాల్లోని కార్మికుల, రైతుల ఆదాయాలను తీవ్రంగా కుదించివేసి వారి జీవన ప్రమాణాలను బాగా దెబ్బ తీస్తుంది. వాణిజ్య సరళీకరణ ఈ దేశాల్లో ఉన్న పరిశ్రమల్ని మూతబడేలా చేస్తుంది. ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయోత్పత్తుల ఎగుమతులమీద ఎక్కువగా ఆధారపడేట్టు చేస్తుంది. అది ఆ దేశాల ఆహార భద్రతకు ముప్పు తెస్తుంది. ప్రపంచ మార్కెట్‌లో ఉండే ఎగుడు దిగుడుల తాకిడికి ఈ దేశాల రైతాంగం బలౌతారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి గుప్పెట్లో చిక్కుకున్నాక ఆ దేశం నిరంతరం ‘అంతర్జాతీయ మదుపరుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం’ అన్న అంశం చుట్టూ పరిభ్రమిస్తూ వుండవలసి వస్తుంది. అందుకోసం వడ్డీ రేట్లను ఎక్కువగా కొనసాగించాల్సివస్తుంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలకు కోతలు పెట్టవలసివస్తుంది. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించవలసివుంటుంది. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం తలెత్తకుండా చూసుకోవలసివుంటుంది. కార్మికుల హక్కులను కట్టడి చేయవలసివస్తుంది. ఈ అన్ని చర్యలూ ఆర్థిక మాంద్యానికి దారి తీస్తాయి. నిరుద్యోగం పెరిగిపోతూవుంటుంది. ఆదాయాల పంపిణీ పేదలకు ప్రతికూలంగా మారుతుంది. పేదరికం తీవ్రత పెరిగిపోతూవుంటుంది.

రెండవది: ప్రపంచీకరణ మూడవ ప్రపంచదేశాల ఆర్థిక, రాజకీయ సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీస్తుంది. ఈ దేశాల్లో అంతర్జాతీయ పెట్టుబడి నిరాటంకంగా తన ఇష్టం వచ్చినట్టు వ్యవహరించగలగాలంటే, దానికి అవసరమైన భద్రతను సంపన్న పెట్టుబడిదారీ దేశాలు గ్యారంటీ చేయాలి. వాటి పెత్తనంలో నడిచే ఐఎంఎఫ్ వంటి సంస్థలు పర్యవేక్షించాలి. ఇదంతా మూడవ ప్రపంచ దేశాల స్వయంనిర్ణయ శక్తిని దెబ్బ తీసినప్పుడే సాధ్యమౌతుంది. ఐఎంఎఫ్ వంటి సంస్థల షరతుల చట్రానికి లోబడి మూడవ ప్రపంచ దేశాలు నడుచుకునేలా చేయడానికి కొన్ని ఇతర ఏర్పాట్లు కూడా అవసరమౌతాయి. ఆ దేశాల ప్రభుత్వాల్లో కీలకపదవులు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా ఉండే రాజకీయ నాయకులకు, బ్యూరోక్రాట్లకు కట్టబెట్టాలి. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల్లో పని చేసిన వారిని ఆయా దేశాల మంత్రిత్వ విభాగాల్లో నియమించాలి. ఆ శాఖలు ఆ దేశపు ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణ లకు అతీతంగా స్వతంత్రంగా వ్యవహరించే ఏర్పాట్లు ఉండాలి. రాజకీయ నేతల దురాశలకు అతీతంగా ఈ శాఖలు వ్యవహరించ గలిగివుండాలి అన్న పేరుతో ఈ ఏర్పాట్లు చేస్తారు. ఆర్థిక సరళీకరణలో భాగంగా రిజర్వుబ్యాంక్ స్వయం ప్రతిపత్తితో నడవాలని నిర్దేశిస్తారు. మొత్తం మీద ఈ చర్యలన్నీ కలిసి ఆ దేశపు ప్రభుత్వం తన స్వంత ఆర్థిక నిర్ణయాలను తీసుకోలేని స్థితిలోకి నెట్టివేయబడుతుంది.

మూడవది: మదుపుదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి అన్న పేరుతో క్రమంగా దేశ సహజవనరులను, ప్రత్యేకించి ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ శక్తులకు నామమాత్రపు ధరలకే సమర్పించుకోవడం సాగుతుంది. దీనిని ‘విజాతీయాకరణ’ అని అనవచ్చు. ఐఎంఎఫ్ షరతులలో భాగంగా ప్రైవేటీకరణ అనేది విధిస్తారు. ఆ ప్రైవేటీకరణ వలన అంతిమంగా లబ్ధి పొందేది బహుళజాతి కంపెనీలు మాత్రమే. ఇది కాకుండా, అంతర్జాతీయ మదుపు దారుల దురాశ వలన పెట్టుబడులు తరలిపోతా యనే భయం ఎప్పుడూ మెడమీద కత్తిలా వేలాడుతూనేవుంటుంది. అలా తరలిపోకుండా వాటిని సంతృప్తి పరచడానికి ప్రభుత్వం తన విలువైన ఆస్తులను విజాతీయం చేయడానికి పూనుకుంటుంది.

నాలుగవది: సార్వభౌమాధికారం దెబ్బ తినడం, శ్రామిక వర్గాల ఆదాయాలు

(మిగతా 33వ పేజీలో)

# సామ్రాజ్యవాద వ్యూహంలో భాగమే వెనిజులాపై అమెరికా దాడి

**ఆంద్రీ డెమన్**


రచయిత ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ ఎడిటర్, రచయిత

అమెరికన్ సామ్రాజ్యవాదం మరోసారి యుద్ధాలకు తెగబడింది. లాటిన్ అమెరికా దేశాలన్నింటినీ పాదాక్రాంతం చేసుకోవాలనే పథకంలో భాగంగా వెనిజులాపై దాడి చేసి రాత్రికి రాత్రి అధ్యక్షుడు నికొలస్ మదురోను, ఆయన భార్యను అపహరించుకు పోయారు. ఇప్పుడు సోషలిస్టు క్యూబా పని కూడా పడతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూంకరిస్తున్నాడు.

1962లో క్యూబా మిస్సైల్ సంక్షోభం తర్వాత కరీబియన్ సముద్రంలోకి అత్యంత భారీస్థాయిలో అమెరికా సైనిక బలగాలను ఇప్పుడు తరలించింది. 15,000 మంది సైనికులు, విమాన వాహక యుద్ధనౌక గెరాల్డ్ ఫోర్డ్‌తో పాటు డజను యుద్ధనౌకలు, అనేక యుద్ధ విమానాలను కేంద్రీకరించింది.

సెప్టెంబరు నెల నుండి దక్షిణ కరీబియన్, తూర్పు పసిఫిక్‌లో అమెరికా డ్రోన్‌లు, మిస్సైల్స్‌తో బోట్లపై 22 సార్లు దాడులు చేసింది. ఈ దాడులలో 87 మంది మరణించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దారులపై దాడులు చేస్తున్నామని వైట్‌హౌస్ చేస్తున్న వాదనలు అబద్ధమని స్పష్టంగా తెలుస్తున్నది. ఎందుకంటే గత నెలలో వైట్ హౌస్ ప్రకటించిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజి (జాతీయ రక్షణ వ్యూహం)లో లాటిన్ అమెరికా దేశాలలో జోక్యం చేసుకోవటానికి రూపొందించిన ప్రణాళికను వెల్లడించారు. "అమెరికాను పశ్చిమార్ధగోళంలో ప్రధానశక్తిగా తిరిగి పునరుద్ధరించటం అన్న మన్రో సిద్ధాంతానికి అనుగుణంగా, వ్యూహాత్మకంగా కీలకమైన, పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకోవటానికి ఉపయోగపడే మన ఖండంలోని వనరులు, ఆస్తులపై చైనా ఆధిపత్యం సాధించకుండా చేయటానికి" ట్రంప్ రూపొందించిన విధానం అది అని ప్రకటించారు. "ఈ ప్రాంతంలో అమెరికన్ కంపెనీలకు వ్యూహాత్మకంగా కీలకమైన ఆస్తులను గుర్తించటం, పెట్టుబడులకు అవకాశాలను అన్వేషించటాన్ని ప్రభుత్వం చేయాలని" దానిలో పేర్కొన్నారు.

రెండు ఖండాలపై అమెరికా ఆధిపత్యాన్ని నొక్కి చెబుతూ "మన పశ్చిమార్ధగోళం" అని డాక్యుమెంటులో పేర్కొన్నారు. రష్యా, చైనాలను ఎదుర్కోవటానికి అవసరమైన శక్తిని సమీకరించుకోవటానికి లాటిన్ అమెరికాలోని వనరులను స్వంతం చేసుకోవటం, వాటిపై ఆధిపత్యాన్ని కలిగి వుండటం అవసరమని అమెరికా భావిస్తున్నది. అందుకోసం వనరులను బలవంతంగా స్వాధీనం చేసుకోవటానికి ప్రణాళిక రూపొందించింది.

ఇతర దేశాల కన్నా ఎక్కువగా వెనిజులాలో 30,000 కోట్ల బ్యారెళ్ళ పెట్రోలియం నిల్వలున్నాయని గుర్తించారు. ఆయిల్‌తో పాటు బ్యాటరీలు, సెమి కండక్టర్లు, మోటార్ల నిర్మాణానికి అవసరమైన లీథియం, రాగి నిల్వలు లాటిన్ అమెరికా దేశాలలో ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచంలోని ఏ దేశం కన్నా ఎక్కువ రాగిని చిలీ ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలో కెల్లా ఎక్కువ లీథియం నిల్వలు ఆ దేశంలో ఉన్నాయి.

రష్యా, చైనా రెండింటినీ లక్ష్యంగా పెట్టుకొని వెనిజులాలోని ఆయిల్, సహజ వనరులను స్వాధీనం చేసుకోవటానికి అమెరికా వెనిజులాపై దాడి చేసింది. 2005 నుండి చైనా వెనిజులాకు అతి పెద్ద రుణదాతగా ఉన్నది. ఈ కాలంలో 6,200 కోట్ల డాలర్లను రుణంగా ఇచ్చింది. ఆయిల్‌తో పాటు 80 శాతం సరుకులను వెనిజులా నుండి దిగుమతి చేసుకోవటం ద్వారా ఈ రుణాన్ని చెల్లువేసుకొంటున్నది. వెనిజులా ఇంధన వనరులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటానికి రష్యా వందల కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టింది.

వెనిజులాపై దాడి చేయడానికి అత్యంత హాస్యాస్పదమైన ఆరోపణలు చేశారు. 2003లో ఇరాక్‌పై జరిగిన నేరపూరితమైన దాడిని సమర్థించుకోవటానికి బుష్ నాయకత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం కనీసం తన చర్యలను–అవెంత మోసపూరితమైనవి అయినా– చట్టబద్ధంగా కనిపించేలా చేయటానికి ప్రయత్నం చేసింది. ప్రస్తుతం అటువంటి ప్రయత్నమే లేదు. సముద్రంపై ప్రయాణిస్తున్న వారిని చంపటానికి, విదేశాల ఆస్తులను స్వాధీనం చేసుకోవటానికి, తమ ఇచ్ఛానుసారంగా ప్రభుత్వాలను కూలదోయటానికి తమకు హక్కు ఉన్నదని అధికార యంత్రాంగం ప్రకటించింది. 1930 దశాబ్దం చివరిలో తన చుట్టు పక్కల ఉన్న దేశాలను ఆక్రమించిన హిట్లర్ చర్యకు, ప్రస్తుతం వెనిజులాపై అమెరికా దాడికీ ఎటువంటి తేడా లేదు.

వెనిజులాలో అమెరికా జోక్యానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. 1908లో జువాన్ విసెంటె గోమెజ్ అధికారంలోకి రావటానికి చేసిన కుట్రపూరిత తిరుగుబాటుకు అమెరికా మద్దతు ఇచ్చింది. ఆ తర్వాత 27 సంవత్సరాల పాటు ఆయన అత్యంత క్రూరంగా పరిపాలిస్తూ, వెనిజులా చమురు సంపదను అమెరికా కార్పొరేషన్‌ల పరం చేశాడు.

ప్రత్యక్ష సైనికదాడులు, లేదా సిఐఏ ద్వారా అంతర్గత తిరుగుబాట్లను ప్రోత్సహించి, లాటిన్ అమెరికా దేశాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను కూలద్రోస్తున్న అమెరికా సుదీర్ఘమైన రక్తచరిత్రలో ఇదొక చిన్న అంకం మాత్రమే. 1954లో గ్వాటెమాలా, 1964లో బ్రెజిల్, 1973లో చిలీలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను కూలదోసింది. 1980 దశాబ్దం లో ఎల్ సాల్వడార్‌లో సాయుధ హంతక దళాలను ప్రోత్సహించింది. 1989లో పనామాపై దాడి చేసింది. ఈ

మధ్యకాలంలో బ్రెజిల్‌లో అత్యంత మితవాద అధ్యక్షుడైన జైర్ బోల్సనారోకు, అర్జెంటైనాలో జేవియర్ మిలెకు మద్దతిచ్చింది.

వెనిజులా, కొలంబియా, క్యూబా ప్రభుత్వాలను కూలదోయటం, కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచటం, ఆ దేశాలలో నియంతృత్వ ప్రభుత్వాలను ఏర్పాటు చేసి సహజ సంపదలను దోపిడి చేయటం అమెరికా లక్ష్యం.

అమెరికన్ మీడియా ఈ కార్యక్రమాలకు ప్రచార బాకాగా పని చేస్తున్నది. వెనిజులాపై దాడికి ముందు ఆ దేశ ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడోను సిబిఎస్ వార్తాసంస్థ ఇంటర్వ్యూ చేసింది. అమెరికా సైనిక జోక్యాన్ని ఆమె బహిరంగంగా బలపరిచింది. మచాడో, వెనిజులా ప్రతిపక్షం అమెరికా దాడిని సమర్థించాయి. వెనిజులాలోని కొన్ని శక్తుల మద్దతు కూడా వారికి ఉన్నది. ప్రభుత్వాన్ని అస్థిరపరచటానికి ప్రతిపక్షాలు అమెరికా మద్దతుతో సంవత్సరాల తరబడి ప్రయత్నాలు చేసినప్పటికీ, దేశ ప్రజల నుండి మదురో ప్రభుత్వాన్ని ఓడించటానికి అవసరమైన మద్దతు లభించలేదు. అమెరికా ప్రభుత్వం ఏర్పాటు చేసే కీలుబొమ్మ ప్రభుత్వాల పాలనలో ఉండాలని వెనిజులా ప్రజలు కోరుకోవటం లేదు.

అమెరికా చరిత్రలోనే అత్యధిక వ్యయంతో కూడిన సైనిక బడ్జెట్‌ను ఆమోదించటానికి అమెరికా పార్లమెంటులోని డెమోక్రాటిక్ నాయకత్వం, రిపబ్లికన్ నాయకత్వంతో కలిసి పనిచేసింది. అనుబంధ ఖర్చులతో కూడా కలుపుకుంటే నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ ద్వారా చేసిన 90,100 కోట్ల డాలర్ల కేటాయింపులు లక్ష కోట్ల డాలర్లు దాటిపోతాయి. మైనారిటీ నాయకుడు హకీం జాఫ్రి, మైనారిటి విప్ కాథరీన్ క్లార్క్, డెమోక్రటిక్ పార్టీ కాకస్ ఛైర్మన్ పీట్ ఆగిలార్‌లు ఈ బిల్లును బలపరుస్తూ ఓట్లు వేశారు.

ట్రంప్ ప్రభుత్వం వెనిజులా మొత్తం లాటిన్ అమెరికా దేశాలతో పాటు, అంతర్గతంగా అమెరికాలో కూడా అత్యంత ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నది. ట్రంప్ నేతృత్వంలోని అధికారగణం గెస్టాపో తరహాలో వలసదారులపై చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ అన్ని నగరాలలో వాకౌట్లు, నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులను సామూహికంగా తొలగించటం, నిజ వేతనాలు పడిపోవటం, ప్రభుత్వ విద్య, వైద్యరంగాలను నాశనం చేస్తున్న తీరుపై ప్రజలలో ఆగ్రహం పెరుగుతున్నది. కరీబియన్ ప్రాంతంలో

❝ వెనిజులా ప్రతిపక్షం అమెరికా దాడిని సమర్థించాయి. వెనిజులాలోని కొన్ని శక్తుల మద్దతు కూడా వారికి ఉన్నది. ప్రభుత్వాన్ని అస్థిరపరచటానికి ప్రతిపక్షాలు అమెరికా మద్దతుతో సంవత్సరాల తరబడి ప్రయత్నాలు చేసినప్పటికీ, దేశ ప్రజల నుండి మదురో ప్రభుత్వాన్ని ఓడించటానికి అవసరమైన మద్దతు లభించలేదు. అమెరికా ప్రభుత్వం ఏర్పాటు చేసే కీలుబొమ్మ ప్రభుత్వాల పాలనలో ఉండా లని వెనిజులా ప్రజలు కోరుకోవ టం లేదు. ❞




మదురోను, ఆయన సతీమణిని అపహరించి తీసుకుపోతున్న అమెరికా సైన్యం

పెరుగుతున్న సైనిక కార్యకలాపాలకు నిధులను కేటాయించటం కోసం ఆహార కూపన్లు, వైద్య సబ్సిడీలు, సామాజిక సంక్షేమానికి నిధులను తగ్గించటంపై అమెరికా ప్రజలు కోపోద్రిక్తులవుతున్నారు.

విదేశాలలో చేసే యుద్ధం, దేశంలో ప్రజలను అణచివేయటానికి దారితీస్తుంది. ఎటువంటి సాక్ష్యాలు, విచారణ లేకుండా అంతర్జాతీయ జలాలలో ప్రజలను హత్య చేసే హక్కు తమకు ఉన్నదని వాదిస్తున్న అధికార యంత్రాంగం అమెరికాలో తమ చర్యలను వ్యతిరేకించేవారిని నేరస్తులని ముద్ర వేయటానికి సన్నాహాలు చేస్తున్నది. ఎటువంటి సాక్ష్యాధారాలు లేనప్పటికీ వెనిజులా తీరప్రాంతంలో తాము చంపుతున్నవారు టెర్రరిస్టులని ముద్రవేసి, ట్రంప్ అధికార గణం ఈ హత్యాకాండను సమర్థించుకొంటున్నది. విదేశాలలో తమ విధానాలను వ్యతిరేకిస్తున్న వారిని టెర్రరిస్టులని ముద్ర వేస్తున్న ప్రభుత్వం, తమ విధానాలను వ్యతిరేకిస్తున్న అమెరికా ప్రజలను కూడా టెర్రరిస్టులుగా ముద్రవేయటం ద్వారా పెరుగుతున్న ప్రజా ఉద్యమాలను అణచివేయటానికి ప్రయత్నిస్తున్నది.

1980 దశాబ్దంలో సెంట్రల్ అమెరికా దేశాలలో పూర్తిస్థాయి యుద్ధం చేయటానికి, ప్రత్యేకించి నికరాగ్వాను లక్ష్యంగా చేసుకోవటానికి సన్నాహాలు ప్రారంభించినపుడు, ఆ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న మూడు లక్షల మంది అమెరికన్లను జైళ్ళలో నిర్బంధించారు. 40 సంవత్సరాల తర్వాత ట్రంప్ ఆనాటి కన్నా తీవ్రస్థాయిలో సామూహిక నిర్బంధం, హింసకు ప్రణాళిక రూపొందిస్తున్నాడు.

అందువలన వెనిజులాపై సామ్రాజ్య వాదం చేసిన దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న

**“ క్యూబాకు ఆయిల్ సరఫరాచేసే ట్యాంకర్లను అమెరికా సైన్యం దిగ్బంధిస్తున్నది. ఆ దిగ్బంధాన్ని అధిగమించేందుకు చేసే ఏ ప్రయత్నమైనా సైనిక సంఘర్షణకు దారితీసే ప్రమాదముంది. జనవరి 8న వెనిజులా నుండి బయలుదేరిన రష్యన్ జెండా కలిగిన ట్యాంకర్‌ను, అమెరికా స్వాధీనం చేసుకుంది. ఈ దుశ్చర్యను మాస్కో ఖండించింది. చైనా ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకించింది. అమెరికా చర్య క్యూబాను కరువు కాటకాలకు, మారణ హోమానికి గురిచేసే ముప్పు కనిపిస్తున్నది. ”**

పోరాటాలను యుద్ధానికి, నియంతృత్వానికి, సామాజిక ప్రతీఘాత విప్లవానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ కార్మికవర్గం చేస్తున్న విస్తృత పోరాటంలో భాగమని అర్థం చేసుకోవాలి.

**ఇంధన దిగ్బంధనంతో క్యూబాను కూల్చే కుట్రలు**

క్యూబాపై అమెరికా కఠినతరం చేసిన ఇంధన నిషేధం వినాశకరమైన పరిణామాలకు దారితీస్తుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ హెచ్చరించారు. క్యూబా దాని చమురు అవసరాలను తీర్చకపోతే మానవతావాదం పతనానికి చేరువవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రజలకు వ్యతిరేకంగా ట్రంప్ జాతి హననం విధానాన్ని అనుసరిస్తున్నారని క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్–కానెల్ ఖండించిన తర్వాత ఈ హెచ్చరిక వెలువడింది.

క్యూబాలో దేశవ్యాప్తంగా విద్యుత్ కోతలు వారాల తరబడి కొనసాగుతున్నాయి. విశ్లేషకులు అంచనా ప్రకారం కేవలం రెండు వారాలకు సరిపడే ఇంధనం మాత్రమే అక్కడ మిగిలి ఉంది. దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఇప్పటికే రోజుకు 20 గంటలు విద్యుత్తు సరఫరా జరగటంలేదు. ఇంధన దిగ్బంధనం వల్ల ఆసుపత్రులు, ఆహార ఉత్పత్తి, నీటి శుద్ధి, శీతలీకరణ వరకు ఆధునిక సమాజంలోని ప్రతి అంశం దెబ్బతిందున్నది. ఆయిల్ కొరతతో పారిశుద్ధ్య ట్రక్కులు మూలనపడ్డాయి. దానితో చెత్త సేకరించలేక కుప్పలుగా పేరుకుపోతున్నది. గ్యాస్ స్టేషన్ల చుట్టూ జనసమూహం అంతులేని క్యూ లైన్లలో వేచివుంటున్నారు. ఈ పరిస్థితులు ఆ సమాజంలో నిరాశను, అశాంతిని రేకెత్తిస్తున్నాయి.

క్యూబా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకే ట్రంప్ ఈ దుశ్చర్యలకు పూనుకున్నాడు. 1959లో క్యూబా విప్లవం జయప్రదమైంది. ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలో ప్రభుత్వం స్థాపించబడింది. ఆ విప్లవ నేత స్ఫూర్తితో, నడుస్తున్న ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు దాదాపు ఏడు దశాబ్దాలుగా అమెరికన్ సామ్రాజ్యవాదం కుట్రలుచేస్తున్నది. ఆ కుట్రలను కొనసా గించటమే లక్ష్యంగా ట్రంప్ దుశ్చర్యలున్నాయి.

జనవరి 3న వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా అత్యంత క్రూరమైన రీతిలో అపహరించింది. ఆ తర్వాత క్యూబాకు అత్యంత కీలక జీవనాధారమైన వెనిజులా నుండి చమురు సరఫరాను బంద్ చేసింది. అమెరికా “జాతీయ భద్రతకు అసాధారణ ముప్పు” అంటూ ట్రంప్ క్యూబాపై అసంబద్ధ ఆరోపణలు చేశాడు. క్యూబాకు చమురు సరఫరా చేసే దేశాలపై సుంకాలు విధిస్తానని బెదిరించాడు. దాంతో మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ కూడా క్యూబాకు చమురు తదితర కీలకమైన సరుకుల సరఫరాను నిలిపేశారు.

క్యూబాలో ఈ సంవత్సరం ప్రారంభం నుండే పరిస్థితి దారుణంగా మారింది. 2022 నుండి ఇప్పటి వరకు ఇక్కడి జనాభాలో 10 శాతం మంది లేదా 10 లక్షల కంటే ఎక్కువ మంది క్యూబా నుండి తరలిపోయారు. ఇది క్యూబా చరిత్రలో అతిపెద్ద వలస. కోవిడ్ వల్ల ఇక్కడి పర్యాటక రంగం దెబ్బతింది. అప్పటి నుండి ఈ వలసల క్రమం వేగవంతమైంది.

మందులు, యంత్రాలతో సహా ముఖ్యమైన దిగుమతులకు చెల్లింపులుచేయాలి. అందుకోసం క్యూబా తన ‘అరకొర ఇంధనం’ లోని కొంత భాగాన్ని కూడా అమ్ముకోవలసివచ్చింది. తమ దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమల ఆధునీకరణకు, విదేశీ కరెన్సీ నిల్వల పెంపుకు క్యూబా ప్రజా ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. గత డిసెంబర్‌లో తుది ప్రయత్నంగా చేపట్టిన ఆర్థిక వ్యవస్థలో ‘పాక్షిక డాలరైజేషన్’ ప్రక్రియ విఫలమైంది.

అమెరికా సైనిక వ్యవస్థలోని అత్యంత అధునాతన విమాన వాహక నౌక, యుఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్’ కరేబియన్ ప్రాంతంలో తిష్టవేసింది. 15,000 మంది సైనికులతో అతిపెద్ద సైనిక పటాలాన్ని మొహరించింది. అంతేగాక ఈ భారీ సైనిక మొహరింపులను 2028 వరకు కొనసాగించేలా ప్రణాళికలు రూపొందించినట్లు దాని ఒప్పందం రికార్డులు తెల్పుతున్నాయి..

మదురో అపహరణ తర్వాత క్యూబా అధ్యక్షుడు డయాజ్–కానెల్ టెలివిజన్‌లో ప్రసంగించారు. “అమెరికాతో చర్చల్లో పాల్గొనడానికి క్యూబా సిద్ధంగా ఉంది. మా ప్రజలకు పరస్పర ప్రయోజనకరంగా ఉంటే, ఇరుగు పొరుగు దేశాలతో నాగరిక సంబంధం ఏర్పాటుకై ఇప్పటివరకూ ప్రయత్నిస్తూనేవుంది. కాబట్టి, అమెరికాతో సంభాషణను కొనసాగించాలి” అని పేర్కొన్నారు. అయితే “అనివార్యమైతే క్యూబా ఏ క్షణంలోనైనా యుద్ధాన్ని ఎదుర్కొనడానికి కూడా సిద్ధం” అని ఆయన వెల్లడించారు.

రష్యా రాయబారి ‘విక్టర్ కరోనెల్లి’ క్యూబాకు చమురు సరఫరాను కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. క్యూబాకు ఆయిల్ సరఫరాచేసే ట్యాంకర్లను అమెరికా సైన్యం దిగ్బంధిస్తున్నది. ఆ దిగ్బంధాన్ని అధిగమించేందుకు చేసే ఏ ప్రయత్నమైనా సైనిక సంఘర్షణకు దారితీసే ప్రమాదముంది. జనవరి 8న వెనిజులా నుండి బయలుదేరిన రష్యన్ జెండా కలిగిన ట్యాంకర్‌ను, అమెరికా స్వాధీనం చేసుకుంది. ఈ దుశ్చర్యను మాస్కో ఖండించింది. చైనా ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకించింది. అమెరికా చర్య క్యూబాను కరువు కాటకాలకు, మారణ హోమానికి గురిచేసే ముప్పు కనిపిస్తున్నది.


ట్రంప్ తాను వెనిజులాను పరిపాలిస్తానని బహిరంగంగా ప్రకటిస్తున్నాడు. 19వ శతాబ్దపు మెక్సికో భూభాగంలో సగాన్ని అమెరికా సైనిక బలంతో దురాక్రమించింది. ఈ దుష్ట విధానాన్నే క్యూబాలో కూడా అమలుచేయాలని ట్రంప్ బహిరంగంగా ప్రకటిస్తున్నాడు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

*

# ఉత్తర భారతం: సామ్రాజ్యాల మధ్య పోరు

## క్రీ.శ.1400-1525



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

ఢిల్లీ కేంద్రంగా 12వ శతాబ్దం చివర్లో తురుష్కులు నెలకొల్పిన రాజ్యం 15వ శతాబ్దం దాకా కొనసాగింది. 15వ శతాబ్దం తొలి దశకంలో విచ్ఛిన్నమైంది. మంగోల్ ప్రాంతం నుండి ఛెంగిజ్ ఖాన్ వంశస్తుడైన తైమూర్ లంగ్ 1398లో ఢిల్లీ మీద దాడి చేశాడు. అప్పటికే క్రమంగా ఢిల్లీ సుల్తానుల ఆధిపత్యం తుగ్లఖ్‌ల హయాంలో బలహీనపడుతూ వస్తోంది. తైమూర్ దాడికి నిలవలేక తుగ్లఖ్ రాజు ఢిల్లీ వదలి పారిపోయాడు. ఈ ప్రాంతాన్ని కొల్లగొట్టి సంపదలను తమతో పట్టుకుపోడానికే తైమూర్ వచ్చాడు. దాంతో ఢిల్లీ కేంద్రంలో అధికార శూన్యత ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన ప్రాంతీయ పాలకులు, రాజ ప్రతినిధులు స్వతంత్రత ప్రకటించుకుని ఎక్కడికక్కడ తమ రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా దక్కను ప్రాంతంలో, బెంగాల్ ప్రాంతంలో, పశ్చిమాన సింద్, ముల్తాన్ లలో, గుజరాత్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలలో, రాజస్తాన్‌లో స్వతంత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి.

### 1. ఈశాన్య భారతం - బెంగాల్, అస్సాం, ఒరిస్సా

ఢిల్లీకి భౌతికంగా దూరంగా ఈ ప్రాంతం ఉండడం, వాతావరణం భిన్నంగా ఉండడం, ఈ ప్రాంతపు నదుల మార్గాల ద్వారా రవాణా, జనసంచారం ఎక్కువగా జరుగుతూవుండడం - ఇవి ఈ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు. వీటిగురించి ఢిల్లీ సుల్తానులకు పూర్తి అవగాహన లేదు. దానికి తోడు ఇతర ప్రాంతాల్లో తలెత్తే తిరుగుబాట్లు కూడా ఢిల్లీ సుల్తానుల దృష్టిని ఈశాన్య భారతం వైపు ఎక్కువగా పెట్టడానికి అవకాశం ఇవ్వలేదు. 1338లోనే బెంగాల్ ఢిల్లీ పెత్తనం నుండి విడిపోయి స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకుంది. షంషుద్దీన్ ఇల్యాన్ ఖాన్ అనేవాడు ఈ ప్రాంతపు సుల్తానుగా వ్యవహరించాడు. ఈ స్వతంత్రతను సహించని ఢిల్లీ ప్రభువులు రెండు దఫాలు బెంగాల్ మీద యుద్ధానికి తరలి వచ్చినా, వారికి లొంగలేదు. చివరికి ఢిల్లీ ప్రభుత్వం బెంగాల్‌తో సంధి ఒప్పందం చేసుకోవలసివచ్చింది.


ఒకసారి ఢిల్లీ నుండి ముప్పు వెనక్కి పోయాక ఇల్యాన్‌ఖాన్ తన రాజ్యాన్ని కామరూప్ (అస్సాం) వరకూ విస్తరించాడు. ఆ తర్వాత 200 ఏళ్ళవరకూ ఢిల్లీ ప్రభువులు బెంగాల్ జోలికి పోలేదు. ఇల్యాన్ షా వంశంలో పేరు పొందిన పాలకుడు గియాసుద్దీన్ ఆజం షా. ఇతడు 1389 నుండి 1409 వరకూ పాలించాడు. ప్రజలందరికీ న్యాయబద్ధమైన పాలనను అందించాలని ప్రయత్నించాడు. తన ఆస్థానంలో మేధావులను, కవులను ఆదరించి వారితో సంబంధాలు నెలకొల్పుకున్నాడు. పర్షియా, చైనాలతో దౌత్య సంబంధాలు ఉండేవి. బెంగాల్ నుండి బౌద్ధమత ప్రచారకులను చైనా పంపాడు. అంటే క్రీ.శ.14, 15 శతాబ్దాలనాటికి కూడా బౌద్ధమతం ఇంకా ఆ ప్రాంతంలో ఉనికిలో కొనసాగినట్టు నిర్ధారించవచ్చు. చైనాతో నిర్వహించిన వ్యాపారానికి చిట్టగాంగ్ రేవు కేంద్రంగా ఉండేది.

ఈ సుల్తానుల కాలంలో అన్ని మతాలకూ ఆదరణ కొనసాగింది. బెంగాలీ భాషను బాగా ప్రోత్సహించారు. అల్లావుద్దీన్ హుస్సేన్ సుల్తానుగా ఉన్న కాలంలో (1493–1519) హిందువులకు ఉన్నత పదవులు కట్టబెట్టారు. ప్రధాన వైద్యుడు, ప్రధాన రక్షణాధికారి, ముద్రణాధిపతి పదవులను హిందువులే నిర్వహించారు. రూపా, సనాతన్ అనే ఇద్దరు వైష్ణవ బోధకులు కూడా ఉన్నత పదవులు చేపట్టారు. ప్రఖ్యాత వైష్ణవ భక్తి ఉద్యమ గురువు చైతన్యుడి పట్ల సుల్తాను చాలా గౌరవ భావంతో వ్యవహరించాడు. సుల్తాను వ్యక్తిగత కార్యదర్శి కూడా హిందువే.

**అహోం రాజ్యం:** బ్రహ్మపుత్రా లోయ ప్రాంతానికి ఉత్తర బర్మా వైపు నుంచి వచ్చిన అహోంలు అనే ఒక మంగోలియన్ తెగకు చెందినవారు ఆ ప్రాంతంలో 13వ శతాబ్దంలో ఒక బలమైన రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. క్రమంగా వారు హిందూ మతాన్ని అనుసరించడం ప్రారంభించారు. అస్సాంకు వారివల్లే ఆ పేరు వచ్చింది. పశ్చిమాన కమతా, ఈశాన్యంలో అహోం రాజ్యాలు బలంగా ఉండేవి. బెంగాల్ పాలకులు కమతా రాజ్యంతో (దానినే కామరూప్‌లని కూడా పిలుస్తారు) చాలా కాలం పాటు వైరాన్ని పాటించారు. ఆ కమతా పాలకులు అటు అహోంతో కూడా యుద్ధాలకు దిగి రెండు వైపులా శత్రువులను పెంచుకుని బలహీనపడ్డారు. అల్లావుద్దీన్ హుస్సేన్ కమతాపూర్‌ను ధ్వంసం చేసి ఆ ప్రాంతాన్ని బెంగాల్ రాజ్యంలో విలీనం చేసుకున్నాడు. ఆ తర్వాత అహోం మీద యుద్ధానికి దిగి తీవ్రంగా నష్టపోయాడు. సుల్తాన్ సేనలను ప్రతిఘటించిన అహోం పాలకుడు సుహుంగ్ ముంగ్. ఈ వైరం అతడిని హిందూ మతం వైపు మరింత దగ్గర చేసింది. అతడు తన పేరును స్వర్గ నారాయణ అని మార్చుకున్నాడు. ఆ ప్రాంతంలో వైష్ణవ మత వ్యాప్తిని ప్రోత్సహించాడు. అస్సాం రాజ్యాన్ని అన్నివైపులా విస్తరింపజేశాడు.

**ఒరిస్సా** ప్రాంతాన్ని ఆ కాలంలో గాంగులు పాలించేవారు. బెంగాల్ సుల్తానులు ఆ ప్రాంతం మీద దాడులకు పూనుకుని చాలా సంపదను కొల్లగొట్టారు. ఆ దాడుల ఫలితంగా గాంగుల ఆధిపత్యం బలహీనపడింది. ఆ తర్వాత గజపతులు ఒరిస్సాలో బలంగా ఆవిర్భవించారు. తమ రాజ్యాన్ని దక్షిణ దిశగా దాదాపు కర్నాటక వరకూ ఒక దశలో విస్తరించారు. ఇటు ఉత్తరాన బెంగాల్ సుల్తానులతో, అటు దక్షిణాన బహమనీ

“ఢిల్లీ సుల్తానుల పాలనలో ఉన్న కాలంలో గుజరాత్ అత్యంత సంపన్నమైన రాష్ట్రంగా ఉండేది. చేతివృత్తుల నైపుణ్యం, ఓడరేవుల ద్వారా వాణిజ్యం, సారవంతమైన నేలలు ఇందుకు కారణం. ఢిల్లీని తైమూర్ లంగ్ ఆక్రమించుకునే వరకూ గుజరాత్ ప్రాంత పాలకులు ఢిల్లీ సుల్తానులకు విధేయులుగానే ఉండేవారు. 1407లో గుజరాత్, మాళ్వ రాజ్యాలు స్వతంత్రాన్ని ప్రకటించాయి.”




15వ శతాబ్దం నాటికి ప్రధాన ప్రాంతీయ రాజ్యాలు –మ్యాప్

సుల్తానులతో వైరం ఏర్పడింది. ఈ రెండు వైపులా ఏకకాలంలో యుద్ధాలు చేయగలి గారంటే గజపతుల సైనిక పాటవం ఎంత బలమైనదో అర్థమౌతుంది. ఐతే బెంగాల్ భూభాగాల్లోకి గజపతులు చొచ్చుకుపోవడం సాధ్యం కాలేదు. అదేవిధంగా దక్షిణాన ఆక్రమించుకున్న భూభాగాలను కూడా తమ ఆధిపత్యంలో నిలుపుకోవడం అసాధ్యమైపో యింది. అటు మిద్నాపూర్, ఇటు ఇచ్ఛాపురం మధ్య భూభాగం మీద మాత్రం వారు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోగలిగారు.

## 2. పశ్చిమ భారతం–గుజరాత్, మాళ్వ, మేవార్ రాజ్యాలు

**గుజరాత్:** ఢిల్లీ సుల్తానుల పాలనలో ఉన్న కాలంలో గుజరాత్ అత్యంత సంపన్నమైన రాష్ట్రంగా ఉండేది. చేతివృత్తుల నైపుణ్యం, ఓడరేవుల ద్వారా వాణిజ్యం, సారవంతమైన నేలలు ఇందుకు కారణం. ఢిల్లీని తైమూర్ లంగ్ ఆక్రమించుకునేవరకూ గుజరాత్ ప్రాంత పాలకులు ఢిల్లీ సుల్తానులకు విధేయులుగానే ఉండేవారు. 1407లో గుజరాత్, మాళ్వ రాజ్యాలు స్వతంత్రాన్ని ప్రకటించాయి.

అహ్మద్ షా–1 (1411–43) గుజరాత్ రాజ్య వ్యవస్థాపకుడు అని చెప్పాలి. అతడి కాలంలోనే అహమ్మదాబాద్ నగరం నిర్మించబడింది. అతడు పరిపాలనను ఒక క్రమపద్ధతిలో పెట్టాడు. ఎన్నో భవంతులను, బజార్లను నిర్మించాడు. మసీదులను, మదర్సాలను కూడా నిర్మించాడు. నిర్మాణంలో జైనుల శైలినుండి పద్ధతులను స్వీకరించి నూతన శైలిని ప్రవేశపెట్టాడు. అహ్మదాబాద్ లో జామా మసీదు, తీన్ దర్వాజా వంటి నిర్మాణాలు ఈ శైలికి అద్దం పడతాయి.

గుజరాత్ నుండి సౌరాష్ట్ర ప్రాంతానికి, రాజస్తాన్ ప్రాంతం వైపు విస్తరించడానికి ప్రయత్నించాడు. తన దాడుల్లో పలు దేవాల యాలను ధ్వంసం చేశాడు. హిందువులపై జిజియా పన్ను విధించాడు. అదే సమయంలో తన ప్రభుత్వంలో మాణిక్ చంద్, మోతీ చంద్ వంటి హిందూ వైశ్యులను మంత్రులుగా చేర్చుకున్నాడు. హత్యకు పాల్పడ్డ తన స్వంత అల్లుడిని నడిబజారులో ఉరి తీయించాడు. మాళ్వను పాలించిన ముస్లిం రాజులతో బద్ధవైరాన్ని పాటించాడు. మాళ్వ, గుజరాత్ రాజ్యాల నడుమ దీర్ఘకాలం కొనసాగిన బద్ధ వైరం రెండు రాజ్యాలనూ బలహీన పరచింది.

అహ్మద్ షా తర్వాత ప్రముఖుడు మహమూద్ బేగర్హా. ఇతడు 1459 నుండి 1511 వరకూ 52 సంవత్సరాలపాటు పాలించాడు. సౌరాష్ట్ర ప్రాంతానికి కీలకమైన గిర్నార్ కోటను ఆక్రమించుకున్నాడు. దానికి సమీపంలో ముస్తాఫాబాద్ అన్న నగరాన్ని నిర్మించాడు. ముస్తాఫాబాద్ గుజరాత్‌కు రెండవ రాజధానిగా అభివృద్ధి చెందింది. అనంతరం ద్వారకా పట్టణాన్ని ముట్టడించి ధ్వంసం చేశాడు. ఆ తర్వాత చంపానేర్ కోటను స్వాధీనం చేసుకుని దానికి సమీపంలో మహమ్మదాబాద్ అనే కొత్త పట్టణాన్ని నిర్మించాడు. చంపానేర్ లోని జామా మసీద్ నేటికీ పర్యాటకులను ఆకట్టుకునేంత గొప్పగా, విశిష్టమైన నిర్మాణ శైలితో ఉంది.

మహమూద్ దీర్ఘకాలం పాలనలో వ్యాపారం, రవాణా అభివృద్ధి చెందాయి. తన ఆస్థానంలో విద్యావంతులను, మేధావులను చేర్చుకున్నాడు. సంస్కృతంలో రచనలు చేసిన ఉదయరాజు అనే కవి ప్రధానకవిగా ఉండే వాడు. మహమూద్ కాలంలో గుజరాత్ శక్తివంతమైన పాలన కలిగిన రాజ్యంగా అభివృద్ధి చెందింది.


**మాళ్వ, మేవార్ : మాళ్వ:** నర్మద, తపతి నదుల మధ్య ఎత్తైన పీఠభూమిపై మాళ్వ రాజ్యం

ఉండేది. భౌగోళికంగా ఇది కీలకమైన ప్రాంతం. అటు గుజరాత్ నుండి, ఇటు దక్షిణం నుండి ఉత్తర భారతానికి వెళ్ళే ప్రధాన దారులన్నింటినీ మాళ్వ నియంత్రించేది. అందుచేత మాళ్వ మీద పట్టు సాధించడం అనేది ఉత్తరభారతం మీద ఆధిపత్యం నెరపడానికి కీలకంగా మారింది.

మాళ్వను తొలినాళ్ళలో పాలించిన హొషంగ్ షా పరమత సహనాన్ని పాటించాడు. జైనులను, రాజపుత్రులను పెద్ద సంఖ్యలో అధికారులుగా నియమించాడు. మాళ్వను పాలించినవారిలో సమర్థుడిగా పేరు గాంచినవాడు మహమూద్ ఖిల్జీ (1436–69) ఇతడి హయాంలో మేవార్‌తో, ఇతర పొరుగు రాజ్యాలతో వైరాన్ని పెట్టుకున్నాడు. తన పాలనాకాలమంతా గుజరాత్, గోండ్వానా, ఒరిస్సా, బహమనీ రాజ్యాలతోను, చివరికి డిల్లీ సుల్తానుతో కూడా యుద్ధాలు చేస్తూనేవచ్చాడు.

> “మాళ్వను తొలినాళ్ళలో పాలించిన హొషంగ్ షా పరమత సహనాన్ని పాటించాడు. జైనులను, రాజపుత్రులను పెద్ద సంఖ్యలో అధికారులుగా నియమించాడు. మాళ్వను పాలించినవారిలో సమర్థుడిగా పేరు గాంచినవాడు మహమూద్ ఖిల్జీ (1436-69) ఇతడి హయాంలో మేవార్‌తో, ఇతర పొరుగు రాజ్యాలతో వైరాన్ని పెట్టుకున్నాడు. తన పాలనాకాలమంతా గుజరాత్, గోండ్వానా, ఒరిస్సా, బహమనీ రాజ్యాలతోను, చివరికి డిల్లీ సుల్తానుతో కూడా యుద్ధాలు చేస్తూనేవచ్చాడు.”

**మేవార్** రాజ్యం ఒక ప్రబలమైన శక్తిగా ఎదిగినది రాణా కుంభ పాలనలో. 1433–68 మధ్య కాలంలో రాణా కుంభ అధికారాన్ని నెరపాడు. అంతర్గత శత్రువులను అణచివేసిన అనంతరం మేవార్‌ను ఒక బలమైన రాజ్యంగా నిలబెట్టడానికి రాణా కుంభ పలు యుద్ధాలను చేశాడు. మాళ్వ, గుజరాత్ పాలకులతోబాటు మార్వార్‌కు చెందిన రాథోడ్‌లతో కూడా యుద్ధాలు చేశాడు.



Chittorgarh — Kirti Stambha can be seen at top right

మేవార్ రాజు రాణా కుంభ నిర్మించిన చితోర్‌గఢ్ లోని ప్రసిద్ధ కీర్తి స్తంభం

తన ఆస్థానంలో మేధావులను రాణా కుంభ పోషించాడు. అతడు ఎన్నో గ్రంథాలను కూడా రచించాడు. చిత్తోర్‌గఢ్‌లో అతడు నిర్మించిన కీర్తి స్తంభం, రాజభవనాలు, సాగునీటికోసం నిర్మించిన కాలువలు, జలాశయాలు, ఆలయాలు ఆ రాజ్యపు నిర్మాణ కౌశలాన్ని సూచిస్తాయి.

రాణా కుంభ స్వంత కుమారుడే అతడిని అధికారం కోసం హత్య చేశాడు, దాంతో మేవార్‌లో అస్థిరత నెలకొంది. మళ్ళీ రాణా కుంభ మనవడు రాణా సంఘా 1511లో గద్దె నెక్కాక స్థిరత్వాన్ని సాధించాడు. డిల్లీ నుండి దాడికి వచ్చిన లోధీ సైన్యాలను సైతం తిప్పికొట్టాడు.

### 3. ఉత్తర భారతం, వాయవ్య భారతం

**షర్కీలు:** తైమూర్ దండయాత్రతో డిల్లీ నుండి సుల్తాన్ మహమ్మద్ తుగ్లఖ్ పారిపోయాడు. గంగా లోయ ప్రాంతంలో డిల్లీకి సామంతుడిగా వ్యవహరించిన వాడు మాలిక్ సర్వర్, అతడు మాలిక్–ఉస్–షర్క్ (ఈశాన్యప్రాంత అధిపతి) గా పేరు పొందాడు. అతడు డిల్లీ పతనంతో తనను స్వతంత్రుడిగా ప్రకటించుకున్నాడు. అతడి బిరుదును బట్టి వారసులు షర్కీలుగా పిలవబడ్డారు. జౌన్‌పూర్ రాజధానిగా షర్కీలు పాలన నడిపారు. దాదాపు వంద సంవత్సరాలపాటు షర్కీల పాలన సాగింది. వారి రాజ్యం ఆలీఘడ్ నుండి ఉత్తర బీహార్‌లోని దర్భంగా వరకు, నేపాల్ సరిహద్దు నుండి బుందేల్‌ఖండ్ వరకు విస్తరించివుండేది. వినూత్న శైలి నిర్మాణాలతో, సాహిత్య, కళా పోషణతో జౌన్‌పూర్ విలసిల్లింది. పద్మావత్ వంటి మహా కావ్యాన్ని హిందీలో రచించిన మాలిక్ మహమ్మద్ జైసి జైన్‌పూర్‌లో నివసించాడు.

డిల్లీలో లోధీలు అధికారాన్ని చేపట్టాక 1484లో బహలుల్ లోధీ జౌన్‌పూర్‌ను ఆక్రమించుకుని షర్కీ రాజ్యాన్ని తిరిగి డిల్లీలో విలీనం చేశాడు.

**లోధీలు:** తైమూరు దండయాత్ర తర్వాత స్వల్పకాలం పాటు సయీద్ వంశం అధికారంలోకి వచ్చింది. మాళ్వ నుండి ముప్పును నివారించడం కోసం డిల్లీ పాలకుడు పంజాబ్‌లో అప్పటికే నియంత్రణ సాధించిన బహలుల్‌ను తనకు సహాయంగా రావాలని కోరాడు. అలా వచ్చిన బహలుల్ డిల్లీని తన ఆధీనంలోకి తీసుకుని 1451లో తనను డిల్లీ పాలకుడిగా ప్రకటించుకున్నాడు.

అంతవరకూ డిల్లీని పాలించిన సుల్తానులు తురుష్కులు. ఇప్పుడు అధికారం చేపట్టిన లోధీలు ఆఫ్ఘన్ తెగలకు చెందినవారు. బహలుల్ ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో యోధులను చేర్చుకుని తన సైన్యం బలాన్ని పెంచుకుని ఆ బలంతో షర్కీలను ఓడించాడు. ఆఫ్ఘన్ల రాకతో భారతదేశంలోని ముస్లిం సమాజం సవరూపంలో కూడా చాలా మార్పులు చోటు చేసుకున్నాయి.

1489–1517 మధ్య కాలంలో పాలించిన సికందర్ లోధీ ప్రముఖుడైన పాలకుడు. శాంతి భద్రతలను నెలకొల్పి న్యాయబద్ధమైన పాలనను కొనసాగించాడు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాడు. వ్యవసాయం అభివృద్ధికి తోడ్పడ్డాడు. ఐతే మత ఛాందసవాదిగా ఇతడిని పరిగణిస్తారు.

అరేబియా, ఇరాన్ ప్రాంతాలనుండి ఇతడి ఆస్థానానికి ఎందరో విద్యావంతులు వచ్చారు. ఎన్నో సంస్కృత గ్రంథాలను పార్శీ

> **"మంగోలుల దాడుల తర్వాత కాశ్మీర్ రాజ్యాన్ని జైనుల్ అబిదిన్ (1420-1470) పాలించాడు. మధ్య ఆసియా ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన సూఫీ మత ప్రబోధకులు ఇస్లాం, హిందూ మతాల సారాంశాన్ని మిళితంచేసి చేసిన బోధనలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. అంతకు ముందు పాలకులు హిందువులపై మతం మార్చుకోవాలని తెచ్చిన వత్తిడులను, ఆదేశాలను జైనుల్ అబిదిన్ రద్దు చేయించాడు. కాశ్మీర్ వదిలిపోయిన హిందువులను వెనక్కి రప్పించాడు. ధ్వంసమైన దేవాలయాలను పునరుద్ధరించాడు."**

భాషలోకి వారు అనువదించారు. పార్శీ భాషను నేర్చుకున్న హిందువులు అతడి కొలువులో కీలక బాధ్యతలు చేపట్టారు.

తన రాజ్యాన్ని గ్వాలియర్ వరకూ విస్తరించిన సికందర్ లోధీ ఆగ్రా నగరాన్ని నిర్మించాడు. అది లోధీ పాలకులకు రెండవ రాజధానిగా మారింది. సికందర్ లోధీ, అతడి వారసుడు ఇబ్రహీం లోధీ మాళ్వ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని పలు ప్రయత్నాలు చేశారు. ఆ ప్రాంతం ఘర్షణలకు నిలయంగా మారింది. మొగలులు ప్రవేశించేవరకూ ఇదే పరిస్థితి కొనసాగింది.

**కాశ్మీర్:** కాశ్మీర్ లోయ ఇతర ప్రాంతాలవారికి దూరంగా కొనసాగింది. అది గొప్ప శైవ కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఐతే మంగోలు తెగల దండయాత్రలను నిరోధించడంలో హిందూ పాలకులు విఫలం కావడంతో 14వ శతాబ్దం మధ్య కాలంలో ప్రజాభిమానాన్ని, మద్దత్తును కోల్పోయింది.

మంగోలుల దాడుల తర్వాత కాశ్మీర్ రాజ్యాన్ని జైనుల్ అబిదిన్ (1420-1470) పాలించాడు. మధ్య ఆసియా ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో సూఫీ మత ప్రబోధకులు బారాముల్లా ద్వారా కాశ్మీర్ లోయకు వచ్చారు. ఇస్లాం, హిందూ మతాల సారాంశాన్ని మిళితం చేసి వారు చేసిన బోధనలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. అంతకు ముందు పాలకులు హిందువులపై మతం మార్చుకోవాలని తెచ్చిన వత్తిడులను, ఆదేశాలను జైనుల్ అబిదిన్ రద్దు చేయించాడు. కాశ్మీర్ లోయను వదిలిపోయిన హిందువులను వెనక్కి రప్పించాడు. ధ్వంసమైన హిందూ దేవాలయాలను పునరుద్ధరించాడు. ఆ తర్వాత వందేళ్ళనాటికి కాశ్మీర్‌లో 150 వరకూ దేవాలయాలు ఉండేవి. హిందూ సనాతనవాదులను తృప్తిపరచే కొన్ని చర్యలు సైతం తీసుకున్నాడు. గోహత్యను నిషేధించడం, సతీసహగమనం మీద నిషేధాన్ని ఎత్తివేయడం వంటివి కొన్ని ఉదాహరణలు.

జైనుల్ అబిదిన్ జమ్మూ రాజు (హిందువు) కుమార్తెలను వివాహం చేసుకున్నాడు. పార్శీ, కాశ్మీరీ, సంస్కృతం, టిబెట్ భాషల్లో అతడు పండితుడు. మహాభారతం, రాజతరంగిణి వంటి సంస్కృత గ్రంథాలు పార్శీలోకి అనువదించబడింది ఇతడి కాలంలోనే.

కాశ్మీర్‌ను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి జైనుల్ అబిదిన్ బాగా కృషి చేశాడు. పేపర్ తయారీ, బైండింగ్ కళలను నేర్చుకోడానికి సమర్ఖండ్ (ఉజ్బెకిస్తాన్-మంగోలుల ప్రాబల్యంలో ఉండేది) పంపాడు. హస్తకళలను, శిల్పకళను ప్రోత్సహించాడు. తివాచీల తయారీని బాగా ప్రోత్సహించాడు. అప్పటినుంచే కాశ్మీర్ తివాచీలు ప్రపంచ ప్రఖ్యాతి గడించాయి. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి జలాశయాలను, వంతెనలను, కాలువలను నిర్మించాడు. అతడు కాశ్మీర్‌ను ఒక సంఘటిత రాజ్యంగా అభివృద్ధి పరిచాడు. పలు దేశాలతో దౌత్య సంబంధాలను నెలకొల్పాడు.

మొత్తంగా చూసినప్పుడు ప్రాంతీయ రాజ్యాలు 14, 15 శతాబ్దాల కాలంలో ఆయా ప్రాంతాలలో అభివృద్ధి జరగడానికి తోడ్పడ్డాయి. సాంస్కృతిక స్థాయి, నిర్మాణ కౌశలం, వ్యవసాయం వంటివి పెంపొందాయి. మొత్తం మీద ఉదారవాద శక్తుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది.

**(తరువాయి వచ్చే సంచికలో)**

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

ఒప్పందం

## భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం:

# పరిగణనలోకి తీసుకోవలసిన ఐదు ముఖ్యాంశాలు

**'ది వైర్' విశ్లేషణ**

భారత్ –అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత ప్రభుత్వానికిగానీ, అమెరికా పార్లమెంటుకుగానీ ముందుగా సమాచారం ఇవ్వకుండా అమెరికా అధ్యక్ష భవనం విడుదల చేసిన రెండు ప్రకటనలు భారత అధికారవర్గాలను ఆశ్చర్యపరిచినట్లు కనిపిస్తోంది. వీటిలో ఒకటి అమెరికా–భారత్ సంయుక్త ప్రకటన కాగా, మరొకటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు. 'రష్యన్ ఫెడరేషన్ నుండి అమెరికాకు వచ్చే ముప్పులను పరిష్కరించడం కోసం విధులను సవరించడం' (Modifying Duties to Address Threats to the United States By the Government of the Russian Federation) అనే శీర్షికతో ఉన్న ఈ ఉత్తర్వు భారత దేశాన్ని తన ఇంధన వనరుల ఎంపికల విషయంలో అమెరికా పర్యవేక్షణకు లోబరుస్తోంది.

**ఈ ఉత్తర్వులోని ముఖ్యాంశాలు**

**1. సుంకాల తగ్గింపు 'పరస్పరం' కాదు:**

ప్రస్తుతం భారత ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకం 18%గా ఉంది. అదే సమయంలో 'అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులన్నింటిపైనా, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపైనా భారతదేశం తన సుంకాలను పూర్తిగా రద్దు చేస్తుంది, లేదా తగ్గిస్తుంది' అని ఈ ఉత్తర్వులో ఉంది. ఈ జాబితాలో డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్ (డిడిజి)లు, పశువుల మేత కోసం ఉపయోగించే ఎర్ర జొన్నలు, ఇతర రకరకాల నట్స్, తాజా, ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, మద్యం తదితర ఉత్పత్తులు ఉన్నాయి. దీనిని అమలు చేయడంలో భారతదేశ బాధ్యత ఏమిటన్నది ఉత్తర్వులలో స్పష్టంగా లేనప్పటికీ, ప్రజలకు ఇంకా వెల్లడించని అనేక అమెరికా ఉత్పత్తులపై మొదటి రో నుంచే సున్నా సుంకం విధించే హామీని ప్రభుత్వం ఇచ్చినట్టే భావించాల్సి ఉంది. అదేవిధంగా, 'తాత్కాలిక ఒప్పందం విజయవంతంగా ముగిసిన పక్షంలో భారత్ నుండి వచ్చే జనరిక్ ఔషధాలు, వజ్రాలు, మాణిక్యాలు, విమాన భాగాలు వంటి ఉత్పత్తులపై 'పరస్పర సుంకాన్ని' తొలగించనున్నట్లు ఈ ఉత్తర్వులో అమెరికా పేర్కొంది. అయితే ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందు భారత ఔషధాలపై అమెరికా ఎలాంటి సుంకం విధించలేదు. కాబట్టి ఇది కొత్త 'రాయితీ' కాదని గుర్తించాలి. విమాన భాగాల విషయంలో కూడా, ట్రంప్‌కు ముందున్న కాలంలో చాలా భాగాలు ఒక అంకె లేదా పూర్తిగా సుంక రహితంగా ఉండేవి. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రస్తుతం విధిస్తున్న 18శాతం సుంకాన్ని మోడీ ప్రభుత్వం సంబరంగా ప్రకటిస్తోంది. ఇది వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్, రబ్బరు, ఆర్గానిక్ రసాయనాలు, గృహ అలంకరణ వస్తువులు, కళాకారుల ఉత్పత్తులతో పాటు, కొన్ని యంత్రాలకు వర్తిస్తుంది. అయితే దీనిని కొద్ది రోజుల క్రితం ఉన్న 50శాతం సుంకంతో పోల్చి, భారీ తగ్గింపుగా భారత ప్రభుత్వం చెబుతోంది. నిజానికి ట్రంప్‌కు ముందు వీటిలో అనేక ఉత్పత్తులపై దాదాపు సున్నా సుంకం ఉండటం గమనార్హం. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కాలంలో అణు ఒప్పందం కుదిరిన తరువాత, అమెరికా భారతదేశంపై విధించిన సగటు సుంకాలను కేవలం 2.93 శాతానికి పరిమితం చేశారు.

**2. 500 బిలియన్ డాలర్ల అమెరికా ఉత్పత్తును కొనుగోలు చేయాలి**

రాబోయే ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల విలువైన (సుమారు 46 లక్షల కోట్ల రూపాయల) అమెరికా ఇంధన ఉత్పత్తులు, విమానాలు, వాటి భాగాలు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గును కొనుగోలు చేయడానికి భారత్ అంగీకరించింది. అమెరికాతో వాణిజ్య మిగులు (Trade surplus) కలిగిన ఏకైక పెద్ద దేశం భారత్ మాత్రమే. 2024లో దాదాపుగా 45.7 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటు ఉంది. అదే సమయంలో భారత్ నుండి అమెరికాకు ఎగుమతి జరిగే ఉత్పత్తులు 87.4 బిలియన్ డాలర్లు. ఏడాదికి సుమారు 100 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ వస్తువుల కొనుగోళ్లు జరిగితే ఈ పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. అంటే మనం అమెరికాతో వాణిజ్య లోటులో పడే అవకాశం ఉంది. విదేశీ మారక నిల్వలపైనా, రూపాయి విలువపైన కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. వాణిజ్యం ద్వారా సంపాదించే విదేశీ మారకం నిల్వలు, ఫారిన్ పోర్టుఫోలియో ఇన్వెస్టిమెంట్స్ (ఎఫ్‌పిఐ), ఫారిన్ డైరక్ట్ ఇన్వెస్టిమెంట్స్ (ఎఫ్‌డిఐ)ల కంటే స్థిరమైనవిగా భావిస్తారు. అయితే, ఐటి వంటి సేవల ఎగుమతుల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**3. వ్యవసాయ ఉత్పత్తులపై ...**

అమెరికా పారిశ్రామిక వస్తువులన్నింటిపైనా, అలాగే డ్రైడ్ డిస్టిలర్స్ గ్రైన్స్ (డిడిజి)

---

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> **“‘ఇంధన భద్రతకు అనుగుణంగా వాణిజ్య ప్రయోజనాల ప్రకారం ముడి చమురు దిగుమతుల అంశాన్ని పరిశీలిస్తాం’ అని భారత ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ట్రంప్ ప్రకటనల తరువాత ఇంధన ఎంపికల విషయంలో మన దేశం మన ప్రయోజనాలకు అనుగుణంగా సొంత నిర్ణయం తీసుకోగలదు అన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అనే మాట కూడా సందేహాస్పదంగా మారింది.”**



ఎర్ర జొన్న, సీడ్స్, ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, మద్యం వంటి విస్తృత వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను రద్దు చేయడానికి లేదా తగ్గించడానికి భారత్ అంగీకరించింది. అదే సమయంలో అమెరికా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న ‘సుంకేతర అడ్డంకులు’ను తొలగించేందుకు కూడా ఒప్పుకుంది. ఇది సున్నితమైన అంశం. వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పార్లమెంటులో మాట్లాడుతూ, భారత రైతులకు నష్టం కలగదని అన్నారు. అమెరికాకు మార్కెట్లను పూర్తిగా తెరవలేదని, ప్రధాన పంటలు, ఆహార ధాన్యాలు, నట్స్, పండ్లు, పాలు ఉత్పత్తులు రక్షితంగా ఉన్నాయని చెప్పారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కూడా రాజ్యసభలో, ఎరువులు, వ్యవసాయం వంటి సున్నిత రంగాలను ప్రభుత్వం కాపాడిందని చెప్పారు. అయితే, అమెరికా అధ్యక్ష భవనం విడుదల చేసిన సంయుక్త ప్రకటన ప్రకారం మన మార్కెట్ ద్వారాలు పూర్తిగా తెరుచుకున్నాయి. వీటికి సంబంధించిన సూక్ష్మ వివరాలు ఇంకా రావాల్సి ఉంది.

**4. భారత ఇంధన ఎంపికలపై ట్రంప్ పర్యవేక్షణ:**

అమెరికా అధ్యక్ష భవనం జారీ చేసిన జంట ప్రకటనల్లో అత్యంత కీలకమైన అంశం రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ అమెరికా ‘పర్యవేక్షణ’కు లోబడి ఉండాలి అన్న నిబంధన, భారత్ రష్యా నుండి చమురు కొనుగోళ్లు ‘మళ్లీ ప్రారంభిస్తే’ 25శాతం సుంకాన్ని తిరిగి విధిస్తామని హెచ్చరిక. నిజానికి రష్యా నుండి చమురు కొనుగోళ్లను భారత దేశం 2022 సంవత్సరం నుంచి పెంచింది. అప్పటి నుండి ఇంధన సార్వభౌమత్వం గురించి పదేపదే మాట్లాడింది. అయితే తాజాగా ట్రంప్ పేర్కొన్న ‘పర్యవేక్షణ’ ఆ సార్వభౌమత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటీవల వెనిజులా అధ్యక్షుడు మదురో అపహరణ అనంతరం చేసిన ప్రకటనలో వెనిజులాపై అమెరికా నియంత్రణ ఏర్పడిందనీ, వెనిజులా నుండి చమురు కొనుగోలు చేయడానికి భారత్ అంగీకరించిందని పేర్కొన్నారు. అయితే 2019లోనే ఇరాన్, వెనిజులాల నుండి అమెరికా ఆంక్షల కారణంగా చమురు కొనుగోళ్లను మనదేశం నిలిపివేసిందంటూ విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. ‘ఇంధన భద్రతకు అనుగుణంగా వాణిజ్య ప్రయోజనాల ప్రకారం ముడి చమురు దిగుమతుల అంశాన్ని పరిశీలిస్తాం’ అని భారత ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ట్రంప్ ప్రకటనల తరువాత ఇంధన ఎంపికల విషయంలో మన దేశం మన ప్రయోజనాలకు అనుగుణంగా సొంత నిర్ణయం తీసుకోగలదు అన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అనే మాట కూడా సందేహాస్పదంగా మారింది.

**5. అమెరికా ప్రభుత్వ ముందంజ:**

ఈ సంయుక్త ప్రకటనను వెల్లడించిన తీరు చూస్తే, ప్రజలకు సమాచారం ఇవ్వడంలో భారత్ వెనుకబడినట్టు అనిపిస్తోంది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకారం, సంయుక్త ప్రకటనను ‘నాలుగు లేదా ఐదు రోజుల్లో’ ఖరారు చేస్తామని అమెరికా ప్రకటించింది. అయితే వైట్ హౌస్ ముందుగానే ప్రకటన విడుదల చేసింది. దీంతో ‘సంయుక్త’ ప్రకటన ఎప్పుడు ఖరారవుతుందో కూడా భారతదేశానికి తెలియదా? అనే ప్రశ్న తలెత్తింది.

**(అనువాదం: పొగడ దొరువు)**


**చదవండి! చదివించండి!!**

# Marxist

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక**

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

# మతం సాంస్కృతిక ఆయుధంగా ఎలా మారింది?

పురుషోత్తం



రచయిత పాట్నా కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టు. మత చరిత్ర గతితర్కం మీద త్వరలో ఒక పుస్తకం వెలువరించనున్నారు

కుటుంబం, వివాహం, కులం రాజకీయాలవలె మతం కూడా మానవ సమాజ ఉపరితల అంశమే. దుర్ఖీమ్, మలినోవ్స్కీ, బ్రౌన్ తదితర ఆధునిక పండితులు మతాన్ని సామాజిక నియంత్రణా సాధనంగా పరిగణిస్తుంటే వీబర్ మాత్రం ప్రొటెస్టెంట్ మత నియమాలు పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావానికి దోహదం చేసాయని భావించాడు. ఆగస్ట్ కామ్టే మాత్రం ఈ అవగాహనలకు విరుద్ధంగా మతాన్ని శాస్త్రీయ ఆలోచనకు తావు ఇవ్వని అధిభౌతిక అంశంగా పరిగణించాడు. మత విశ్వాసులు మాత్రం ఇహలోక విషయాను పక్కనపెట్టి పరలోక సౌఖ్యాల ప్రాప్తి కోసం ఆందోళన పడుతున్నారు.

అయితే ఈ నిర్వచనాలు మతం యొక్క చారిత్రక గతితర్కాన్ని ఏ మేరకు వివరించగలుగుతున్నాయి అనే ప్రశ్న మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోయింది. సమీప గతం వరకు సకల కార్యకలాపాలను మతం అనే ప్రమాణంతో అంచనా వేయడం కొనసాగింది. అయితే ఇటీవలి కాలంలో మతానికి ఉండే సామాజిక ప్రాముఖ్యతను ప్రశ్నించసాగారు. వ్యవహారం ఈ రకంగా తిరగబడడానికి కారణం ఏమిటి? మతం కేవలం ఆచారం స్థాయికి కుదించుకుపోయిందా?

'ఆహారం, నిద్ర, భయం, మైధునాలు అనేవి మానవాళికి, జంతుజాలానికి సమాన ఫాయిదాలో ఉండేవే. మతం ఒక్కటే ఈ రెండింటి మధ్య తేడాను స్పష్టం చేస్తుంది' అని వెయ్యి సంవత్సరాల క్రితం నాటి 'హితోపదేశం' వివరిస్తుంది. జంతు సహజాతాలు సంపూర్ణమైన విజ్ఞానంగా మారిన తీరు గురించి పాశుపతశైవులు అభివర్ణిస్తారు.

70,000 ఏళ్ళ క్రితం నాటి జ్ఞాన విప్లవం మూలంగా మానవులు సామాజిక కార్యకలాపాలు చేపట్టారని పరిశోధనలు సూచిస్తున్నాయి. సమాజం అనేది ఊహాజనిత వాస్తవాల మీద ఆధారపడి ఉంటుందని ఆధునిక చరిత్రకారుడు యువల్ నోవా హరారీ అభివర్ణిస్తాడు. జాతి, డబ్బు, దేవదేవుళ్ళను మానవ సమూహాలు సమిష్టిగా నిజం అని భావిస్తాయి. ఆదాము-అవ్వ, మనువు-శతరూప వంటి కథనాలను మానవులు పరస్పర విశ్వాసాల పంపిణీ ఆధారంగా రూపొందించుకుంటారు.

చైతన్యం ద్వారా ఈ విశ్వసృష్టికి సంబంధించిన తాత్విక వ్యవస్థలను మతపరమైన భావధార అభివృద్ధి చేసింది. తదనంతర కాలంలో వీటిని పురాణాలుగా చలామణిలోకి తీసుకువచ్చారు. యజ్ఞాలు, పూజలు వంటి ఆచారాలను అభివృద్ధి చేసి సమాజంలోకి చొప్పించారు. ప్రపంచాన్ని నియంత్రించడానికి విలువల వ్యవస్థ ఆవిర్భవించింది. నియమాలు, ఆచారాలు, నైతిక విలువలు వంటివి ఆ వ్యవస్థలో భాగంగా ఏర్పడ్డాయి.

అంటే మతానికి ఐదు పార్శ్వాలు ఉన్నాయని మనం చెప్పుకోవచ్చు - తత్వం, ఆచారం, విలువల వ్యవస్థ, ప్రతీకలు, మత నిర్మాణం.. ఈ ఐదు పార్శ్వాలూ భాష్యం చెప్పడానికి, నియంత్రణకు సౌధాలుగా మారాయి. మానవ చైతన్యాన్ని సామూహిక చైతన్యానికి, విశ్వజనీన చైతన్యానికి ముడిపెట్టేందుకు దోహదపడ్డాయి.

### మత చైతన్యం

మానవులలో తొలుత ఇతర జీవకోటి పట్ల, పూర్వీకుల పట్ల, ఈ విశ్వం పట్ల బాధ్యతతో ఎలా మెలగాలో తెలివిడి ఏర్పడింది. ఆధిపత్య భావన అభివృద్ధి చెందిన కొద్దీ ఈ బాధ్యతలు అడుగంటి పోయాయి. తదనుగుణంగా మతంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి.

భారతీయ చరిత్ర.. మతపరిణామక్రమ స్వభావాన్ని నిర్ధారిస్తుంది. క్రీ.పూ. వెయ్యి సంవత్సరాల కాలం నాడు సంభవించిన వ్యవసాయిక విప్లవం ప్రాంతీయ రాజ్యాలను, వర్ణవ్యవస్థను నెలకొల్పింది. అయితే వీటిని తృణీకరించడం ద్వారా ప్రతిఘటన కూడా తలెత్తింది. క్రీ.పూ. 500 సంవత్సరాల క్రితం మొదలయిన పట్టణీకరణ వాణిజ్య విస్తరణ, సామ్రాజ్య విస్తరణలకు దారితీసింది. తద్వారా విదేశీ దురాక్రమణలు, సాంస్కృతిక సంలీనాలు మొదలయ్యాయి.

క్రీ.శ. 4వ శతాబ్దంలో గుప్తుల కాలంలో తిరిగి ఆధిపత్య ధోరణులను నెలకొల్పేదానికి, భూస్వామ్య విధానానికి అంకురార్పణ జరిగింది. గుప్తుల అనంతర కాలంలో వివిధ కులాలు ఆవిర్భవించాయి. క్రీ.శ. 1,000వ సంవత్సరం నాటికి భూస్వామ్య విధానం విస్తరించి మొరటుగా తయారవడం ప్రారంభమయ్యింది. అప్పట్లో మతం సమాజాన్ని ప్రజాస్వామీకరించడానికి పెనుగులాడింది.

20వ శతాబ్దం తొలినాళ్ళలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి మొదలయ్యింది. 1990ల నాటికి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంగా మారి అనేక సామాజిక ఆర్థిక మార్పులకు దారితీసింది. చరిత్ర మూల మలుపులు అన్నింటా మతం అనేది ఒకవైపు ఆధిపత్యం స్థిరపడడానికీ, మరోవైపు ఆధిపత్య ధోరణులను ప్రతిఘటించేందుకు సైద్ధాంతిక భూమికను సిద్ధం చేసింది.

### మతంలో భారీ మార్పులు

మానవాళి వ్యవసాయంలో స్థిరపడిన కాలంలో తొలిసారిగా మతంలో ప్రధానమైన మార్పు సంభవించిందని పరిశోధకులు గుర్తించారు. వేలాది సంవత్సరాలుగా సంచార జీవులుగా మెలిగిన మానవాళి బహుదేవతారాధనను ఆశ్రయించింది. సృష్టికి మూలమైన అతీత శక్తి ఏదో ఉందని విశ్వసించింది. యక్షుల నిరుక్త నిఘంటువు దేవతలు అంటే దయతో కోరినది ఇచ్చువారిగా అభివర్ణించింది. వైదిక సంప్రదాయం దేవతలను పృథ్వి (కోర్కెలకు భూమిక), అంతరిక్ష (కోర్కెల యవనిక), ద్యులోక (కోర్కెలను జయించే స్థితప్రజ్ఞత) వంటి మూడు గణాలుగా వర్గీకరించింది. ప్రతి గణాన్ని తిరిగి 11

> **"వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా సర్వసంగ పరిత్యాగం ముందుకు వచ్చింది. ఈ సర్వసంగ పరిత్యాగం-కౌఛ్చిక, బౌద్ధిక, హంస, పరమ హంస వంటి నాలుగు స్థాయిలుగా వర్గీకరించ బడింది. ఈ సర్వసంగ పరిత్యాగులు ఉప నిషత్తులను ప్రతి ఘటనా సాహిత్యంగా గుదిగుచ్చారు. అతీతశక్తుల ఆరాధనకు బదులుగా 'అహం బ్రహ్మాసి'ని ఆరాధనగా ముందుకు తీసుకు వచ్చారు."**

ఉపగణాలుగా విభజించి ప్రతి ఉపగణానికి 33 మంది దేవతలను ప్రతినిధులుగా నిలిపింది. సంచార మతం అతీతశక్తులను దైవత్వంగా కొలిచి ఆరాధించింది.

మానవాళి వ్యవసాయంలో స్థిరపడ్డాక మతం అనేది అతీత శక్తులకు బదులు సంపూర్ణ జ్ఞానాన్ని (బ్రహ్మను దీనికి ప్రతినిధిగా ప్రతిష్టించి) ఆలంబనగా చేసుకున్నది. సామాజిక ఆధిపత్యం, దానికి ప్రతిఘటన రెండూ కూడా మతపరమైన కార్యకలాపాల్లో భాగంగా మారాయి. వైదిక మతం ఆధిపత్యానికి, శ్రమణ మతం ప్రతిఘటనకు ప్రతీకలుగా నిలిచాయి.

పారిశ్రామిక విప్లవం మతంలో మూడవ అతిపెద్ద మార్పుకు దోహదం చేసింది. ప్రొటెస్టెంట్ మతం లాభార్జనే ధ్యేయంగా సాగే పెట్టుబడిదారీ విధాన ఆవిర్భావానికి తోడ్పడింది. పెట్టుబడిదారీ విధానం తొలిదశలో ప్రజాస్వామిక విలువలను పాటించినా, కాలం గడిచేకొద్దీ ఈ విలువలను తుంగలో తొక్కింది. ఆధునిక మతం ఛాందసత్వానికి, అస్థిత్వ ఆధారిత వైషమ్యాలకు ఆలవాలంగా మారింది. మతం తన ఆదిమ స్వభావాన్ని, ఆచారాలను కోల్పోయింది.

### ఆధిపత్యం - ప్రతిఘటన

వ్యవసాయిక విప్లవ కాలంలో బహు దేవతారాధనకు పున:భాష్యం కల్పించడం ద్వారా సామాజిక ఆధిపత్యాన్ని నెలకొల్పారు. బ్రాహ్మణ, సూత్ర గ్రంథాలు త్రిమూర్తుల ప్రతిష్టాపన ద్వారా ఈ ఆధిపత్యం నెలకొల్పాయి. ఈ మార్పులు వర్ణవ్యవస్థ, జనపదాల (ప్రాంతీయ రాజ్యాలు) ఆవిర్భావానికి దారితీశాయి. సంచార తెగ పెద్ద, క్షేత్రపాలకుడిగా మారాడు. వివక్షాపూరిత వ్యవస్థ ప్రజలలో భేదాన్ని వ్యాప్తి చేసింది. ఈ కష్టాల కడగండ్ల నుండి పరిష్కారం కోసం తాత్విక ఆలోచనల మీద ఆధారపాటు పెరిగింది.

అయితే ఈ ఆధిపత్యాన్ని నీగ్రిటో, ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, ద్రవిడ తెగలు ప్రతిఘటించాయి. ఈ తెగలను మతైక - సాంస్కృతిక సంప్రదాయాలలో ఎలా మిళితం అయ్యాయనే దానికి వైదిక మతంలోని రుద్రుడు శివుడిగా అవతరించడమే సాక్ష్యం.

వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా సర్వసంగ పరిత్యాగం ముందుకు వచ్చింది. ఈ సర్వసంగ పరిత్యాగం-కౌఛ్చిక, బౌద్ధిక, హంస, పరమ హంస వంటి నాలుగు స్థాయిలుగా వర్గీకరించ బడింది. ఈ సర్వసంగ పరిత్యాగులు ఉప నిషత్తులను ప్రతిఘటనా సాహిత్యంగా గుదిగుచ్చారు. అతీతశక్తుల ఆరాధనకు బదులుగా 'అహం బ్రహ్మాసి'ని ఆరాధనగా ముందుకు తీసుకువచ్చారు. శంకరాచార్యులు 'బ్రహ్మ'ను సృష్టికర్తగా వర్ణించారు. అయితే ఉపనిషత్తులు నిర్వికార, నిరామయ చైతన్యాన్ని 'ఆత్మ'గా పరిగణించాయి.

వర్ణాధిపత్యం బలపడడానికి కొన్ని శతాబ్ధాలు పట్టింది. సూత్రకాలంలో వర్ణాధిపత్యం స్థిరపడింది. వైదిక సంప్రదాయాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. కేనుడు పంచమహాయజ్ఞాలు, శ్రౌత యజ్ఞాల మధ్య ఉన్న తేడాలను వివరించాడు. వర్ణవ్యవస్థ సమర్ధకులు, వ్యతిరేకుల మధ్య రాజీ కుదర్చడానికి వర్ణాశ్రమ వ్యవస్థ ప్రయత్నించింది. కొంతమంది ఇందుకు అంగీకరించారు. కానీ శ్రమణులు తిరస్కరించారు. తొలి సర్వసంగ పరిత్యాగులు 'యతు'లు అని హరిపాద చక్రవర్తి వివరిస్తాడు. రుగ్వేదంలో పేర్కొన్నట్లు ఈ 'యతు'ల మీద ఇంద్రుడు చేసిన దాడి ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే దాడి అని స్పష్టం చేశాడు.

### శ్రమణ సంప్రదాయాలు

శ్రమణ సంప్రదాయాలు ఒక వెలుగు వెలిగే నాటికి జనపదాలు అంతరించి పోయి సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. యుద్ధాలు, వాణిజ్యం విస్తరించాయి. ఈ మార్పులకు అనుగుణంగా శ్రమణులు సంప్రదాయ చట్రంలో తగిన మార్పులు చేర్పులు తీసుకువచ్చారు.

అంతిమ సత్యాన్ని అందుకోవడానికి శ్రమణులు ఆచరించే మార్గం బ్రాహ్మణ సంప్రదాయాలతో మౌలికంగా విభేదిస్తుంది. ఇహ-పర లోకాల్లో పరమ సత్యం అంటూ ఏదీ ఉండదని, మార్పు నిరంతరాయమైనదని బుద్ధుడు బోధించాడు. బయటకు కనిపించేవన్నీ వ్యక్తిత్వ లక్షణాల సమాహారమని, ఆత్మనేది ఆలోచనలు, భావోద్వేగాల ప్రవాహానికి ఆలవాలమని బౌద్ధం వివరిస్తుంది. ఈ విశ్వంలో ప్రతిదీ పరస్పరాధారితం, పరమప్రమాణం అంటూ ఏదీ ఉండదని బౌద్ధంలోని ప్రతీత్య సముత్పాద అజ్ఞానం నుండి, ముదుసలితనం నుండి బయట పడేందుకు పన్నెండు సూత్రాలను ప్రతిపాదించాడు. నిర్వాణం అనేది ముక్తికి పరమపద సోపానం అని వివరించాడు.

అలాగే జైనం కూడా అసలైన చైతన్యం అనేక రూపాల్లో ఉంటుందని, జ్ఞానం అనేది స్థల, కాలాల మీద ఆధారపడి ఉంటుందని (అనేకత్వ వాదం) ప్రతిపాదించింది. ప్రతి పదార్ధానికి స్వరూప ధర్మం ఉంటుందని, అంటే మార్పుకు అతీతమైన కొన్ని శాశ్వత లక్షణాలు కలిగి ఉంటుందనీ అలానే కొన్ని తాత్కాలిక లక్షణాలు మార్పుకు గురవుతూ ఉంటాయని 'ఆగంతుక ధర్మం - జైనం' వివరిస్తుంది. మానవుడి ఉనికిని సజీవం - అజీవం అని రెండుగా వర్గీకరించింది. మనిషి ఉనికి సంపూర్ణంగా సమగ్రత నొందడమే 'కైవల్యం' అని జైనం చెబుతుంది.

### మత పరిణామ క్రమంపై విదేశీ ప్రభావం

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 200 వ సంవత్సరాల మధ్యన పట్టణీకరణ పెరుగుదల, వాణిజ్య విస్తరణ, విదేశీ దురాక్రమణ, విదేశీ సామ్రాజ్యాల ఆవిర్భావాలతో భారత భూభాగంలో మూడవ అతిపెద్ద మూల మలుపు సంభవించింది. విదేశీ పరిపాలకులయిన ఇండో-గ్రీక్ రాజు మీనాండ్ర, కుషాణు రాజు అయిన కనిష్కుడు వంటి వారు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారు. ఈ సామ్రాజ్యాల పతనానంతరం విదేశీయులు ఇక్కడి వర్ణవ్యవస్థలో ఇమడడం సమస్యాత్మకంగా మారింది. శ్రమణ సంప్రదాయాలు ఇందుకు మెరుగ్గా తోడ్పడ్డాయి.

ఈ కాలంలోనే బౌద్ధంలో హీనయాన, మహాయానాలు అనే విభజన వచ్చింది. ఈ లోకంలోని సకల చరాచర జీవరాశులు నిర్వాణం పొందేందుకు స్వార్ధరహితంగా కృషి చెయ్యడమే మహాయానంగా ముందుకు వచ్చింది. వ్యక్తి నిర్వాణానికే పరిమితం అయిన బుద్ధుని తొలినాటి బోధనలు హీనయానంగా మిగిలిపోయాయి. మహాయానంలో

❝ బ్రాహ్మణ మతంలో కూడా శైవ, వైష్ణవ, శాక్తేయ పేరిట మూడు తెగలు ఆవిర్భవించాయి. ఐదవ శతాబ్దం నుండి తొమ్మిదవ శతాబ్దం వరకూ ఇవి అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ప్రాచీన కాలపు శివ, విష్ణు రూప గుర్తులను పున:భాష్యం కల్పించడం ద్వారా శైవ, వైష్ణవ మతాలు ఉనికిలోకి వచ్చాయి. శైవ మతం నుండి విడగొట్టుకుని శాక్తేయ మతం ఆవిర్భవించింది. ❞

విదేశీయులు అనేక సాంస్కృతిక అంశాలను జోడించారు. బౌద్ధం వలే జైనం కూడా శ్వేతంబర, దిగంబర అనే రెండు సంప్రదాయాలుగా విడిపోయింది. అయితే జైనం ప్రవచించిన పూర్తి అహింసా మార్గం మూలంగా క్రమేపీ దాని ప్రభావం తగ్గిపోయింది.

**గుప్తులశకం – మత రూపాంతరం**

గుప్తుల సామ్రాజ్య కాలంలో మత పరిణామక్రమం భారీ మార్పులకు లోనయి గుప్తుల అనంతర కాలంలో కూడా కొనసాగింది. ఈ కాలంలో పురాణాలు కీలకమైన గ్రంథాలుగా చలామణిలోకి వచ్చాయి. శూద్రుల పట్ల అత్యంత కఠినమైన నిబంధనలకు ఈ కాలంలోనే 'స్మృతు'లలో చేర్చారని అస్పృశ్యత పెచ్చరిల్లిందని పరిశోధకులు విశ్వసించారు.

బ్రాహ్మణ మతంలో కూడా శైవ, వైష్ణవ, శాక్తేయ పేరిట మూడు తెగలు ఆవిర్భవించాయి. ఐదవ శతాబ్దం నుండి తొమ్మిదవ శతాబ్దం వరకూ ఇవి అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ప్రాచీన కాలపు శివ, విష్ణు రూప గుర్తులను పున:భాష్యం కల్పించడం ద్వారా శైవ, వైష్ణవ మతాలు ఉనికిలోకి వచ్చాయి. శైవ మతం నుండి విడగొట్టుకుని శాక్తేయు మతం ఆవిర్భవించింది.

ఈ కాలంలోనే దశావతారాల సిద్ధాంతం ప్రాచుర్యంలోకి వచ్చింది. మహాయాన బౌద్ధం నుండి ప్రేరణ పొంది బ్రాహ్మణ మతంలో భక్తి సంప్రదాయం పాదుకున్నది. విష్ణు అవతారాన్ని వ్యవస్థీకృతం చేశారు. శైవ మతం కూడా అవతారాల సిద్ధాంతాన్నే ఆలంబనగా చేసుకున్నది. ఐహిక దు:ఖాల నుండి భక్తులకు విముక్తి కల్పించడానికే భగవంతుడు విష్ణు అవతారం ఎత్తాడనీ, శివుని అవతారం ఎత్తాడనీ వైష్ణవ, శైవ మతాలు బలమైన నమ్మికను ఎగదోసాయి. ముఖ్యంగా సమాజంలో అట్టడుగు వర్గాలలో ఈ నమ్మిక బలంగా పాతుకుపోయింది. వివిధ కులాచారాలు అన్నీ ఈ భక్తి సంప్రదాయ చట్రంలోకి ఒదిగిపోయాయి. కొన్ని పురాణాలు శివుడుని దేవదేవుడిగా స్తుతించి స్థిరపరిచినా వైష్ణవ, శైవ సంప్రదాయాలు రెండింటికీ రాజభోగం లభించింది. సామాజికంగా కుల వివక్షను అత్యంత దుర్మార్గంగా అమలు చేస్తూనే దేవుడి ముందు అందరూ సమానులే అనీ, ఆ దేవుడిని నిత్యం కొలవడం ద్వారా మోక్షం పొందవచ్చనీ భక్తి సిద్ధాంతం జనాన్ని నమ్మించగలిగింది.

ఈ కాలంలోనే భారత సామాజిక – సాంస్కృతిక జీవన విధానంలో గణనీయమైన మార్పులకు దారితీసిన సామాజిక ఆర్థిక మార్పులకు పునాది పడింది. పరిపాలనాధికారాలు వికేంద్రీకరించబడ్డాయి. శాతవాహనుల కాలంలో ఈ వికేంద్రీకరణ మొదలయ్యింది. ఈ కాలంలోనే పూజారులకు, ఆలయాలకు దేవుని మాన్యం కింద భూములు, పల్లెలు రాసివ్వడం ప్రారంభమయ్యింది. మౌర్యులు, గుప్తుల కాలంలో సుశిక్షిత భారీ సైన్యం ఉండేది. శాతవాహనుల కాలానికి వచ్చేసరికి భూస్వామ్య ప్రభువుల బలగాల మీద ఆధార పాటు పెరిగింది. 7, 8 శతాబ్దాలలో సైనిక అధ్యక్షులకు, క్షేత్రస్థాయి పరిశీలకులకు భూములు ఈనాం హక్కులతో ఇవ్వడంతో భూస్వామ్య సమాజం అవతరణ వేగవంతం అయ్యింది. భూస్వామ్య వర్గం కొత్తగా ఉనికిలోకి వచ్చింది.

గుప్తుల కాలంలో దూరప్రాంత వాణిజ్యం తగ్గుముఖం పట్టింది. పర్యవసానంగా మూడు, నాలుగు శతాబ్దాలలో పట్టణీకరణ తగ్గుముఖం పట్టింది. అస్పృశ్యత గతకాలం కంటే మరింత పెచ్చరిల్లింది.

గుప్తుల అనంతర కాలంలో భారత భూభాగంలో అనేక చిన్నచిన్న రాజ్యాలు అవతరించాయి. గౌడ, మౌఖారి, పుష్యభూతి, గుర్జర్–ప్రతీహార, పాళ, పల్లవ, పాండ్య, రాష్ట్రకూట, చౌహాన్, గద్వాల్ సామ్రాజ్యాలు ఇలా అవతరించినవే.

రాజకీయాధికారంలో వస్తున్న ఈ మార్పుల నడుమనే భూస్వామ్య విధానం రెండు అంచెలలో వేగంగా విస్తరించింది. ఇనాం భూముల మీద న్యాయపరమైన, పరిశీలనా పరమైన అన్నీ హక్కులు దాఖలు పడడంతో స్థానిక ప్రజానీకం మీద భూస్వాముల అధికారం మరింతగా బలపడింది. గ్రామ పాలకులే రాజ్యాంగ యంత్రంగా మారడంతో భూ యాజమాన్యం, ఆస్తుల ఆక్రమణ, నిర్బంధ చాకిరీలకు పాల్పడుతూ, రైతుల నుండి ఇష్టారాజ్యంగా కౌలు వసూళ్లు చెయ్యడం పరిపాటిగా మారింది.

ఆధిపత్య మత భావధారలో భాగంగా వైదిక కాలం నుండి రాజుని సాక్షాత్తు దేవుడిగా భావించే సంప్రదాయం చలామణిలో ఉన్నది. భూస్వామ్య విధానం బలపడడం ద్వారా రాజు భూమి మీద వెలసిన దేవుడి ప్రతినిధిగా ఒక వెలుగు వెలిగాడు. 6వ శతాబ్దంలో మొదలయిన తాంత్రిక విద్య 8వ శతాబ్దం నాటికి బాగా విస్తరించింది. మద్యం, మగువ, శృంగారం, స్మశాన నివాసం వంటి ఆచారాలు ఈ తాంత్రిక విద్యలో భాగంగా మారాయి. బౌద్ధంలో వజ్రయాన, శైవంలో కాపాలిక / కాలముఖి సంప్రదాయాల పేరిట ఈ ఆచారాలు పాటించే వారు. ఇవన్నీ ఆధిపత్యాన్ని ప్రతిఘటించే నిరసన రూపాలుగా అనేకమంది పండితులు అభివర్ణించారు.

**తాత్విక చింతనాభివృద్ధి**

ఇదే కాలంలో బ్రాహ్మణ, శ్రమణ మతాల మధ్య జరిగిన చర్చోపచర్చలలో భాగంగా సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వమీమాంస, వేదాంత అనే ఆరు తాత్విక ధోరణులు క్రమంగా రూపుదిద్దుకున్నాయి.

ఆదిశంకరాచార్యులు వేదాంతానికి అద్వైత సిద్ధాంతాన్ని జోడించారు. తదనంతర శతాబ్దాలలో వైష్ణవ తాత్విక చింతనకు అనేక పాయలు తోడయ్యాయి. మధ్వాచార్యులు (12వ శతాబ్దం) ద్వైతవాదం, నివార్కాచార్యుల (7వ శతాబ్దం) ద్వైతాద్వైతం, వల్లభాచార్యుల (15వ శతాబ్దం) శుద్ధాద్వైతం, రామానుజాచార్యుల (11వ శతాబ్దం) విశిష్టాద్వైతాలు వైష్ణవ సిద్ధాంతంలో ఉప సంప్రదాయాలుగా వెలుగులోకి వచ్చాయి. గుప్తుల కాలంలో తాత్విక చింతనలు నాటి ఆదర్శాల మీద బలమైన ప్రభావం చూపించాయి. ఇదే కాలంలో శివతత్వం కూడా వేదాంత ధోరణులను ఆలంబనగా చేసుకుని అభివృద్ధి చెందింది.

ఇదే కాలంలో బౌద్ధం కూడా అభివృద్ధి చెందింది. 4వ శతాబ్దంలో ఆర్య అసంగ్ ప్రబోధించిన విజ్ఞానవాదాన్ని (చైతన్యవాదం) వసుబంధు మరింత ముందుకు కొనిపోయాడు.

> **"బౌద్ధం, శైవమతాల మధ్యన ఐక్యత సాధించే క్రమంలో హిందూమతం ఆవిర్భవించింది. 13వ శతాబ్దానికి ముందు 'హిందూ' అనే పదం మత ఉనికికి సంబంధించినది కాదు అని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డేవిడ్ లోరెన్‌జెన్ స్పష్టం చేశాడు. విద్యాపతి రచించిన 'కీర్తిలత', 'పురుష పరీక్ష' గ్రంథాలలో తొలిసారిగా 'హిందూ' అనే పదాన్ని మతానికి ప్రతీకగా వాడారని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త హేతుకర్ ఝా ఉదహరించారు."**

నాగార్జునుడి శూన్యవాదంతో బౌద్ధమత తాత్విక ప్రయాణం ఆరంభమయింది. 9వ శతాబ్దంలో మొదలయిన సహజయాన - వజ్రాయనం ఆధిపత్య భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ నైతిక విలువలు నిర్లక్ష్యం చెయ్యడం మూలంగా ప్రజాబాహుళ్యంలో గౌరవం కోల్పోయింది. మారిన పరిస్థితులను ఆకలింపు చేసుకోలేకపోవడం మూలంగా 9-10 శతాబ్దాలలో బౌద్ధంలో ప్రతిష్ఠంభన నెలకొన్నది. పర్యవసానంగా బౌద్ధులు, శైవుల మధ్యన మతఘర్షణలు చెలరేగాయి. అనేక హింసాత్మక ఘటనలు చరిత్రలో నమోదయ్యాయి. పాళరాజుల కాలంలో ఈ ఉద్రిక్తలు మరింత ప్రస్ఫుటమయ్యాయి. బౌద్ధ దేవతామూర్తులయిన అపరాజిత, సాంబర్‌లతో పాటు స్వయానా బుద్ధ విగ్రహాలను మలిచిన తీరు ఇందుకు తార్కాణం. ఈ నేపథ్యంలో బౌద్ధం ప్రభావం క్రమేపీ పలుచబడింది.

### హిందూమతం - నూతన సంప్రదాయాల ఆవిర్భావం

బౌద్ధం, శైవ మతాల మధ్యన చెలరేగిన ఘర్షణలను సమసిపోయేలా చెయ్యడానికి 10వ శతాబ్దంలో నాద సంప్రదాయం ఆవిర్భవించింది. బౌద్ధం తరువాత భారతదేశ చరిత్రలో మొదలయిన రెండవ అతి పెద్ద మత ఉద్యమం నాద సంప్రదాయం అని ప్రముఖ చరిత్రకారుడు హజారీ ప్రసాద్ ద్వివేది అభిప్రాయపడ్డారు. బౌద్ధం, శైవమతాల మధ్యన ఐక్యత సాధించే క్రమంలో హిందూమతం ఆవిర్భవించింది. 13వ శతాబ్దానికి ముందు 'హిందూ' అనే పదం మత ఉనికికి సంబంధించినది కాదు అని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డేవిడ్ లోరెన్‌జెన్ స్పష్టం చేశాడు.

విద్యాపతి రచించిన 'కీర్తిలత', 'పురుష పరీక్ష' గ్రంథాలలో తొలిసారిగా 'హిందూ' అనే పదాన్ని మతానికి ప్రతీకగా వాడారని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త హేతుకర్ ఝా ఉదహరించారు. చాంద్రవరదాయి విరచిత 'పృథ్వీరాజ్ రానో' గ్రంథంలో కూడా 'హిందూ' పదాన్ని మతానికి ప్రతీకగా వాడారు. పురుష పరీక్షలో హిందూమత శాశ్వత నిర్మాణం కోసం మతాన్ని కులాచారం, సాధారణ ధర్మాలుగా విభజించారు. వివిధ కులాచారాలను మత సంప్రదాయాలుగా వర్గీకరించారు. నైతిక విలువలను నాలుగు పురుషార్థాలుగా విభజించి వాటిని సాధారణ ధర్మంగా పేర్కొన్నాడు. కులాచారాలు, సాధారణ ధర్మాలు అన్నీ కలిసి నిజమైన మతంగా (హిందూమతం) వెలుగొందుతుందని విద్యాపతి భావించాడు. శైవ, వైష్ణవ, శాక్త, బౌద్ధ, జైన సంప్రదాయాలన్నింటినీ ఉమ్మడిగా 'హిందూ ధర్మం'గా పేర్కొన్నారు. అంటే వివిధ మత సంప్రదాయాల సమాహారంగా హిందూ మతం ఉనికిలోకి వచ్చింది. వివిధ మత గ్రంథాలే హిందూ మత గ్రంథాలుగా పరిగణించారు. ఈ క్రమంలోనే బుద్ధుడిని విష్ణువు పునర్జీవావతారంగా అభివర్ణించారు.

### సనాతన ధర్మ మూలాలు: ఆధునిక హిందూమతం

ఇటీవలి కాలంలో హిందూమతాన్ని సనాతన ధర్మంగా ప్రచారం చేస్తున్నారు. కానీ చరిత్రలో సనాతన ధర్మం పేరిట ఎలాంటి మత ప్రసక్తి లేదు. థియోసాఫికల్ సొసైటీ వ్యవస్థాపకురాలు అనిబీసెంట్ తొలిసారిగా సనాతన ధర్మాన్ని హిందూమతానికి పర్యాయపదంగా తన రచనల్లో వాడారు. అప్పటినుండి సనాతన ధర్మం అంటూ ఒకటి ఉందని హిందువులలో భ్రమలు కల్పించే ప్రయత్నాలు కొనసాగుతూ వస్తున్నాయి. బ్రిటిష్ వలస పాలనా కాలంలో చేపట్టిన జనాభా గణనలో హిందూ సమాజంలో బౌద్ధులు, జైనులు, సిక్కులను వేర్వేరు మతాలుగా గుర్తించింది. (సిక్కు మతాన్ని వైష్ణవమతంలో ఉపతెగగా భావిస్తుంటారు)

14-15 శతాబ్దాలలో ఉత్తర భారత భూభాగంలో శ్రీ (రామావత్) సంప్రదాయం లేక రామానంద సంప్రదాయం మత ఘర్షణల నివారణకు నడుం కట్టింది. ఆ కాలంలో వైష్ణవ మతంలోని అద్వైత, ద్వైత, ద్వైతాద్వైత, శుద్ధాద్వైత, విశిష్ఠాద్వైత సంప్రదాయాలతో పాటు విష్ణావతారాన్ని కొలిచే సగుణ, నిర్గుణ సంప్రదాయాలు దేనికదే తన సంప్రదాయాధిపత్యాన్ని రుజువు చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉన్నాయి. ఈ నేపథంలో రామానందుడు విష్ణువు, శివుడు, రాముడు, కృష్ణుడు అందరూ ఆ బ్రహ్మ సృష్టే కాబట్టి వీరిలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువా కాదు, అందరూ సమానులే అన్న వాదాన్ని ముందుకు తీసుకువచ్చాడు. "జాత్ పాత్ పూఛ్చే నహీ కోయీ, హరికో భజాయె సోహరి కో హోయ్" (కులం, మతం గురించి ఎవరూ అడగరు, హరిని కొలిచే ప్రతి ఒక్కరూ హరికే చెందుతారు) అంటూ మత వైషమ్యాలను తగ్గించేదానికి కృషి చేశాడు. అంతేకాదు భూస్వామ్య క్షీణ విలువలయిన కులవివక్ష, అస్పృశ్యతలకు వ్యతిరేకంగా బలంగా ప్రచారం చేసాడు. ఉత్తరాదిన రామానందుడి బోధనలు బహుళ ప్రజాదరణ పొందాయి.

రామానుజ చార్యులు ఆరంభించిన విశిష్టాద్వైత వైష్ణవ భక్తి సంప్రదాయం నుండి రామానందుడి సంప్రదాయం ఆవిర్భవించింది. దక్షిణ భారత భూభాగంలో వేల ఏళ్ళక్రితం సాగిన ఆళ్వార్ యోగి ఉద్యమంలో శూద్రులు, మహిళలను కూడా పన్నెండు మంది మహాయోగులలో అంతర్భాగం చేసుకున్నది. కుల వివక్షను తిరస్కరించింది. రామానందుడి గురువు ఈ రకమైన కులవివక్షకు గురికావడంతో రామానందుడు శ్రీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టాడు. ప్రతిఘటనోద్యమాన్ని కొనసాగించాడు.

### ఇస్లాం - సుల్తానుల పరిపాలనా కాలం

13వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానుల పరిపాలన మొదలు కావడంతో భారతీయ సాంస్కృతిక రంగం ఇస్లామిక్ ప్రపంచంలో కాలు మోపింది. 16వ శతాబ్దంలో మొఘలులు అధికారం దక్కించుకునే వరకు భారత భూభాగంలో గులాం, ఖిల్జీ, తులుక్, సయ్యాద్‌ల పాలన కొనసాగింది. సుల్తానుల పరిపాలనా కాలంలో రాజ్యమతంగా ఇస్లాం కొనసాగింది. ప్రజల మీద ఇస్లాం మతావలంబన కోసం నిర్బంధం కూడా అక్కడక్కడా కొనసాగింది. కొంతమంది హిందువులు నిర్బంధంగా ఇస్లాం మతం స్వీకరించారు. కానీ శూద్రులు మాత్రం కుల వివక్ష పీడనను వదిలించుకోవడానికి ఇస్లాం మతాన్ని ఆశ్రయించారు. 7వ శతాబ్దం నాటికే

సింధ్ ప్రాంతంలోనూ, 9వ శతాబ్దం నాటికి ఉత్తర భారత ప్రాంతంలోనూ ఇస్లాం భావజాలం వ్యాప్తి చెందింది.

ఇస్లాం వ్యాప్తికి సూఫీ సాధువులు ఎంతగానో తోడ్పడ్డారు. షరియత్ (ఇస్లాంచట్టం)కు బదులు తారీఖత్ (ఆధ్మాత్మిక మార్గం)ను సూఫీ సాధువులు ఆలంబనగా చేసుకున్నారు. సూఫీ సాధువులు చిస్తీ, సుహ్రావర్ది, ఖద్రియా, వక్షాబందీ, రసూల్ షాపి, మదారియా వంటి సంప్రదాయాలు అనుసరిస్తూ సహనం, ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం వంటి ఉదార విలువలను ప్రచారం చేశారు. బౌద్ధం క్షీణిస్తున్న క్రమంలో ఆ మతావలంబకులు ఎక్కువమంది ఇస్లాం మతం స్వీకరించారు. సుల్తానుల పరిపాలనలో ఉలేమాలు కీలక పాత్ర పోషించారు. సికిందర్ లోడీ పరిపాలనా కాలంలో శైవ, వైష్ణవ మతస్తుల మధ్య నెలకొన్ని ఘర్షణల పూర్వ రంగంలో వైష్ణవులలో అఖాడాల పేరిట బలగాలు ఆవిర్భవించాయి.

**మొఘలుల పరిపాలన – మత విధానాలు**

16వ శతాబ్దంలో మొఘలుల పరిపాలన మొదలు కావడంతో ఇస్లాం పాలకుల దృక్పథంలో మార్పులు వచ్చాయి. మొఘలులు హిందువుల భావోద్వేగాలను గౌరవిస్తూ, వారి అభిమానాన్ని చూరగొనడానికి అనేక మత సంస్కరణలు తీసుకువచ్చారు. సంకుచిత మనస్తత్వం గల ఉలేమాలు ఈ ఉదార విలువల సంస్కరణల పట్ల విముఖత వ్యక్తం చెయ్యడంతో పాటు కొన్ని సందర్భాలలో తిరుగుబాటు చేశారు. అక్బర్ చక్రవర్తి రామానంద్ తెగవారికి నానక్ పంత్ వారికి భూములు కేటాయించడంతో పాటు ఆర్థిక సాయం కూడా అందించాడు. రామభక్తిని పెంపొందించడానికి రామ్‌లీలా ఉత్సవాలకు అనేక విధాలా ప్రోత్సాహకాలు కల్పించాడు. సీతారాముల బొమ్మలతో నాణేలు ముద్రించి పంపిణీ చేసాడు. స్వామి నరహరిదాస్, గోస్వామి తులసిదాస్‌లకు ఎంతగానో తోడ్పాటు అందించాడు.

అక్బర్ తదనంతర మొఘుల్ పరిపాలకులు, ఔరంగజేబ్ సహా, తొలుత ఈ ఉదారవాద విధానాలను కొనసాగించారు. అయితే ఔరంగజేబ్ సింహాసనం అధిష్టించిన 11 ఏళ్ళ తరువాత సంప్రదాయ ఉలేమాల ఒత్తిడికి లొంగిపోయాడు. తన సోదరుడు దారా సిక్కోకు అనుకూలంగానూ, లేదూ తన సంకుచిత విధానాలను వ్యతిరేకించిన దేవాలయాలను ఉలేమాల ప్రోద్భలంతో ధ్వంసం చేసాడు. తన విధానాలకు మద్దతుగా నిలిచిన దేవాలయాలకు తోడ్పాటు ఇచ్చాడు.

> **❝ భారతీయ సమాజంలో తొలిదశలో అత్యంత అనాగరికమైన సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతువుల పునర్వివాహంపై నిషేధం, కుల వివక్ష, అస్పృశ్యత వంటి మూఢాచారాలతో కునారిల్లుతూ ఉండేదని చరిత్ర అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చరిత్ర అధ్యయనం కూడా రెండు విధాలుగా కొనసాగింది. జర్మన్ చరిత్ర అధ్యయనవేత్త మాక్స్ ముల్లర్ ప్రాచ్యవాదాన్ని అనుసరిస్తే జేమ్స్‌మిల్, పాస్టర్ ఛార్లెస్ గ్రాంట్‌లు ఆధునిక వినిమయ వాదాన్ని అనుసరించారు. ❞**

**పారిశ్రామిక విప్లవం:**
**వలస పాలకుల భాష్యాలు**

పారిశ్రామిక విప్లవానంతరం భారత దేశ మత యవనిక మార్పులకు లోనయింది. ఆగస్ట్ కోమ్టే ప్రభావంతో పారిశ్రామిక విప్లవం తొలినాళ్లలో మతాన్ని మూఢవిశ్వాసంగా పరిగణించారు. మానవ చరిత్రలో సామాజికాభివృద్ధిని కోమ్టే మతైక, తాత్విక, సానుకూల అనే మూడు దశలుగా అభివర్ణించాడు. మానవాళి ఈ సృష్టిని ఎలాంటి శాస్త్రీయ ప్రాతిపదిక లేని అతీత శక్తుల సృష్టిగా భావించింది. తదనంతరం తాత్విక చింతన ద్వారా విశ్వాసాల నిగ్గు తేల్చుకున్నది. అంతిమంగా శాస్త్రీయంగా పరీక్షకు నిలబెట్టింది. విశ్వాసాలను శాస్త్రీయంగా పరీక్షకు నిలబెట్టడమే సరైన దృక్పథం అని కోమ్టే వాదించాడు.

భారతీయ సమాజంలో తొలిదశలో అత్యంత అనాగరికమైన సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతువుల పునర్వివాహంపై నిషేధం, కుల వివక్ష, అస్పృశ్యత వంటి మూఢాచారాలతో కునారిల్లుతూ ఉండేదని చరిత్ర అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చరిత్ర అధ్యయనం కూడా రెండు విధాలుగా కొనసాగింది. జర్మన్ చరిత్ర అధ్యయనవేత్త మాక్స్ ముల్లర్ ప్రాచ్యవాదాన్ని అనుసరిస్తే జేమ్స్‌మిల్, పాస్టర్ ఛార్లెస్ గ్రాంట్‌లు ఆధునిక వినిమయ వాదాన్ని అనుసరించారు.

ప్రాచ్యవాదం భారతదేశాన్ని ఆధ్యాత్మిక చింతనకు, తత్వవేత్తలకు నెలవయిన భూమిగా చిత్రీకరించింది తప్పితే భౌతిక పరిస్థితులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇక ఆధునిక వినిమయ వాదమేమో దేశంలోని కులవివక్ష, అస్పృశ్యత, సతీసహగమనం వంటి దురాచారాలన్నింటికీ హిందూమతమే మూలకారణం అని ఆరోపించింది. పాస్టర్ ఛార్లెస్ గ్రాంట్ భాష్యాలన్నీ దేశంలో క్రైస్తవమత వ్యాప్తికి ఉద్దేశించినవిగా కనబడతాయి. క్రీ.శ. 1వ శతాబ్దం మధ్య కాలంలోనే క్రైస్తవం భారతదేశంలో కాలూనింది. కానీ 1800 సంవత్సరాల తర్వాత బ్రిటిష్ వలస పాలన మొదలయిన తరువాత కానీ మత నడవడిక వెలుగులోకి రాలేదు.

భారతదేశంలో చోటుచేసుకున్న రెండు మత సంస్కరణ ఉద్యమాల – ఆర్య సమాజం, బ్రహ్మ సమాజం – పట్ల ఈ చరిత్రకారుల అంచనాలలో వలసవాద పక్షపాత ధోరణులు ప్రస్ఫుటమవుతాయి. హిందూ కులీన వర్గాలు బ్రిటిష్‌వారి ప్రాపకం కోసం, హిందూ మతం మీద ఉన్న దురభిప్రాయాన్ని కొంతమేరకయినా తగ్గించే ప్రయత్నంలో భాగంగా ఈ రెండు మత సంస్కరణోద్యమాలు చేపట్టారనే వాదన కూడా ఉన్నది.

రామ్ విలాస్ శర్మ రచించిన 'శాన్ శాంత వన్‌కి రాజ్యక్రాంతి' అనే పుస్తకంలో 1857 తిరుగుబాటుకు సన్నాహకంగా స్వామి దయానంద సరస్వతి చేపట్టిన కార్యకలాపాలను గురించి సవివరంగా పేర్కొన్నారు. స్వామి దయానంద సరస్వతి తన గురువు స్వామి బిర్జానంద ఆయన గురువు స్వామి పూర్ణానంద మరి ఇద్దరు మౌల్వీలతో కలిసి పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతమంతా పర్యటించి 1857 తిరుగుబాటుకు (బహదూర్‌షా జఫర్ అనే ముస్లిం పాలకుడు ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు) తగిన సన్నాహాలు చేసారని దయానంద్ వర్మ తన పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. ఈ తిరుగువాటు విఫలం కావడంతో స్వామి దయానంద సరస్వతి గో సంరక్షణ ఉద్యమాన్ని చేపట్టాడు. మత, సామాజిక సంస్కరణలు కోరుతూ 1875లో ఆర్యసమాజ ఉద్యమం ప్రారంభించాడు. బ్రిటిష్ పరిపాలనలో హిందూ కులీనులకు భాగం కల్పించే ఉద్దేశ్యంతో ముస్లిం వ్యతిరేక ప్రచారం కూడా శ్రుతిమించి చేపట్టాడు. వేదాలు మాత్రమే ఆధ్యాత్మిక గ్రంథాలుగా అభివర్ణిస్తూ ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం,

> **❝దయానంద సరస్వతి కన్నా చాలా దశాబ్దాలకు ముందుగానే రాజా రామ్మోహన్ రాయ్ సంఘ సంస్కరణోద్యమానికి శ్రీకారం చుట్టాడు. బహు దేవతారాధన, విగ్రహారాధనలను రాయ్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఏకేశ్వర వాదాన్ని ప్రచారం చేసాడు. 1815లో 'ఆత్మీయ సభ' పేరిట ప్రారంభించిన సంస్థ ను 1828 లో బ్రహ్మ సమాజంగా మార్చాడు. సతీసహగమనం, బాల్యవివాహాలు, పరదా వంటి అనాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసాడు. దీనివల్ల1872లో ప్రత్యేక వివాహ చట్టం వచ్చింది.❞**

శాక్తేయమతాలన్నింటినీ దయానంద సరస్వతి తీవ్రంగా విమర్శించాడు.

1857 తిరుగుబాటుకు ముందు హిందూ ముస్లిం కులీనులు దేశం నుండి బ్రిటిష్ వారిని పారదోలగలం అనే విశ్వాసంతో ఉన్నారు. అయితే ఆ తిరుగుబాటు విఫలం కావడంతో ఈ ఐక్యత కూడా బదాబదలయిపోయింది. హిందూ కులీనులు బ్రిటిష్ వారి సేవలో తరించి పోతుంటే ముస్లింలు తమ అధికారాన్ని కోల్పోయారు. దాదాపు అర్ధశతాబ్దం పాటు ఆంగ్లేయుల మీద ఉన్న ద్వేషంతో ఇంగ్లీష్ విద్యకు దూరంగా ఉన్నారు. బ్రిటిష్ పాలకులు తెలివిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హిందూ-ముస్లింల మధ్య విద్వేషాలను రగిలిస్తూ విభజించి పాలించే తమ విధానానికి పదును పెట్టారు.

దయానంద సరస్వతి కన్నా చాలా దశాబ్దాలకు ముందుగానే రాజా రామ్మోహన్ రాయ్ సంఘ సంస్కరణోద్యమానికి శ్రీకారం చుట్టాడు. బహు దేవతారాధన, విగ్రహారాధనలను రాయ్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఏకేశ్వర వాదాన్ని ప్రచారం చేసాడు. 1815లో 'ఆత్మీయ సభ' పేరిట ప్రారంభించిన సంస్థను 1828లో బ్రహ్మ సమాజంగా మార్చాడు. సతీసహగమనం, బాల్యవివాహాలు, పరదా వంటి అనాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసాడు. 1872లో ప్రత్యేక వివాహ చట్ట రూపకల్పనకు దోహదం చేసాడు.

**ప్రత్యామ్నాయ దృక్పథాలు: ఆధునిక పరిణామాలు**

రాజారామ్మోహన్ రాయ్, స్వామి దయానంద సరస్వతులకు భిన్నమైన దృక్పథాన్ని స్వామి రామకృష్ణ పరమహంస ముందుకు తెచ్చాడు. నిజమైన ఆధ్యాత్మిక వాది తరతమ భేదాలను అధిగమించినప్పుడే పరమహంస స్థాయికి చేరుకుంటారని బోధించాడు. 'యధోమత తధోపథ' (ఎన్ని దృక్పథాలో అన్ని మార్గాలు) అని ప్రకటించాడు. ఇస్లాం, క్రైస్తవ మతాలను కూడా ఆచరించి మతాల మధ్యన భేదభావాలు లేవని స్పష్టం చేసాడు. అయితే హిందూ కులీనులకు ఇలాంటి సాధికార మతాచారాల పట్ల ఎలాంటి ఆసక్తి లేకపోవడంతో పరమహంస బోధనలు, ఆయన అనుయాయులు నిర్లక్ష్యానికి గురయ్యారు. చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనానికి ఆహ్వానం లేకున్నా హాజరయి తన ప్రసంగం ద్వారా హిందూ మత ప్రత్యేకత గురించి వివరిస్తూ స్వామి వివేకానంద స్వామి సర్వధర్మ సమభావనను ప్రభోదించాడు.

ఈ పరిణామాలన్నీ మతం పేరిట హిందూ-ముస్లిం కులీనులు రేపుతున్న ఘర్షణల వెనుక ఉన్న మోసకారి తనాన్ని బట్టబయలు చేస్తున్నాయి. నిజానికి ఈ కులీనులకు మతం పట్ల అసలయితే అనురక్తి, ఆసక్తులు లేనేలేవు.

20వ శతాబ్దం చివరి నాటికి పెట్టుబడి దారీ విధానం ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలు ఇచ్చేసింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అస్థిత్వాల ఆధారంగా మతఛాందస త్వాన్ని రెచ్చగొడతూ ఉన్నది. మతాచారాలు వాటి మౌలిక భావనల నుండి దూరం జరిగాయి. అవినీతి పరులయిన మత గురువులకు ఎక్కడలేని గౌరవం, రక్షణలు లభిస్తున్నాయి. అంతర్జాతీయంగా చెలరేగుతున్న మతఘర్షణలు వాస్తవానికి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం సాగుతున్నవే తప్ప వాటిలో అసలయిన మలి అంశాలు లేనేలేవు.

**ముగింపు**

మతం అనేది చైతన్యానికి సంబంధించిన కార్యకలాపాలను అనుసరించేది. అయితే సైన్సు భౌతిక ప్రపంచ మర్మాలను అన్వేషిస్తుంది. సైన్సు అనేది ఏది, ఏమిటి, ఎందుకు అనేవి వివరిస్తుంది. కానీ మతం మాత్రం ఏమి ఆచరించాలో నిర్దేశిస్తుంది.

చారిత్రకంగా చూస్తే మానవాళిని మతం రెండు విధాలుగా ప్రభావితం చేసింది. సాహిత్యం, సంగీతం, నృత్యం, గణితం, రసాయన శాస్త్రం, ఖగోళ శాస్త్రం తదితర శాస్త్రాలను అభివృద్ధి పరిచేందుకు తగిన సైద్ధాంతిక దిశా నిర్దేశం చెయ్యడంతో పాటు సంక్షేమ కార్యకలాపాల ద్వారా సమాజంలో సమతుల్యత సాధించేందుకు దోహదం చేసింది. ప్రాచీనకాలపు ఆశ్రమాలు, నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు, రామాయణ - మహాభారత గ్రంథాలు ఇవన్నీ అందులో భాగమే.

మానవ జీవితం ఐహిక, ఆముష్మిక ఆలోచనల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మానవుని చైతన్య పూర్వక కార్యకలాపాలను నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ నాడు లేదు. మతం లేని పక్షంలో మానవులు ఈ భూగోళం మీద అత్యంత వినాశకర ప్రాణికోటిగా తయారై ఉండేది. నేడు నైతిక విలువలు క్షీణించి పోవడం మూలంగా అలవిమాలిన వినిమయ ధోరణులు, అతి ఆధ్యాత్మిక ధోరణులు ప్రబలిపోతున్నాయి. మానవాళి పురోగమనంలో తీవ్ర ఒడిదుడుకులకు దారితీస్తున్నాయి. పారిశ్రామిక విప్లవానంతరం ఆధ్యాత్మిక ఆలోచనా ధోరణులు ధ్వంసం అయిపోయాయి. మానవాళి ఇవాళ ఆధ్యాత్మిక అరాచకత్వంలో చిక్కుకు పోయింది.

విచ్చలవిడి వస్తు వినిమయవాదం జీవితాదర్శంగా మారిపోవడంతో విచ్చలవిడి దోపిడి నెలకొన్నది. గత వందేళ్ళలో ఈ భూమి మీది ప్రకృతి వనరులు 23 రెట్లు అంతరించిపోయాయి. రాబోయే 200 ఏళ్ళలో ఈ భూమి మానవ నివాసయోగ్యం కాకుండా పోతుంది అన్న స్టీఫెన్ హాకింగ్ అంచనా నిజమయ్యే ప్రమాదం ఎదురవుతున్నది.

ప్రస్తుతంలో ఉత్పత్తి లేకుండా, ప్రకృతి వనరులను స్వాహా చేసి లాభాలను పోగేసుకునే దళారి పెట్టుబడిదారీ విధానం మొదలయ్యింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఒక విధేయ సమాజాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది. ఆధిపత్య భావజాలం ప్రజలను కష్టాలు, కడగండ్లకు గురిచేస్తూ నానాటికీ పరాయీకరణకు లోనుచేస్తుంది. కాబట్టి మతం యొక్క చారిత్రక గతితర్కాన్ని మనం పరాయీకరణకు భిన్నంగా ఏకీకరణ సాధించే దృష్టితో పరిశీలించాలి. దురదృష్టవశాత్తు అలాంటి మత ప్రతిఘటనాశక్తులు ఉనికిలో లేకుండా పోయాయి.

**(అనువాదం : కె.సత్యరంజన్)**

# డబ్ల్యుఇఎఫ్ వేదికగా సామ్రాజ్యవాదుల కీచులాట

**రోజర్ జోర్డాన్, కీత్ జోన్స్**

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)పై జనవరి13న కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన ప్రసంగం పశ్చిమ దేశాల మధ్య కీచులాటలను స్పష్టంగా ఆవిష్కరించింది. పెట్టుబడిదారీ రాజకీయ నాయకుల, సామ్రాజ్యవాద వ్యూహకర్తల, గ్లోబల్ సిఇవోల, కులీనులైన అపర కుబేరుల ప్రేక్షకుల ముందు కార్నీ ప్రసంగిస్తూ, 'ప్రపంచం ఒక మలుపులో ఉందని, దీనిని పరివర్తన అనడం కన్నా, ప్రపంచ క్రమం విచ్ఛిన్నం' అంటేనే సరిగ్గా ఉంటుందని వ్యాఖ్యానించాడు. భౌగోళిక రాజకీయాల్లో గొప్ప శక్తుల మధ్య వైరానికి ఎలాంటి పరిమితులు లేని క్రూరమైన వాస్తవికతను ఇది ముందుకు తెచ్చిందని ఆయన ఒక్క మాటలో తేల్చి చెప్పేశాడు. అంతేకాదు, అమెరికా నేతృత్వంలోని రెండో ప్రపంచ యుద్ధానంతర ఆర్థిక, భౌగోళిక రాజకీయ క్రమపు పతనం గొప్ప శక్తుల కీచులాటలో కొత్త శకానికి నాంది పలికిందని కూడా సెలవిచ్చాడు. ఈ కొత్త శకంలో బలవంతులు తాము ఏం చేయదలచుకున్నారో అది చేసుకుపోతారు. వాటికి మూల్యం చెల్లించు కోక తప్పని స్థితికి బలహీనులు నెట్టబడతారని చెప్పాడు.

గత శతాబ్దపు సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధాల మాదిరిగానే ప్రపంచాన్ని ఆర్థికంగా, ప్రాదేశికంగా పునర్విభజించడానికి సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణ జరుగుతోందని వ్యాఖ్యానించడం ద్వారా జి-7 కూటమిలో భాగస్వామిగా ఉన్న కార్నీ ఒక చేదు నిజాన్ని అంగీకరించినట్టైంది.

అమెరికా నియంతగా ఎదుగుతున్న డొనాల్డ్ ట్రంప్ గురించి కార్నీ తన ప్రసంగంలో నేరుగా ఎక్కడా ప్రస్తావించకపోవచ్చు, అమెరికా గురించి ఒక్కసారి మాత్రమే ప్రస్తావించి ఉండొచ్చు. కానీ ఒక సంవత్సరం పాటు వాణిజ్య యుద్ధం, అమెరికా సాగిస్తున్న యుద్ధాల తరువాత అగ్ర రాజ్యానికి వ్యతిరేకంగా, తమ సొంత ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం మిగతా సామ్రాజ్యవాద దేశాలు ప్రత్యేకించి యూరపు దేశాలు తనతో కలసిరావాలని కెనడా ప్రధాని ఎలాంటి తటపటాయింపు లేకుండా పిలుపునిచ్చాడనేది జగద్విదితమే.

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సదస్సు ప్రారంభానికి కేవలం మూడు వారాల ముందు వెనిజులాపై దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను ఎత్తుకు రమ్మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించాడు. ఆ దేశంలోని విస్తారమైన చమురు నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఇరాన్‌పై దాడి చేస్తానని పదే పదే హూంకరిస్తున్నాడు. గ్రీన్ ల్యాండ్‌ను తమకు అప్పగించాలని యూరోపియన్ యూనియన్‌లో సభ్యురాలు, నాటో కూటమిలో భాగస్వామి అయిన డెన్మార్క్‌కు హుకుం జారీ చేశాడు. సైనిక శక్తి ద్వారా ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటానన్న ప్రకటనను వ్యతిరేకించినందుకు గాను ఎనిమిది యూరోపియన్ దేశాలపై సుంకాల కొరడా ఝుళిపిస్తానని బెదిరించాడు.

గత ఎనిమిది దశాబ్దాలుగా అమెరికాకు అత్యంత సన్నిహిత భౌగోళిక, రాజకీయ, సైనిక మిత్ర దేశంగా ఉన్న కెనడా అధినేత కార్నీ అమెరికా అధ్యక్షునిపై పేల్చిన మాటల తూటాలు కలకలం రేపాయి. సెప్టెంబరు 11 దాడి జరిగే వరకు అంటే 50 సంవత్సరాలకు పైగా ప్రపంచంలోనే అతి పొడవైన 'రక్షణ లేని సరిహద్దు' (దాదాపు 5,500 మైళ్లు) ను తాము పంచుకున్నామంటూ అమెరికా, కెనడా గొప్పలు పోయేవి. అయితే, చైనా, రష్యా వంటి బలీయమైన శక్తులతో కయ్యానికి కాలు దువ్వుతూ పశ్చిమార్ధ గోళంలో తన పెత్తనానికి ఎదురులేకుండా చూసుకోవాలన్న దుష్ట తలంపులో భాగమే కెనడాపై ట్రంప్ సుంకాల దాడి. ఒక దశలో అమెరికా- మెక్సికో- కెనాడా వాణిజ్య ఒప్పందాన్ని దెబ్బతీస్తానని బెదిరించాడు కూడా. అంతేకాదు, కెనడాను 51వ రాష్ట్రంగా అమెరికాలో కలిపేసుకుంటా నన్నాడు. ఇందుకోసం 'ఆర్థిక శక్తి'ని ఉపయోగించడానికి సైతం వెనుకాడనని హూంకరించాడు.

దీనిపై కార్నీ స్పందిస్తూ వాస్తవికతను గుర్తించుకుంటే మంచిదని నాటోలోని తన మిత్రుణ్ణి హెచ్చరించాడు. రెండవ ప్రపంచ యుద్ధానంతర ప్రపంచాధిపత్యాన్ని సమర్థించుకోడానికి సామ్రాజ్యవాదం తగిలించుకున్న ముసుగే 'నిబంధనల ఆధారిత ప్రపంచ క్రమం'అని కార్నీ వ్యాఖ్యానించాడు. ఈ ప్రపంచ క్రమం వల్ల బాగా లబ్ధి పొందిన కెనడా, యూరోపియన్ దేశాలు ట్రంప్ తాజా చర్యతో కంగుతిన్నాయి. గత రెండు దశాబ్దాలుగా ఆర్థిక, ఆరోగ్య, ఇంధన, భౌగోళిక రాజకీయాల్లో ఎదుర్కొంటున్న వరుస సంక్షోభాల గురించి కార్నీ ప్రస్తావిస్తూ... 'గొప్ప శక్తులు ఆర్థిక సమగ్రతను ఆయుధంగా చేసుకోనారంభించాయి. సుంకాలను అస్త్రంగా చేసుకుని ఆర్థిక, మౌలిక సదుపాయాలను దెబ్బతీయజూస్తున్నాయి. ఈ సుంకాలు సరఫరా గొలుసు (సప్లయి చెయిన్) ను దారుణంగా దెబ్బతీస్తాయి' అన్నాడు. ఈ 'నియమాల ఆధారిత అంతర్జాతీయ క్రమం' వల్ల కెనడా, ఇతర దేశాలు అభివృద్ధి చెందాయి. అందుకే ఆ సంస్థలలో చేరాము. ఆ సూత్రాలను ప్రశంసించాము అని కూడా ఆయన చెప్పాడు.

'నియమాల ఆధారిత అంతర్జాతీయ క్రమం' అన్న దృక్పథం పాక్షికంగా తప్పు. బలంగా ఉన్నవాడు సమయానుకూలంగా తనకు తాను మినహాయించుకుంటాడనీ, వాణిజ్య నిబంధనలు అందరికీ సమానంగా వర్తించవనీ అందరికీ తెలుసు. నిందితుడు లేదా, బాధితుడి స్థాయిని బట్టి అంతర్జాతీయ చట్టాలు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా వర్తిస్తాయి.

**ఈ బేరసారాలు ఎంతో కాలం పనిచేయవు!**

గ్రీన్‌లాండ్ భవిష్యత్తు గురించి అమెరికా సామ్రాజ్యవాదం, దాని పూర్వ యూరోపియన్ మిత్రుల మధ్య చెలరేగిన వివాదం ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు దాకా వెళ్ళింది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానంటూ ట్రంప్ చేసిన బెదిరింపుపై యూరప్ దేశాల నేతలు తీవ్రంగానే స్పందించారు. ట్రంప్ చేష్టలు నాటో, ట్రాన్స్ అట్లాంటిక్ భాగస్వామ్యాన్ని కుప్పకూలుస్తాయని బహిరంగంగానే వ్యాఖ్యానించాడు. కార్నీ వాడినంత కఠినమైన పదజాలాన్ని వారు ప్రయోగించకపోయినా, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి గురించి మాత్రం ప్రస్తావించారు. ట్రాన్స్ అట్లాంటిక్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ఉమ్మడిగా పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని తిరిగి విభజించే

**"'గొప్ప శక్తుల మధ్య పోటీ' తీవ్రతరమవు తున్న నేపథ్యంలో ట్రంప్‌ను, అమెరికాను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ సామ్రాజ్య వాద కూటమి అవసరమని కార్నీ తీర్మానించాడు. డబ్ల్యుఇఎఫ్‌లో కార్నీ చేసిన ప్రసంగంలో కెనడా ను సామ్రాజ్యవాద శక్తిగా కాకుండా 'మధ్యస్థ శక్తి' అని పదే పదే పేర్కొనడం ద్వారా తన దేశపు సామ్రాజ్య వాద దోపిడీ స్వభావాన్ని కప్పిపుచ్చేందుకు యత్నించాడు. గతంలో అమెరికా గ్లోబల్ ఆధిపత్యం, దూకుడు, యుద్ధాలు మొదలైన వాటి నుంచి కెనడా లాభపడింది."**

పోరాటంలో అమెరికా నుండి స్వతంత్రంగా వ్యవహరించే సత్తా కలిగి ఉండాలన్నారు.

ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' నినాదంలో భాగంగా గ్రీన్‌లాండ్‌పై పూర్తి నియంత్రణ తనకే ఉండాలని వాదించాడు. పశ్చిమార్ధ గోళంపై పూర్తి ఆధిపత్యం చెలాయించేందుకు జాతీయ భద్రత (దానినే దన్రో సిద్ధాంతం అంటారు) కు కీలకమైనవిగా భావించే భూ ప్రాంతం, జల మార్గాలు, వనరులు వేటినైనా స్వాధీనం చేసుకునే హక్కు తనకే ఉండాలని ట్రంప్ కోరుకుంటున్నాడు. అమెరికా గ్లోబల్ ఆధిపత్యాన్ని పునరుద్ధరించేందుకు శక్తివంతమైన ప్రత్యర్థులుగా ఉన్న రష్యా, చైనా యూరోపియన్ యూనియన్‌పై యుద్ధానికి అవసరమైన ఒక ముందస్తు షరతుగా ఆయన దీనిని భావిస్తున్నాడు.

ఫిబ్రవరి ఒకటి నుండి అమల్లోకి వచ్చే 10 శాతం సర్‌చార్జిని తొలగించడం ద్వారా గ్రీన్‌లాండ్ సుంకం బెదిరింపు నుండి వెనక్కి తగ్గారు. డబ్ల్యుఇఎఫ్ సదస్సు సందర్భంగా నాటో చీఫ్ మార్క్ రుటేతో విడిగా జరిపిన చర్చల్లో గ్రీన్‌లాండ్‌పై ఒక ఒప్పందం కుదిరిందనీ, అందువల్లే ఈ సుంకాలు వెనక్కి తీసుకుంటున్నాననీ ట్రంప్ చెప్పాడు. అయితే, ఆ చర్చల్లో అవతలి పక్షం నుంచి అంటే డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రతినిధులెవరూ పాల్గొనలేదు. ఒప్పందానికి సంబంధించి ఎటువంటి వివరాలు బయటకు రాలేదు. కానీ బయటకు పొక్కుతున్న వార్తలను బట్టి అమెరికా సైనిక నెట్‌వర్కు, స్థావరాల అపరిమిత విస్తరణకు వీలుగా ఆర్కిటిక్ ద్వీపంలోని ప్రాదేశిక జలాలు, భూ ప్రాంతం, వైమానిక గగనతల ప్రాంతాలను కొన్నిటిని అప్పగించేందుకు అంగీకరించినట్లు తెలిసింది.

ట్రంప్ విదేశాంగ విధాన బెదిరింపులు, ఆకస్మిక మార్పులు 1930వ దశకం చివరిలో జర్మనీ నియంత, ఫాసిస్టు అడాల్ఫ్ హిట్లర్ అనుసరించిన పంథానే అనుకరిస్తున్నట్లుగా ఉంది. అమెరికా మిత్ర దేశాల మధ్య సాగుతున్న అంతర్గత పోరు రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు సంవత్సరాల్లో సామ్రాజ్యవాద శక్తుల మధ్య జరిగిన గొడవను గుర్తు చేస్తున్నాయి. గ్రీన్‌లాండ్‌పై ఒప్పందం నిజంగా కుదిరే ఉంటే అది 1938 సెప్టెంబరులో హిట్లర్, ఇటలీ నియంత ముస్సోలిని, బ్రిటిష్ ప్రధాన మంత్రి నెవిల్లే చాంబర్లీన్, ఫ్రెంచ్ ప్రధాని ఎడ్వర్డ్ దలాడియార్‌తో చెకొస్లొవేకియా భవిష్యత్తుపై కుదుర్చుకున్న డీల్ లాంటిదే అవుతుంది. ఆ ఒప్పందాన్ని 'మన కాలపు శాంతి'గా అప్పటి బ్రిటిష్ ప్రధాని చాంబర్లీన్ అభివర్ణించాడు. ఆ తరువాత కొద్ది నెలలకే హిట్లర్ కొత్త డిమాండ్లు తెరపైకి తెచ్చాడు. చెకొస్లొవేకియా రిపబ్లిక్‌లో మిగిలి ఉన్న భాగాన్ని విభజించాడు. అటు పిమ్మట పోలండ్‌పై కన్నేశాడు.

'గొప్ప శక్తుల మధ్య పోటీ' తీవ్రతరమవు తున్న నేపథ్యంలో ట్రంప్‌ను, అమెరికాను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ సామ్రాజ్యవాద కూటమి అవసరమని కార్నీ తీర్మానించాడు. డబ్ల్యుఇఎఫ్‌లో కార్నీ చేసిన ప్రసంగంలో కెనడా ను సామ్రాజ్యవాద శక్తిగా కాకుండా 'మధ్యస్థ శక్తి' అని పదే పదే పేర్కొనడం ద్వారా తన దేశపు సామ్రాజ్యవాద దోపిడీ స్వభావాన్ని కప్పిపుచ్చేందుకు యత్నించాడు. ఆయన స్వయంగా అంగీకరించినట్లు గతంలో అమెరికా గ్లోబల్ ఆధిపత్యం, దూకుడు, యుద్ధాలు మొదలైన వాటి నుంచి కెనడా లాభపడింది. ఇప్పుడు అమెరికాను ఎదుర్కొనేందుకు మధ్యస్థ శక్తులన్నీ కలసికట్టుగా ముందుకు రావాలని కార్నీ పిలుపు నిచ్చాడు. ఎందుకంటే 'టేబుల్ దగ్గర మనం లేకపోతే, మెనూలో మనం ఉండము' అని చెప్పాడు. ఆయన మాట్లాడే టేబుల్ అంటే భూ భాగాలు పునర్విభజన, సహజ వనరులపై గుత్తాధిపత్యం, చౌకగా శ్రమ దోపిడీ, కార్పొరేట్లకు అధిక లాభాలు ఆర్జించి పెట్టడం వంటి అజెండాతో కూడిన బల్ల అన్నమాట.

కార్నీ పేర్కొన్న 'మధ్యస్థ శక్తుల' కూటమి ప్రధానంగా ఫ్రెంచ్, బ్రిటిష్ సామ్రాజ్యవాద భాగస్వామ్యంతో కూడుకున్నదే అవుతుంది. వీటి వలస సామ్రాజ్యాలు 1945 వరకు ప్రపంచాన్ని ఏలాయి. గత శతాబ్దంలో జర్మన్ సామ్రాజ్యవాదం యూరప్‌ను జయించింది. తన సంక్షోభాన్ని పరిష్కరించుకోడానికి రెండు సార్లు యత్నించింది. యూరోపియన్ శక్తుల ప్రపంచాధిపత్య శక్తి తగ్గినప్పటికీ వాటి సామ్రాజ్యవాద కోరికలు నేడు మరింతగా పెరిగాయి.

యూరోపియన్ శక్తులను కాదని పుతిన్‌తో ఏదో ఒక విధమైన సర్దుబాటు కోసం ట్రంప్ గత సంవత్సర కాలంగా చేస్తున్న యత్నాలను జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ పదే పదే అడ్డుకుంటున్నాయి. ఈ సర్దుబాటు యూరప్‌ను పణంగా పెట్టి రష్యా, ఉక్రెయిన్ రెండింటిలోనూ ముడి పదార్థాలు, మార్కెట్లు పొందేందుకు అమెరికన్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు వీలు కల్పిస్తుంది. ఇది భౌగోళిక వ్యూహాత్మక ప్రభావాన్ని కూడా చూపుతుంది. అందుకే యూరోపియన్ సామ్రాజ్యవాద శక్తులకు ఇది ఎంతమాత్రమూ నచ్చలేదు. రష్యాపై యుద్ధంలో అవి ఇప్పటికే చాలా పెట్టుబడులు పెట్టాయి. ఇప్పుడు దానిని ఒంటరిగా కొనసాగించే సత్తా వాటికి లేదు. అమెరికాను ఇందులో కొనసాగేలా చేసి, యుద్ధాన్ని మరింత ఎగదోయడం ద్వారా వనరుల దోపిడీ, లూటీలో తమ వాటాను పొందాలని యూరప్ సామ్రాజ్యవాద దేశాలు భావిస్తున్నాయి.

జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ డబ్ల్యుఇఎఫ్‌లో చేసిన ప్రసంగంలో కార్నీని పొగిడాడు. ఉక్రెయిన్ యుద్ధానికి లక్ష కోట్ల యూరోలు తగలేసి, పొదుపు చర్యల పేరుతో సంక్షేమ రంగానికి ఎడాపెడా కోతలు పెడుతున్న ప్రభుత్వానికి మెర్జ్ నాయకత్వం వహిస్తున్నాడు. అతని కంటే ఘనుడు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్. ఆయన సైనిక వ్యయాన్ని అమాంతంగా పెంచేశాడు. ఆయన పొదుపుచర్యలను వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చిన కార్మికవర్గంపై నిర్బంధాన్ని ప్రయోగించాడు. ఈ విషయంలో కార్నీ కూడా తక్కువేమీ తినలేదు. ఆయన తన ప్రభుత్వ మితవాద రికార్డు గురించి ఒట్టి గొప్పలు చెప్పుకుంటాడు. సంపన్నులకు పన్నుల్లో భారీగా రాయితీలు, సామాన్యులపై భారాలు ఇదీ ఆయన ప్రభుత్వ నిర్వాకం. 2030 నాటికి సైనిక వ్యయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రకటించడం, సమ్మె హక్కులపై పెద్దయెత్తున దాడి చేయడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడంలో ఆయనకు ఆయనే సాటి. *

# సార్వభౌమత్వానికి తిలోదకాలిస్తున్న బిజెపి ప్రభుత్వం



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఎ కోటిరెడ్డి

తమకు మించిన దేశభక్తులు లేరని డప్పుకొట్టుకొంటున్న బిజెపి ప్రభుత్వం ఏ మాత్రం సందేహించకుండా దేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగడుగునా మన దేశాన్ని, ప్రధానిని అవమానిస్తున్నా కిమ్మనటం లేదు. సామ్రాజ్యవాదుల ఒత్తిడికి లొంగిపోయి దేశ ఆర్థిక ప్రయోజనాలను బలిచేస్తున్నది. నరహంతక ఇజ్రాయిల్‌తో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవటానికి తహతహలాడుతున్నది. దేశ సహజ వనరులను కొల్లగొట్టటానికి, రైతులు, కార్మికులపై దోపిడి తీవ్రత పెంచటానికి దోహదం చేసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. ఈ ఒప్పందాలు దేశప్రజలలో 80 శాతం మందిని మరింత దరిద్రంలోకి నెడతాయి. సామ్రాజ్యవాదానికి అనుకూలంగా వ్యవహరించటం, వారి ప్రయోజనాలకు అనుగుణంగా చేసుకొంటున్న ఒప్పందాలు ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నది. కానీ ఈ విధానాలు మనదేశం ఇప్పటి వరకు సాధించిన అభివృద్ధిని దెబ్బతీయటంతో పాటు, తిరిగి వలస కాలం నాటి దాస్యానికి మనలను తీసుకెళతాయి.

### నరహంతక నెతన్యాహూతో మోడీ ఆలింగనాలు

గాజాలో నివసిస్తున్న పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దారుణమైన మారణకాండకు పాల్పడుతున్నది. బాలలు, వృద్ధులు, ఆసుపత్రులు, ఆహార సరఫరా కేంద్రాలన్న విచక్షణ లేకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత కనీవినీ ఎరుగని హంతకదాడులతో పాలస్తీనా ప్రాంతాన్ని మరుభూమిగా మారుస్తున్నది. ఐక్యరాజ్యసమితి తీర్మానాలను, ప్రపంచదేశాల విజ్ఞప్తులను, ప్రజల ఆందోళనలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ప్రజలను నిలువునా హత్య చేస్తున్నది. పాలస్తీనాతో చేసుకున్న ఒప్పందాలను కూడా ఖాతరు చేయకుండా నిరంతరం దాడులు కొనసాగిస్తున్నది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు నెతన్యాహూను యుద్ధ నేరస్తునిగా ప్రకటించింది. యుద్ధంలో భాగంగా ప్రజలకు ఆహారం అందకుండా చేయటం, పౌర నివాసాలపై దాడులు, సాధారణ ప్రజలను హత్య చేయటం, క్రూరమైన హింసకు పాల్పడటంతో పాటు ఇతర అమానవీయ నేరాలకు నెతన్యాహూ పాల్పడ్డాడని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేరాలపై విచారించి, శిక్ష విధించటం కోసం అంతర్జాతీయ న్యాయస్థానం వారంట్‌ను జారిచేసింది.

ఇజ్రాయిల్‌లో పర్యటించటం, యుద్ధనేరస్తునిగా ప్రకటించిన నెతన్యాహూతో ప్రధాని మోడి ఆలింగనాలు, ఆత్మీయ సమ్మేళనాలు భారతదేశ ప్రతిష్ఠను పూర్తిగా దిగజారుస్తున్నాయి. ఇజ్రాయిల్ పార్లమెంటులో చేసిన ప్రసంగంలో ప్రజలను చంపటాన్ని, ఉగ్రవాద దాడులను ఎవరూ సమర్ధించరాదని నీతి సూత్రాలు వల్లించిన మోడికి పాలస్తీనాలో ఇజ్రాయిల్ సాగించిన మారణకాండ ఉగ్రవాద చర్యగా కనిపించకపోవటం విచిత్రం. 72 వేలమంది పాలస్తీనీయుల హత్యపై కనీసం ప్రస్తావన కూడా చేయకుండా ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని మోడి ప్రకటించారు. అటువంటి నేరాలకు పాల్పడుతున్న దేశంతో రక్షణ భాగస్వామ్యం, సన్నిహిత సంబంధాలు ప్రపంచంలో మనదేశ ప్రతిష్ఠను దిగజారుస్తాయి. అమెరికా పూర్తి మద్దతుతో మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించటం అలీనోద్యమ నాయకురాలిగా మనదేశం సాధించుకున్న ప్రతిష్ఠను పూర్తిగా మంట కలుపుతుంది. మనదేశ సార్వభౌమత్వానికి మాయని మచ్చగా పరిణమిస్తుంది.

స్వతంత్ర విదేశాంగ విధానానికి తిలోదకాలిచ్చిన బిజెపి ప్రభుత్వం సామ్రాజ్యవాదులతో, ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సన్నిహితంగా వ్యవహరించటమే మన దేశ విదేశాంగ విధానం అన్నట్లుగా వ్యవహరిస్తున్నది. ట్రంప్‌ను కలుసుకోవటం, ఆలింగనాలు, మోడి ప్రతిభ వలన అమెరికా అన్ని దేశాల కన్నా మన దేశానికి సన్నిహితంగా ఉంటున్నదని ప్రభుత్వ మద్దతుదారులు ప్రచారం చేసుకొంటున్నారు. ట్రంప్ అడుగడుగునా మన దేశాన్ని అవమానిస్తున్నా, ప్రధానిని కించ పరుస్తున్నా కనీసం నిరసన కూడా తెలుపకుండా ట్రంప్ కటాక్షం కోసం అంగలారుస్తున్నారు.

ట్రంప్‌తో సన్నిహితంగా ఉండటానికి, అమెరికా పాకిస్తాన్ కన్నా మనకే సన్నిహితంగా ఉన్నదని చూయించటానికి మోడి పరివారం ఎంతగా తంటాలు పడుతున్నా, ఈ ప్రాంతంలో పాకిస్తాన్‌ను తన వ్యూహాత్మక మిత్రదేశంగా అమెరికా పరిగణిస్తున్నది. ఆ దేశంతో సంబంధాలను మరింతగా విస్తరించుకోవటానికి, సైనిక సరఫరాలను మరింతగా పెంచటానికి ప్రాధాన్యత ఇస్తున్నది. 2025లో ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయం సాధించామని మన ప్రభుత్వం ప్రకటిస్తుండగా, ఉభయ దేశాల మధ్య ప్రారంభవుతున్న యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ ప్రకటించాడు. మనదేశ ప్రతిష్ఠను దిగజార్చే ఈ ప్రకటనపై మన ప్రధాని మౌనంగా ఉన్నాడు. మంత్రులు, ప్రభుత్వ ప్రతినిధులు నోరు మెదపటం లేదు. ట్రంప్ మాత్రం ఆ ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. మన ప్రధాని, ప్రభుత్వం అమెరికాతో సంబంధాలను గురించి గొప్పగా చెప్పుకొంటుండగా, ట్రంప్ పాకిస్తాన్ సైనిక జనరల్ మునీర్‌తో పాటు సైనికాధికారులకు వైట్‌హౌస్‌లో విందు ఇచ్చి, గంటకు పైగా చర్చలు జరిపాడు. తద్వారా పాకిస్తాన్ తమకు ఎంత సన్నిహిత మిత్రదేశమో మన ప్రభుత్వానికి స్పష్టం చేశాడు.

### ఆర్థికంగా లొంగదీసుకోవటానికి మన దేశాన్ని బెదిరిస్తున్న ట్రంప్

అమెరికా అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన తర్వాత ట్రంప్ మనదేశంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నాడు. ఎగుమతులు-దిగుమతులలో అమెరికాకు ప్రయోజనం కలిగించే విధంగా ఒప్పందాలు చేసుకోవాలని బెదిరిస్తున్నాడు.

> **"అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలతో కుదిరిన ఒప్పందం మనదేశంలోని వ్యవసాయం, ఫార్మా, వస్త్ర, డైరి రంగాలకు మరణ శాసనం అవుతుంది. మనదేశ ఆహారభద్రతకు ప్రమాదంలో పడుతుంది. చిన్నకార్ల ఉత్పత్తిదారులు కూడా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటారు."**

రష్యా నుండి ముడి చమురు, ఇతర సరుకులను దిగుమతి చేసుకుంటున్న దేశాల నుండి అమెరికాలోకి ఎగుమతి అయ్యే సరుకులపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ ప్రకటించాడు. ట్రంప్ నిర్ధయం చెల్లదని ఈ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసినా ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్ 122 కింద 15 శాతం సుంకాలు విధించాడు. రష్యా నుండి ముడి చమురు దిగుమతులను ఆపివేసి, తమ దేశం నుండి దిగుమతులను పెంచుకోవాలని అమెరికా చేస్తున్న ఒత్తిడికి మనదేశం లొంగిపోయి, రష్యా నుండి చమురు దిగుమతులను నిలిపివేయటానికి సిద్ధమయింది. మనదేశానికి అవసరమైన సరుకులు రష్యా నుండి కొనాలా లేదా అన్నది అమెరికా నిర్ణయిస్తుందన్నమాట! ఒక సార్వభౌమత్వ దేశానికి ఇంతకన్నా అవమానకరమైన అంశం ఏముంటుంది? దీనిపై ఇంత వరకు ప్రధాని నోరు మెదపలేదు. కాని రష్యా నుండి కొనుగోలు చేస్తున్న ముడి చమురు పరిమాణం రోజురోజుకు తగ్గిపోతున్నది. రష్యా నుండి తగ్గిన మేరకు అమెరికా నుండి ఆయిల్ కొనుగోలు చేయాల్సివస్తుంది. అమెరికా, వెనిజులా నుండి భారతదేశం ముడి చమురు కొనుగోలు చేస్తుందని కూడా ట్రంప్ ప్రకటించాడు. అంటే మనం రష్యా నుండి తగ్గిన మేరకు అమెరికా లేదా ప్రస్తుతం అమెరికా బహుళజాతి కంపెనీల ఆధిపత్యంలోకి వచ్చిన వెనిజులా నుండి ముడి చమురు కొనుగోలు చేయాలి. రష్యా ముడి చమురు కన్నా అమెరికా కంపెనీలు సరఫరా చేసే ముడి చమురు ధర ఎనిమిది శాతం అధికంగా ఉన్నది. ఈ అధిక ధరల భారాన్నంతా అంతిమంగా దేశప్రజలు భరించాలి.

### మిత్రదేశమైన ఇరాన్‌తో దిగజారుతున్న సంబంధాలు

ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు నిర్మాణంలో భారతదేశం భాగస్వామిగా ఉన్నది. అమెరికా విధించిన ఆంక్షలను ఇరాన్ అమలు చేయకపోవటంతో ఆ దేశంపై కక్షసాధింపు చర్యలకు దిగింది. దానితో అమెరికా ఆదేశాలకు తలొగ్గి మనదేశం ఓడరేవు నిర్మాణ పనుల నుండి క్రమంగా తప్పుకొంటున్నది. చాబహార్ ఓడరేవు, ఇరాన్‌తో సంబంధాలు మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలతో మన దేశ సంబంధాలు వృద్ధి చెందటానికి ఉపయోగపడుతుంది. పైగా ఇరాన్ చారిత్రకంగా మనకు మిత్రదేశంగా ఉన్నది. పాకిస్తాన్‌తో మన దేశానికి వివాదాలొచ్చిన సందర్భాలలో ఇరాన్ మన దేశాన్ని బలపరిచింది. అమెరికా ఒత్తిడికి లొంగిపోయి అటువంటి మిత్రదేశంతో సంబంధాలను తెంచుకోవటం ఆత్మహత్యా సదృశంగా పరిణమిస్తుంది. కానీ అమెరికా ఆదేశాలను పాటించటమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న మోడి ప్రభుత్వం ఇరాన్‌తో సంబంధాలు దిగజారటం వలన ఎదురయే ప్రతికూలాంశాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవటం లేదు.

### అమెరికా, ఇయుతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

ఈ మధ్యకాలంలో యూరోపియన్ యూనియన్‌తో ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నది. అమెరికాతో కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారైందని, త్వరలో సంతకాలు జరుగుతాయని ట్రంప్, అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు ప్రకటించారు. రెండు సార్వభౌమ దేశాల మధ్య ఏ ఒప్పందం జరిగినా ముందుగా ఉభయ దేశాల ప్రతినిధి వర్గాల మధ్య చర్చలు జరుగుతాయి. ఉభయపక్షాలు అంగీకరించిన అంశాలపై ఉమ్మడి ప్రకటన చేస్తారు. కానీ అమెరికాతో జరగబోయే ఒప్పందంలో వీటిలో ఏ ఒక్కటీ జరగలేదు. ఉభయదేశాల మధ్య ఒప్పందం కుదిరిందని ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించాడు. మనదేశ మంత్రులు, ఉన్నతాధికారులు ట్రంప్ ప్రకటనపై నోరు విప్పలేదు. ట్రంప్ ఏం చెబితే అదే ఒప్పందం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఈ అంశంలో కూడా అమెరికా మనదేశ సార్వభౌమత్వానికి విఘాతం కలించేలా వ్యవహరించింది.

అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలతో కుదిరిన ఒప్పందం మనదేశంలోని వ్యవసాయం, ఫార్మా, వస్త్ర, డైరి రంగాలకు మరణ శాసనం అవుతుంది. మనదేశ ఆహారభద్రతకు ప్రమాదంలో పడుతుంది. చిన్నకార్ల ఉత్పత్తిదారులు కూడా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటారు. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మనలను ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించకుండా అడ్డుకోవటానికి, ఆహారాన్ని ఆయుధంగా ఉపయోగించుకొని తమ నయా–వలసవాద విధానాలను రుద్దటానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నం చేశాయి. కానీ మన ప్రజలకు అవసరమైన ఆహారధాన్యాలను మనదేశంలోనే ఉత్పత్తి చేసుకొని, ఆహార స్వయం సమృద్ధిని సాధించే విధానాలను ప్రభుత్వాలు అనుసరించటంతో సామ్రాజ్యవాదుల ఆకాంక్షలు నెరవేరలేదు. అయినప్పటికీ మన దేశ ఆహార స్వయం సమృద్ధిని దెబ్బతీయటానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు మోడి ప్రభుత్వం అమెరికా, ఇయు దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని దెబ్బతీసి, వారి ఆకాంక్షలను నెరవేరుస్తాయి.

ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో జమ్మూ–కాశ్మీర్‌లోని ఆపిల్ రైతులు దివాళా అంచుకు చేరుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, పాల ఉత్పత్తిదారులు అయోమయంలో ఉన్నారు. అమెరికా నుండి 50,000 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకోవటానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ ఒప్పందాలు పూర్తిగా అమలు జరగటం ప్రారంభమై, అమెరికా సరుకులు దేశంలోకి వచ్చి పడితే ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. మనదేశంలోని సంక్షోభంతో పాటు అమెరికా, యూరప్ సామ్రాజ్యవాద దేశాల సంక్షోభ భారాలను కూడా మన ప్రజలు మోయాల్సి వస్తుంది.

### స్వప్రకటిత శాంతిదూతకు శృంగభంగం

తనకుతానుగా శాంతిదూతగా ప్రకటించుకున్న ట్రంప్‌కు రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే విషయంలో శృంగభంగమైంది. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని విరమించాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని రష్యా తిరస్కరించింది. భూభాగం, నాటో సైన్యాన్ని

రష్యా సరిహద్దులకు దూరంగా ఉంచే ప్రాతిపదికపై మాత్రమే శాంతికి సిద్ధమని ప్రకటించింది. రష్యాను తనదారికి తెచ్చుకోవటం కోసం ట్రంప్ ఆర్థిక దిగ్బంధానికి పూనుకున్నాడు. రష్యా నుండి ముడి చమురు, ఇతర సరుకులను దిగుమతి చేసుకునే దేశాల నుండి అమెరికాలోకి ఎగుమతి అయ్యే సరుకులపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తానని ప్రకటించాడు. ట్రంప్ ఆంక్షలు కొంత ఇబ్బంది కలిగించినప్పటికీ, రష్యాను లొంగదీయటం సాధ్యం కాదని గత నాలుగు సంవత్సరాల యుద్ధం రుజువు చేసింది.

“ చైనా సరుకుల దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తానని అమెరికా బెదిరిస్తే, అమెరికా ఏ మేరకు తమ సరుకులపై సుంకాలను విధిస్తే తాము కూడా అమెరికా సరుకులపై అంతే మొత్తం సుంకాలు అదనంగా విధిస్తామని ప్రకటించింది. చైనా సరుకులపై సుంకాలు వేయటం ప్రారంభించగానే చైనా కూడా అమెరికా సరుకులపై సుంకాలు వేయటం ప్రారంభించింది. దానితో అమెరికా దారికి వచ్చి చైనా సరుకులపై సుంకాలు తగ్గించింది. ”

చైనాను బెదిరించటానికి పూనుకుంటే అక్కడా ట్రంప్‌కు ఎదురు దెబ్బ తగిలింది. చైనా సరుకుల దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తానని అమెరికా బెదిరిస్తే, అమెరికా ఏ మేరకు తమ సరుకులపై సుంకాలను విధిస్తే తాము కూడా అమెరికా సరుకులపై అంతే మొత్తం సుంకాలు అదనంగా విధిస్తామని ప్రకటించింది. చైనా సరుకులపై సుంకాలు వేయటం ప్రారంభించగానే చైనా కూడా అమెరికా సరుకులపై సుంకాలు వేయటం ప్రారంభించింది. దానితో అమెరికా దారికి వచ్చి చైనా సరుకులపై సుంకాలు తగ్గించింది.

అమెరికా తమ సరుకులపై అధిక సుంకాలు విధించటాన్ని అనేక దేశాలు ఖండించాయి. తీవ్ర నిరసనలు వ్యక్తమైన తర్వాత అమెరికా సుంకాలను కొంత మేరకు తగ్గించింది. కానీ భారతదేశంపై విధించిన సుంకాలను మాత్రం తగ్గించలేదు. తన బెదిరింపులకు లొంగిన కొద్దీ ట్రంప్ భారతదేశాన్ని మరింత చులకనగా చూస్తున్నాడు. మరింత కఠినమైన షరతులు పెట్టి, ఎక్కువ సుంకాలు విధిస్తున్నాడు.

*

# సామ్రాజ్యవాద దశలో పెట్టుబడి

(13వ పేజీ తరువాయి)

కుదించుకుపోవడం, విలువైన దేశ సంపద కారుచౌకగా విదేశీ సంస్థల పాలు గావడం, వంటివి కొనసాగాలంటే ప్రజల రాజకీయ శక్తిని తగ్గించకుండా ఇవేవీ సాధ్యం కావు. అంటే ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయాలి. ఇందుకోసం అనేక పద్ధతులు ఉన్నాయి. అన్నింటిల్లోకీ శక్తివంతమైనది ఇది: దేశంలో అనేక బూర్జువా, పెటీ బూర్జువా పార్టీలు ఉంటాయి. అవి వేరువేరుగా ఉన్నప్పటికీ, దేశం నుండి పెట్టుబడులు బైటకు తరలిపోతాయన్న భయంతో అవన్నీ ఒకే విధంగా 'సరళీకరణ' విధానాలకు కట్టుబడి వ్యవహరిస్తాయి. అప్పుడు ప్రజలకు రాజకీయంగా ఎవరిని ఎన్నుకోవాలన్న విషయంలో ఎంపిక చేసుకోడానికి అవకాశం ఉండదు. అంతర్జాతీయ స్పెక్యులేటర్ల తీవ్ర లాభాపేక్షను సంతృప్తి పరచడం, ప్రజల అభీష్టాలను నెరవేర్చడానికి కట్టుబడి వ్యవహ రించడం అనే రెండూ ఒకే ఒరలో ఇమిడేవి కావు. ఒకసారి ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్పెక్యులేటర్లకు అనుకూలంగా వ్యవహరించ డానికి నిర్ణయించాక ఇక ప్రజాభీష్టాన్ని అతిక్రమించి ఎలా వ్యవహరించాలన్నదే మిగులుతుంది.

చివరిగా: ఒకసారి సరళీకరణ విధానాల మార్గాన్ని అనుసరించడం ప్రారంభించాక ఈ మూడవ ప్రపంచ దేశాలన్నీ జాతుల నడుమ ఘర్షణల్లో, వేర్పాటువాద ఉద్యమాల్లో, మత విద్వేష సమీకరణల్లో, మత మౌఢ్య ప్రమాదంలో కూరుకుపోతాయి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అనే ఇరుసు చుట్టూ వలయంలో చిక్కుకుపోతాయి. నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం వేర్పాటువాదాల, దురహంకార ఆధిపత్య వాదాల పెరుగుదలకు బాగా దోహదం చేస్తాయి. యుగోస్లావియా ముక్కలు అవడం దీనికి ఒక ఉదాహరణ. ఒకసారి సామ్రాజ్యవాదుల ఆదేశాలకు తలగ్గి ఈ విధానాలను చేపట్టాక సహోదర జాతుల నడుమ పోరాటాలు అనివార్యంగా మూడవ ప్రపంచ దేశాలను ముంచెత్తుతాయి. సామ్రాజ్యవాదానికి విప్లవ శక్తులనుండి సవాలు ఎదురవకుండా ప్రజానీకాన్ని చీల్చి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి ఇవి తోడ్పడతాయి. ఒకపక్క విప్లవ శక్తుల పురోగమనానికి ఆటంకంగా పరిణమిస్తూ రెండోపక్క సామ్రాజ్యవాదుల జోక్యానికి కావలసిన 'సాకులు' అందిస్తాయి. 'మానవ హక్కుల ఉల్లంఘనను అడ్డుకోవడం' అనే పేరుతో నాటో పలు దేశాల్లో జోక్యం చేసుకుంటోంది. ఆర్థిక సంస్కరణలను అడ్డుకున్నా జోక్యం చేసుకుంటామని ఇప్పుడు బహిరంగంగానే ప్రకటించింది. అయితే 'మానవ హక్కుల రక్షణ' అనే సాకు ఎక్కువగా చెల్లుబాటు అవుతుంది.

## సైద్ధాంతికంగా కొత్త ముందడుగు అవసరం

సామ్రాజ్యవాదుల మధ్య ఐక్యత ఇంత పెరిగినా, వైరుధ్యాలన్నీ తీవ్రతరం కావడం ఫలితంగా అనేక ఘర్షణలు, రకరకాల యుద్ధాలు ఈ దశ లోకూడా పెరుగుతూనే వున్నాయి. ఈ పరిణామాలు ఆయా దశల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు వివిధ దేశాల్లో పురోగమించడానికి అనువైన పరిస్థితులను కల్పిస్తాయి. అటువంటి పోరాటాల్లో సాధించే పురోగతిని నిలబెట్టుకో వడం, వివిధ దేశాల్లో పురోగమించే ఉద్యమాల నడుమ సంబంధాలను పెంపొందించుకోవడం, వివిధ పోరాటాల నడుమ పటిష్టమైన సౌహార్ద్ర సంబంధాలను నెలకొల్పుకోవడం, సంపన్న దేశాల్లోని కార్మికవర్గ పోరాటాలతో (ఈ దేశాల్లో నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం, సంక్షేమ పద్దులకు కోతవంటివి స్థానికంగా పెరిగిపోతాయి) సంబంధాలు పెంపొందించు కోవడం జరగాలంటే దానికి సైద్ధాంతికంగా ఒక కొత్త ముందడుగు వేయడం అవసరం. అటువంటి నూతన సిద్ధాంత ప్రాతిపదిక మీదనే సరైన వ్యూహాన్ని ఎత్తుగడలను రూపొందిం చడం సాధ్యపడు తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఇప్పుడు సైద్ధాంతికంగా ఒక శూన్యత నెలకొనివుంది. దానిని పూడ్చడానికి మార్క్సిజాన్ని పునర్నిర్మించాలి. లెనిన్ సామ్రాజ్యవాదం... గ్రంథం ఆ కాలంలో ఏ విధంగా ఆ పని చేయగలిగిందో ఇప్పుడూ అటువంటి పని జరగాలి. అది చేయడానికి ముందు లెనిన్ సామ్రాజ్యవాదం... గ్రంథాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. దానిని అర్థం చేసుకోవాలి.

(స్వేచ్ఛానుసరణ: ఎం.వి.ఎస్.శర్మ)

# అసత్య ప్రచారాల పుట్ట ఆర్‌ఎస్‌ఎస్

(2వ పేజీ తరువాయి)

అని అదే పత్రిక రాసింది. అందువల్లనే సమాఖ్యపు రాజ్యాంగం తెచ్చారు. సమాఖ్య స్వభావం ఈ దేశానికి అసలు లేనేలేదు. ఈ దేశానికి ఉండాల్సింది ఏకత్వ స్వభావం. యూనిటరీ ఫార్మ్. మనది అఖండ భారత్. అది కండ ఖండాలుగా శిథిల మైంది. దీనిని భారత ఉపఖండం అనటం తప్పు అంటుంది ఆర్ఎస్ ఎస్. అంటే ఈ ఆర్ఎస్ఎస్ ప్రకారం ప్రపంచం లోని మెజారిటీ భాగం మనదే అన్నమాట. మాది మాకు ఇవ్వమని ఇప్పుడు తగువుపెట్టు కొని యుద్ధం చేయాలన్నమాట. ఫాసిస్టుల ఆలోచనలకు ఇది సరిగ్గా సరిపోలుతుంది.

ఆర్ఎస్ఎస్ ప్రచారం చేసే అంశాల్లో అతి ముఖ్యమైనది ముస్లిం వ్యతిరేకత. 1980 తర్వాత క్రైస్తవ వ్యతిరేకత కూడా పెద్ద ఎత్తున తెచ్చారు. ముస్లింలను దురాక్రమణదారులుగా, మన దేశం మీద దాడి చేయటానికి వచ్చినవాళ్లుగా, మన సంస్కృతిని ధ్వంసం చేయటానికి వచ్చిన వాళ్ళుగా చిత్రీకరిస్తారు. ముస్లింలను గురించి, క్రిస్టియన్లను గురించి ఆర్ఎస్ఎస్ అధినేత గోల్వాల్కర్ ఎప్పుడు ఏది చెప్పినా కూడా వాళ్లపై అనుమానాలు కల్పించడానికి ప్రయత్నం అందులో ఇమిడి ఉంటుంది. వాళ్ళ జాతీయ భావాన్ని ఆ విధంగా శంకించే విధంగా విషం నూరిపోస్తాడు.

భారత దేశంలో లౌకిక తత్వాన్ని ఆర్ఎస్ ఎస్ అంగీకరించదు. లౌకిక భారత దేశం కావాలనుకునే వారంతా కుహనా సెక్యులరిస్టు లనీ, అన్ని మతాలను అన్ని ధర్మాలను సమానంగా చూసే తత్వం హిందూజాతికే ఉన్నది కనుక హిందుత్వమే నిజమైన లౌకికవాదమని బుకాయిస్తారు. మిగిలిన వారంతా సెక్యులరిజం పేరుతో మైనారిటీలను సంతుష్టీకరించటానికి ప్రయత్నిస్తారని ఆరోపిస్తారు. వాస్తవానికి ముస్లింల గురించి సచార్ కమిటీ చెపిన వాస్తవాలు గమనిస్తే ఆర్ఎస్ఎస్ దుష్ప్రచారం అర్థమవుతుంది. ఈ దేశంలో ముస్లింలు 12% కొన్నిచోట్ల 15% వరకు ఉన్నారు. వారిలో కనీసం రెండు శాతం నుండి మూడు శాతం కూడా ఉద్యోగాలలో లేరు. విద్యా అవకాశాలలో కూడా లేరు. ఉన్నత ఉద్యోగు లలో అసలే పెద్దగా లేరు. ఇది సచార్ కమిటీ రుజువు చేసిన వాస్తవం. కానీ ఆర్ఎస్ఎస్ వాళ్ల సిద్ధాంత గ్రంథాలలో, బహిరంగ ఉపన్యాసాలలో, ముస్లింలను సంతుష్టీకరించ డానికి ప్రయత్నిం చారన్న ప్రచారం మాత్రం పెద్ద ఎత్తున చూస్తూనే ఉన్నారు. అంతేకాదు ఒక అడుగు ముందుకేసి మెజారిటీ మతస్తులను వేధిస్తున్న మైనారిటీలు అంటూ ప్రచారం లంకించుకున్నారు. మైనారిటీలు చేసే హింసతో మెజారిటీ మతస్తులైన హిందువులు అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నట్లు, ప్రభుత్వాలు ముస్లింలకు చేస్తున్న సంతుష్టి కరణ విధానాలను ఉపయోగించుకొని మెజారిటీ మతస్తులపై హింసకు తెగబడుతున్నట్లు విష ప్రచారం చేస్తారు.

భారతదేశానికి ఇండియా అనే పేరు ఎలా వచ్చిందో కొంచెం వివరంగా పరిశీలిద్దాం. దక్షిణ రష్యా నుండి మధ్య ఆసియా వరకు విస్తరించిన ప్రాంతంలో మొదట ఆర్యులు నివసించి ఉండవచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు. మధ్య ఆసియా నుండి అనతోలియా, ఇరాన్‌ల మీదుగా ఇండియాకు వలస వస్తూ మొదట వారు ఇరాన్‌లో కనపడతారు. ఇరాన్‌లోని పారసీకులు లేదా పర్షియన్లు లేదా జోరాస్ట్రియన్లు వీరు ఆర్యులకు రక్తసంబంధీకులు. వారు "స" ను "హ "గా పలుకుతారు. అందు చేత సప్తసింధు ప్రదేశంలో నివాసం ఏర్పరచుకున్న తమ సోదరుల దేశాన్ని వారు "సప్త సిందు" కాకుండా "హప్త హిందు" అన్నారు. అదే క్లుప్తంగా "హిందూ" అయింది. ఇదే విషయం జోరాస్ట్రియన్ల పవిత్ర గ్రంథం అయిన "జెండా అవేస్తా"లో సప్త సింధును "హప్త హిందు"గా పేర్కొన్నారు. ఋగ్వేదంలో సప్త సింధు పేరు అనేక పర్యాయాలు వస్తుంది. తర్వాతి కాలంలో పశ్చిమ దేశాలకు శిరోభూషణంగా ఉన్న గ్రీకులు ఇండియాకు వచ్చారు. వారు "హ" శబ్దాన్ని "ఆ"గా పలుకుతారు. అంటే సింధు శబ్దం "ఇందు"లేక "ఇండ్" అయింది. అదే పదం తర్వాత ఇండ్‌గా ఉచ్చరించడం జరిగింది. ఆ ఇండ్ శబ్దమే తర్వాతి కాలంలో ఇండియా అయింది. ఇండియా అనే పదానికి అంతటి పూర్వ చరిత్ర కలిగి ఉన్నది. అంతటి చరిత్ర కలిగిన ఆ పదాన్ని ఈ బిజెపి ప్రభుత్వం తొలగించడానికి ఇప్పుడు పూనుకున్నది. ప్రజల బ్రతుకులు మార్చటానికి బదులు వీళ్లు కేవలం పేర్లు మారుస్తూ ఉంటారు. ఇలాంటి పనులు కేవలం భావోద్వేగానికే ఉపయోగపడతాయి కానీ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఏమాత్రం ఉపయోగపడవు.

క్రిస్టియన్లు గురించి గోల్వాల్కర్ ఏమంటారో ఆయన మాటల్లోనే చూద్దాం. "ఈనాడు మనదేశంలో నివసిస్తున్న క్రైస్తవ పెద్దమనుషుల పాత్ర ఆ విధంగా ఉంది. వారు ధార్మిక సాంఘిక వ్యవస్థలను భగ్నం చేయటానికి సిద్ధంగా ఉండటమే కాక తమ రాజకీయ ఆధిపత్యాన్ని అనేక స్థావరాల్లోనూ, వీలైతే దేశమంతటాను స్థాపించుకోవడానికి కూడా సంసిద్ధమవుతున్నారు. ఏసుక్రీస్తు యొక్క దివ్యమైన రెక్కల నీడలలో మానవజాతి కంతకు శాంతి, సౌభ్రాతృత్వాలను కూరుస్తామనే ఆకర్షణీయమైన ముసుగు మాటున వారు అడుగుపెట్టిన ప్రతి చోట వారి ప్రవర్తన ఇదే విధంగా ఉంది. దరిద్రులకు, అజ్ఞానులకు, పతితులకు తమకు ఉన్నదంతా ఇవ్వమని యేసు క్రీస్తు తన అనుయాయులకు బోధించాడు. అయితే అతని అనుచరులు ఆచరణలో అనుసరించిందేమిటి? వారెక్కడ ప్రవేశిస్తే అక్కడ తమ రక్తాన్ని అచ్చటి వారికి అర్పించేవారుగా కాక, వారి రక్తాన్ని పీల్చేవారుగా రుజువు చేసుకున్నారు." అందువలన ముస్లింల లాగానే క్రిస్టియన్లు కూడా దురాక్రమణదారులు హిందూ మతాన్ని నాశనం చేయడానికి వచ్చిన వారు అనే అభిప్రాయాన్ని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్ వ్యక్త పరుస్తున్నాడు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో కొన్నింటిలో మతమార్పిడులు వ్యతిరేక చట్టాలు వచ్చాయి. మన రాజ్యాంగం ప్రకారం ఈ దేశంలోనీ పౌరులు తమ ఇష్టం వచ్చిన మతాన్ని అనుసరించవచ్చు. ఏ మతాన్ని పాటించకుండా మతరహితులుగా ఉండే స్వేచ్ఛ కూడా రాజ్యాంగం ప్రసాదించింది. కానీ ఇవాళ ఒక పౌరుడు తన మతం నుండి వేరొక మతానికి మారితే అది కేవలం ప్రలోభాల వల్ల, ఆకర్షణ వల్ల, హింస వల్ల, బెదిరింపుల వల్ల మాత్రమే మతమార్పిడు జరుగుతున్నాయి అనే నేరేషన్ ప్రచారం చేస్తున్నది ఆర్ఎస్ఎస్.

ఆర్ఎస్ఎస్ ఆ ప్రచారంలో భాగమే "లవ్ జిహాద్". ముస్లిం యువకులు హిందూ అమ్మాయిలను ప్రేమలోకి దించి మతమార్పిడి చేస్తున్నారంటూ, ఇంకొక 50 ఏళ్లు దాటితే మన దేశం ముస్లిం దేశంగా మారిపోతుందని విష ప్రచారం చేస్తున్నది ఆర్ఎస్ఎస్. ముస్లింలు ముగ్గురు, నలుగురును పెళ్లి చేసుకుంటారు. అందువలన జనాభా విపరీతంగా పెరుగుతుందని అరుస్తుంటారు. వాస్తవానికి ముస్లింల జనాభా పెరుగుదల రేటు ఎలా ఉందో సెన్సెస్ స్పష్టంగా చెబుతున్నాయి. 2011 సెన్సెస్ ప్రకారం ఫెర్టిలిటీ రేట్‌లో ముస్లింలు నెంబర్ వన్‌గా ఎప్పుడూ లేరు. హిందువులలోనే కొన్ని కులాలలో, కొన్ని ప్రాంతాలలో, వాళ్ల వాళ్ల వృత్తుల అవసరాల దృశ్య ఇద్దరూ లేక ముగ్గురు భార్యలను చేసుకోవడం అన్నది స్పష్టంగా కానవస్తుంది. ఇవన్నీ సామాజిక అధ్యయన

రచయితలు రాసినవే. ఆర్ఎస్ఎస్ అబద్ధాలకు అంతే ఉండదు. దేశ వార్షిక జనాభా సగటు పెరుగుదల రేటు 2.1 ఉంటే ముస్లిం జనాభా పెరుగుదల రేటు 1.9 లేదా 2.0 మాత్రమే ఉన్నదని భారత ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ ఆర్ఎస్ఎస్‌కు తెలిసినప్పటికీ వారి అబద్ధ ప్రచారాలు మాత్రం మానుకోరు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్తే నిజం అదే అని అనుకుంటారని ఆర్ఎస్ఎస్ భావన. ఈ భావనను వీళ్ళ గురువు జర్మనీ వాడైన గొబెల్స్ నుండి నేర్చుకొని అమలు చేస్తుంటారు. హిందూ ధర్మాన్ని పాటించకూడదు అనుకున్న వారు పాకిస్తానికి వెళ్ళిపోండి అని ఆర్ఎస్ఎస్ నాయకులు హెచ్చరికతో కూడిన ప్రకటనలు చేస్తుంటారు. అంటే దేశాన్ని మత రాజ్యాంగంగా మార్చడం ఆర్ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశం అని దీనివలన తేట తెల్లమవుతుంది.

ఇప్పుడు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పది సంవత్సరాలుగా "ఘర్ వాపసి"అని నినాదాన్ని ఎత్తుకున్నారు. గతంలో ఎవరైనా హిందువులు ముస్లింలుగా మారి ఉంటే తిరిగి వెనక్కిరండి. ఈ నినాదం వినటానికి చాలా విన సొంపుగా ఉంటుంది. అలా తిరిగి వచ్చిన వాళ్ళు తాము చేసిన తప్పుకు పశ్చా త్తాపం ప్రకటించి, మళ్లీ హిందూ సంస్కృతిలో కలిసిపోయి, హిందూ ధర్మాన్ని గౌరవిస్తున్నామని భేషరతుగా ప్రకటించాలి. ఇది ఆర్ఎస్ఎస్ యొక్క డిమాండ్. కాసింత లోతుగా ఆలోచిస్తే గతంలో అసలు మతమార్పిడులు ఎందుకు జరిగాయి? దానికి ఆర్ఎస్ఎస్ చెప్పేది ఏమి టంటే ఆనాటి ముస్లిం ప్రభుత్వాలు హింస ద్వారా, బెదిరించడం ద్వారా, ప్రలోభ పెట్టడం ద్వారా ముస్లింలుగా మార్చారు. అంటే హిందువులను వాళ్ళ మతంలోకి లాగేసుకు న్నారు, అని ఆరెస్సెస్ చెబుతూ ఉంటుంది. కానీ భారత సమాజంలో నుండి ఎవరో కొందరు వేరే మతాలు మంచివి, ఇప్పుడున్న మతంలో ఉండలేము అనుకొని వేరే మతం లోకి పోవటానికి కారణాలు ఏమైనా ఉన్నాయా? ఇది జాగ్రత్తగా పరిశీలించాల్సిన అంశమే కదా. హిందూమతంలో ఉన్న కులాలు, వాటి మధ్య ఉన్న అసమానతలు, కుల వివక్ష లు, ఇలాంటి నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఆధిపత్య భావజాలమే అలా మతం మారటానికి ప్రధాన కారణం. ఇప్పుడు వాళ్లని వెనక్కి రమ్మంటున్నారు. బాగానే ఉంది. ఘర్ వాపసి అంటున్నారు. శుద్ధి చేస్తాం రమ్మంటున్నారు. ఇంకా బాగుంది. వారు హిందూమతంలోకి వచ్చిన తర్వాత ఏ కులంలో చేరాలి? ఏ కులంలో ఉంచుతారు? అందరినీ బ్రాహ్మణులుగా మార్చి అడ్జస్ట్ చేస్తారా? ఘర్ వాపసి అయినవారు మీ ఇంట్లో ఏ గదిలో ఉంచుతారు. మీ ఘర్ లోఅనేక గదులు ఉన్నాయి కదా! ఏ గదిలో ఉంచుతావు? బ్రాహ్మణ గది లోన? క్షత్రియ గదిలోన? వైశ్యుల గదిలోన? శూద్రుల గదిలోన? లేక అతిశూద్రుల గదిలోన? ఏ గదిలో? అసలు గుమ్మం లోపలికి రావడానికి వీలు లేని కులాలు కూడా ఉన్నాయి కదా! అలాంటి వాళ్లను అంటరాని కులాలని ముద్రవేసింది కదా హిందూ మతం. మరి వాళ్ళని ఏం చేస్తారు? అంటరాని వాళ్ళుగా ముద్ర వేసి ఊరు వెలుపల ఉండేట్లుగా దూరంగా పెట్టా రే. వాళ్లని ఏం చేస్తారు? అలాంటి వాళ్ళు ఎక్కువ మంది దళితులే ఉన్నారు కదా! వారిని ఏం చేస్తారు? ఇలాంటి దుర్భర పరిస్థితులు హిందూమతంలో ఉన్న కారణంగానే వారు మతం మారి ముస్లింలుగా, క్రైస్తవులుగా మారారు అన్న సత్యాన్ని ముందుగా ఆర్ఎస్ఎస్ గ్రహించాలి. హిందూ మతం వారిని వెలివాడలలో వెలివేసిన కారణంగానే మతం మారారు. ఈ నగ్న సత్యాన్ని వదిలిపెట్టి వాళ్ళను వెనక్కి రమ్మంటున్నారు. ఘర్ వాపసి అని ముద్దు పేరు పెట్టారు. మరి వాళ్ళందర్నీ బ్రాహ్మణులుగా మారుస్తారా! లేక మళ్లీ అంట రానితనానికే గురి చేస్తారా? అందువల్ల ఈ "ఘర్ వాపసి"అనేది కేవలం ఆర్ఎస్ఎస్ ఆడే నాటకం, పచ్చి బూటకం, అసహ్యమైన వాదన.


**ప్రజాస్వామ్యం ఎడల ఆర్ఎస్ఎస్ భావన**

ప్రజాస్వామ్యం అన్నది పశ్చిమ దేశాల భావజాలం. అది భారతదేశానికి పొసగదు అని ప్రకటించాడు గోల్వాల్కర్. సోషలిజం, కమ్యూనిజం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సమానత్వం ఈ మాటలంటేనే ఆర్ఎస్ఎస్ కు ఒళ్ళు కంపరమెత్తుతుంది. గోల్వాల్కర్ తన రచనలలో అసలు ప్రజాస్వామ్యం అన్నది ఎక్కడ అమలులో లేదు. అమలులో ఉండే అవకాశం లేదు. అసలు ప్రజాస్వామ్యం ఏం చేస్తుంది? అది రెండు చెడులకు దారితీస్తుంది. ప్రజాస్వా మ్యం అన్నది ఒకళ్ళను నాయకులను చేసి, వాళ్లలో ఆధిక్య భావన పెంచుతుంది. మిగిలిన వాళ్లందర్నీ సేవకులుగా మార్చి వారిలో ఆత్మ న్యూనతను పెంచుతుంది. కాబట్టి ప్రజాస్వామ్యం అనేది సమాజాన్ని చీలుస్తుంది. అందువల్ల ప్రజాస్వామ్యం ఉండకూడదు అది పనికిరాదు. అంటే నియంతృత్వమే ఉండాలని కోరుకుంటాడు గోల్వాల్కర్. ప్రజాస్వామ్యం ఎడల ఆర్ఎస్ఎస్ కుండే భావనలు ఇవన్న మాట. అందుకే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని తోసి వేసి, దాని స్థానంలో దుర్మార్గమైన మను స్మృతిని రాజ్యాంగంగా ప్రవేశపెట్టాలని కుట్రలు పన్నుతు న్నది ఈ సంఘ పరివారం శక్తులే. ఈ మను స్మృతి క్రీస్తు శకం రెండవ శతాబ్దంలో రాయ బడింది. ఇతర అనేక స్మృతుల కన్నా మనుస్మృతి అత్యంత కిరాతకమైనది దుర్మార్గమైనది. అది శూద్రులకు అమానుషమైన చట్టాలను రూపొందించింది. ఉదాహరణకు శూద్రులు మూడు అగ్రవర్ణాలకు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) నిర్నిబంధంగా సేవ చేయటానికి దేవుడే సృష్టించాడు అని అంటుంది మనుధర్మశాస్త్రం. శూద్రులను పై మూడు అగ్రవర్ణాలకు ఉమ్మడి ఆస్తిగా పరిగణిస్తుంది. శూద్రులకు మాత్రం వేరే ఆస్తి ఏమాత్రం ఉండకూడదు. శూద్రులు బ్రాహ్మణులను తిడితే నాలుక తెగ్గొయ్యాలి. అదే ఒక బ్రాహ్మణుడు శూద్రుడుని తిడితే కేవలం నామమాత్రపు శిక్ష ఉంటుంది. శూద్రుడు బ్రాహ్మణుడిని కొడితే అతని భుజాలు నరికి వేయాలి. శూద్రుడు వేదం వింటే కరిగించిన సీసాన్ని తన చెవిలో పోయాలి. అతను వేదం చదివితే నాలుక తెగ గొయ్యాలి. శూద్రుడు ఒక వివాదానికో, లేక ఒక సంఘటనకు సాక్షిగా ఉంటే, అతను విషం తాగిన చావకుండా ఉన్నప్పుడు, అతను తన శరీరానికి నిప్పు అంటించు కున్న తగలబడకుండా ఉన్నప్పుడే అతని వాదనలను నమ్ముతారు. అని మనుధర్మ శాస్త్రం వక్కాణిస్తుంది. శూద్రులు అగ్రవర్ణాలు వదిలేసిన చిరిగిన బట్టలనే ధరించాలి. వాళ్లు తినగా వదిలేసిన ఆహారాన్ని మాత్రమే శూద్రులు భుజించాలి. విరిగిన మట్టి పాత్రలనే వాడాలి. శూద్రులను సాధారణ మానవుల కంటే పరమ హీనంగా పరిగణించటం కోసం వాళ్లని అసహ్యకరమైన పేర్లతో పిలవాలి అనేదాకా మనుధర్మ శాస్త్రం వెళ్ళింది. ఈ సూత్రాలను ప్రత్యేకించి దళితులు, స్త్రీలపై బలవంతంగా రుద్దారు. మను స్మృతి ప్రకారం బ్రాహ్మణుడి పేరు శుభ సూచకంగానూ, క్షత్రియుడి పేరు బల సూచికంగానూ, వైశ్యుడి పేరు ధన సూచికంగానూ, శూద్రుల పేర్లు జుగుప్స కలిగించే విధంగా ఉండాలని నిర్దేశిస్తుంది మను ధర్మ శాస్త్రం. ఉదాహరణకు దళిత మహర్లు లో "హాగ్ర్య" (మలం), "భీకర్య" (బిచ్చగాడు), "జంగ్ల్య" (ఆటవిక), "ఘక్రియ" (బిచ్చగాడు), లాంటి పేర్లు పెట్టుకోవాలని మను స్మృతి చెపుతుంది. ఈ రకమైన నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ, కుల వివక్ష ఉండాలని అదే న్యాయమని అదే సమాజ హితమని ఈ స్మృతి చెపుతూ ఉంటే అలాంటి భయంకరమైన మను స్మృతిని రాజ్యాంగం గా పెట్టాలని, ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ శక్తులు కుట్రలు పన్నుతున్నాయి. మధ్యయుగాలనాటి మను స్మృతిని ఇప్పుడు రాజ్యాంగంగా పెడితే ఈ సమాజం మధ్యయుగాలికి పోతుందే కానీ సమాజానికి పురోగమనమెక్కడ ఉంటుంది? కులం, జాతి, లింగం, భాషలతో నిమిత్తం లేకుండా చట్టం ముందు అందరూ సమానమని చెప్పే ఇప్పటి రాజ్యాంగానికి బదులు మనిషిని మనిషిగా చూడని అసమానత్వ సమాజాన్ని బోధించే మను స్మృతి పై ఆధారపడ్డ రాజ్యాంగమే ఉండాలని ఆర్ఎస్ఎస్ యొక్క దుష్ట ఆలోచన.

*

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 10 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ప్రపంచ చమురు నిల్వల్లో సగం 5 దేశాల్లోనే..




ప్రపంచంలో ఉన్న చమురు నిక్షేపాల్లో సగ భాగం కేవలం నాలుగు దేశాల వద్ద నిక్షిప్తమై ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలున్న దేశం వెనిజులా. ఇరాన్ మూడవ స్థానంలో ఉంటుంది. ఈ రెండు దేశాలూ తమ చమురు సంపదపై అమెరికా కంపెనీల ఆధిపత్యాన్ని అంగీకరించడం లేదు గనుకనే అమెరికా వీటిపై దాడులకు దిగుతోంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద చమురు నిల్వలున్న దేశం సౌదీ అరేబియా. ఇది అమెరికా కంపెనీల ఆధిపత్యాన్ని అంగీకరిస్తుంది. కెనడా, ఇరాక్‌లు చమురు నిల్వలున్న దేశాల్లో నాలుగు, అయిదు స్థానాలను ఆక్రమిస్తున్నాయి.

అనేక దేశాలు రానురాను మరింతగా పునరుత్పాదక ఇంధన వనరులవైపు మళ్లుతున్నప్పటికీ నేటికీ ప్రపంచ ఇంధన డిమాండ్‌లో 70 శాతం చమురు మీదనే ఆధారపడి ఉంది గనుక చమురు వనరులపై సామ్రాజ్యవాద యుద్ధాలు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెద్దవైన చైనా, భారత్‌లు ఇప్పటికీ చమురు దిగుమతులమీదనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. చైనా తన మొత్తం చమురు డిమాండ్‌లో 75 శాతం దిగుమతి చేసుకుంటుంటుండగా, భారత 88 శాతంపైనే దిగుమతులపై ఆధారపడింది.

ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలున్న వెనిజులాపై అమెరికా ఇటీవల దాడి చేసి ఆ దేశాధ్యక్షుడు నికొలాస్ మదురో, ఆయన సతీమణిని అపహరించి ఆ దేశ చమురు నిల్వలను స్వాధీనం చేసుకున్నది. చమురు నిల్వల్లో రెండో పెద్ద దేశమైన ఇరాన్‌ను కూడా స్వాధీనం చేసుకోడానికి అమెరికా, ఇజ్రాయిల్‌లు దాడులు చేస్తున్నాయి.

చమురు నిల్వల్లో మొదటి అయిదు దేశాల తరువాత యుఎఇ (6వ స్థానం), కువైట్ (7), రష్యా (8), లిబియా (9), అమెరికా (10), నైజీరియా (11), కజకస్థాన్ (12), చైనా (13) స్థానాల్లో ఉన్నాయి. భారత దేశం ప్రపంచ చమురు నిల్వల్లో 22వ స్థానంలో ఉంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు.......................................................
వీధి.....................................................................
గ్రామం.................................................................
మండలం లేదా పట్టణం.........................................
జిల్లా....................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.